ఆర్ష విద్యా తరంగిణి

Inspired by the teachings of

**SWAMI PARAMARTHANANDAJI**

**ITAREYOPANISHAD**

# ఐతరేయోపనిషత్

## స్వామి పరమార్థానంద



ప్రజ్ఞానం బ్రహ్మ

స్వామి పరమార్థానంద బోధనల స్ఫూర్తితో,

వారి ఆశీస్సులతో

**తెలుగు సేత – మద్దూరి / కస్తూరి రాజ్యశ్రీ**

**ITAREYOPANISHAD**
Second Edition - Sankara Jayanthi Year 2023
1000 copies
Sanskrit Support - Sri Desu Chaitanya Krishna
DTP - Smt. Syamala Sripathi, 9966383661

For Copies
K V Raghava Rao
C - 804 Aparna Cyberzon
Nallagandla, Hyderabad 500019
Mobile: 9849092368
Email: raghavkasturi@gmail.com
for softcopy www.telugubhakti.cm

Printed at
Sai Sri Printers
8-3-945 # 21 Pancom Business Centre,
Ameerpet Hyderabad --500073
e-mail : saisriprinters@yahoo.com
Ph.No.040-23730222,Cell:9985530222
Price Rs. 150

# బ్రహ్మయజ్ఞం

**చిన్నారి తల్లేది? బంగారు కొండేది?**

**మురిపాల మున్నేది? మా శ్రీస్నిగ్ధ ఏది?**

అనగానే బుడిబుడి నడకలతో, 'ఇదుగో, ఇక్కడుంది,' అంటూ మా దగ్గరికి వచ్చే మా చిన్నారి స్నిగ్ధే ఇంకా మా కళ్ళముందు దోబూచులాడుతున్నది. కాని చూస్తూండగానే పెరిగి పెద్దయి ఒక ఇంటికి ఇల్లాలు అయింది.

తన చేయి పట్టుకున్న మా అల్లుడు కుందన్, కుందనపు బొమ్మలాంటి మా అమ్మాయిని అత్తారుబత్తెంగా చూసుకుంటే, అతని కనుసన్నల్లో మెలుగుతుంది మా స్నిగ్ధ. ఇద్దరిదీ ఒకటే మాట, ఒకటే బాట. ఏ పని చేసినా, ఇద్దరూ కలిసి చేస్తారు, కష్టసుఖాలు కలబోసుకుంటారు, ఇరు కుటుంబాలనూ అపురూపంగా చూసుకుంటారు.

మా స్నిగ్ధ ఆడపడుచు స్మృతి పెళ్ళి ఈ మధ్య జరిగినప్పుడు, అందరి స్మృతిపథంలో అన్యోన్యజంటగా మిగిలారు ఇద్దరూ. పెళ్ళి బాధ్యతలను తమ భుజస్కంధాలమీద వేసుకుని, ఇరువైపుల అత్తమామలకు చేదోడువాదోడుగా ఉంటూ, హాస్యోక్తులు పంచుతూ, అప్పగింతల్లో ఓదారుస్తూ, అందరినీ పలకరిస్తూ, అంతటా తామై తిరిగారు స్నిగ్ధ, కుందన్‌లు. ఇంటిపేర్లకు తగ్గట్టుగానే ఉంటారు ఈ జంట. కస్తూరి పరిమళాలను మా స్నిగ్ధ వెదజల్లితే, ఆకాశమంత ప్రేమ కురిపిస్తాడు కుందన్.

మా కంటిపాప శ్రీస్నిగ్ధ, మా కంటివెలుగు కుందన్ వయస్సులో చిన్నవారైనా, ఈ బ్రహ్మయజ్ఞంలో మేము సైతం అంటూ ముచ్చటగా మూడోసారి ముందుకు వచ్చారు. ఐతరేయోపనిషత్ పుస్తకప్రచురణ అనే బ్రహ్మయజ్ఞానికి ఆర్థికసహాయాన్ని అందించారు.

మా అమ్మాయి శ్రీస్నిగ్ధ, మా అల్లుడు ఆకాశం కుందన్ కుమార్‌లకు ఆ భగవంతుడు ఆయురారోగ్య ఐశ్వర్యాలను, వంశోద్ధారకుణ్ణి, ఆధ్యాత్మిక చింతనను, జ్ఞానాన్ని, జ్ఞాననిష్ఠను ప్రసాదించమని ఆ భగవంతుణ్ణి వేడుకోవటం తప్ప ఏమని పొగడుదుము?

**రాఘవరావు, రాజ్యశ్రీ**

# విషయసూచిక


| | |
|---|---|
| 1. బ్రహ్మయజ్ఞం | 03 |
| 2. ప్రజ్ఞ | 05 |
| 3. శ్రీ దయానందపంచకం - స్వామి పరమార్థానంద | 06 |
| 4. కో ఉ హమితి | 16 |
| 5. ఆర్ష ఆనంద కుటీర్ సభ్యుల స్పందన | 19 |
| 6. శ్రీగణపతి ప్రార్థన | 22 |
| 7. ఐతరేయోపనిషత్ - ఉపోద్ఘాతం | 23 |
| 8. శాంతిపాఠం | 29 |
| 9. ప్రథమ అధ్యాయం | 37 |
| 10. అనుప్రవేశ శ్రుతిమీద భాష్యం | 73 |
| 12. అధ్యారోప అపవాద విశ్లేషణ | 84 |
| 13. ద్వితీయ అధ్యాయం | 88 |
| 14. తృతీయ అధ్యాయం | 106 |
| 15. ఐతరేయోపనిషత్ - సారాంశం | 123 |

# ప్రజ్ఞ

దశోపనిషత్తులలో ఋగ్వేదానికి సంబంధించిన 'ఐతరేయోపనిషత్తు'లో బోధింపబడిన సాధనా 'ప్రజ్ఞానం బ్రహ్మ' అనే మహావాక్యాన్ని 'సాధనావాక్యం' అని అంటారు.

ఈ సృష్టిలోని అన్ని ప్రాణులలో మానవుడు శ్రేష్ఠుడు ఎందుకు అయ్యాడంటే దానికి కారణం అతనిలోని ప్రజ్ఞయే. మానవులందరిలోని ప్రజ్ఞ భగవంతుని ప్రసాదమే. ఈ విషయాన్ని ఎవరు మరచిపోతారో వారిలో గర్వం మొలకెత్తి అది అహంకారానికి దారితీస్తుంది.

మనందరిలోని తెలివితేటలకు మూలకారణం భగవంతుడు మనకు ప్రసాదించిన 'ప్రజ్ఞయే'. భగవంతుడు మనకు ప్రసాదించిన ప్రజ్ఞతో మనలోని భగవంతుని తెలుసుకుంటేనే మనకు శాంతి. అలా కాక మనలోని ప్రజ్ఞ బహిర్ముఖమై ఎంత ఎదిగినా, ఎన్ని విజయాలు సాధించినా మనిషికి శాంతి లేదు.

మానవ శరీరంలో ఎన్ని భాగాలున్నా అన్నింటికి మించినది ప్రజ్ఞ. అసలీ ప్రపంచం నడుస్తున్నది ప్రజ్ఞతోనే. ప్రజ్ఞావంతుడే బలవంతుడు, ఉన్నతుడు. ప్రజ్ఞను దుర్వినియోగం చేస్తే చేజేతులా మన మనుగడను మనమే ప్రశ్నార్థకం చేసుకున్నవారమౌతాము. గనుక గొప్పదైన, శక్తివంతమైన ప్రజ్ఞతో భగవంతుని తెలుసుకొనమని మన ఋషులు ఉపనిషత్తులద్వారా మనకు ప్రబోధం చేస్తున్నారు.

భగవంతుడు గురువుగారైన స్వామి పరమార్థానందగారి ద్వారా ఇచ్చిన సందేశాన్ని సద్వినియోగం చేసుకుంటూ, ఆ ప్రసాదాన్ని మరింత మందికి పంచాలనే ఉత్సాహం, తపనతో హైదరాబాదు వాసి శ్రీ రాఘవరావ్, శ్రీమతి రాజశ్రీగార్లు దాతల సహాయంతో ఈ ఐతరేయోపనిషత్తును శ్రద్ధగా అందిస్తున్నారు.

దాతలమీద, ప్రచురణకర్తలమీద, సహాయకులమీద ఐతరేయ ఋషి అనుగ్రహం మెండుగా ఉండాలని ఆకాంక్షిస్తున్నాను.

**స్వామి సత్యాత్మానంద,**

**చిన్మయమిషన్, ఒంగోలు.**

# శ్రీ దయానందపంచకం

## - స్వామి పరమార్థానంద

**దయానందరూపం మదాచార్యమీడే**

పూజ్యస్వామీజీ పుట్టినరోజుకి స్వామి పరమార్థానందగారు శ్రీ దయానంద పంచకం రచించారు. 2016 గురుపూర్ణిమ రోజున ఆయనకు అంకితమిస్తూ దీనిద్వారా పూజ్యస్వామీజీమీద తనకున్న గౌరవాన్ని, తనకున్న అనుబంధంతో మేళవించి చెప్పిన మాటలను పరమార్థానందస్వామి పరంగానే చూద్దాము.

సాధారణంగా ఎవరైనా మహాత్ములు సమాధి పొందాక, కీర్తిశేషులు అంటాము. కాని సన్న్యాసి సమాధి చెందాక, **బ్రహ్మలీనః** అంటారు ఉత్తరభారతదేశంలో. అంటే బ్రహ్మలో లీనమయ్యారు అని అర్థం. అలాగే దక్షిణ భారతదేశంలో **విదేహ ముక్తః** అని లేదా **బ్రహ్మీభూతః** అనీ అంటారు. విదేహముక్తః అన్నా కూడా బ్రహ్మలో లయమయ్యాడు అనే అర్థం వస్తుంది. **బ్రహ్మీభూతః** అంటే బ్రహ్మ అయ్యాడు. అయ్యాడు అన్నది లక్ష్యార్థంగా తీసుకోవాలి.

**సదా స్మేరవక్త్రం కృపాపూర్ణనేత్రం**
**స్థిరం దీనమిత్రం జనప్రీతిపాత్రమ్ ।**
**సువిజ్ఞాతశాస్త్రం కషాయాక్తవస్త్రం**
**దయానందరూపం మదాచార్యమీడే ॥ 1**

**'మదాచార్య మీడే'** అన్ని శ్లోకాల్లోనూ వస్తుంది. 'ఈడే' అంటే ప్రణామాలు. 'మదాచార్యమ్' అంటే నా గురువుకు. నా గురువుకు నా ప్రణామాలు. ఆయన పేరు **దయానంద.** పేరుకు తగ్గట్టుగానే ఆయన దయకు, ఆనందానికి ప్రతిరూపాలు.

**సదా స్మేరవక్త్రం కృపాపూర్ణనేత్రమ్ –** ఈ పదాలు దయ, ఆనంద పదాలకు వివరణనిస్తాయి. ఆనందం అంతర్గతస్థితి. అంతర్గత ఆనందం ఎలా వ్యక్తమవుతుంది? చిరునవ్వు చిందించే ముఖంలో. ఆ చిరునవ్వు ఎవరినో చూస్తే వచ్చిపోయేది కాదు. **సదా–** ఎప్పుడూ ఉంటుంది. ఆయన ఎప్పటికీ ఆనంద స్వరూపమే. **కృపాపూర్ణనేత్రం –** కృప అంటే దయ. ఆయన నేత్రాలు ఎప్పుడూ ఎదుట ఉన్నవారిమీద దయను కురిపిస్తూనే ఉంటాయి.

**స్థిరం దీనమిత్రమ్–** ఎదుటివారిమీద దయ కురిపించేటప్పుడు, అది ఎదురెళ్ళి సహాయం చేసేదిగా ఉండేది. ఎవరైనా కొత్త పని మొదలుపెడుతున్నాం, దీవెనలు ఇవ్వండి అని కోరితే, దీవెనలు మాత్రమే ఇచ్చి ఊరుకునేవారు కాదు. ఆయనంతటాయనే ముందుకొచ్చి, ఎటువంటి సహాయం అవసరమైతే, అటువంటి సహాయం అందించేవారు. అందుకే దీనబంధువు అయ్యారు. అది కూడా స్థిరం దీనమిత్రం,ఎప్పుడూ.

**జనప్రీతిపాత్రమ్ –** జనులందరికీ ప్రీతిపాత్రుడు. ఒకసారి స్వామీజీని కలిసిన వారెవరూ ఆయనతో ప్రేమలో పడకుండా ఉండలేరు. ఎందుకంటే, ఎవరేం చెప్పినా శ్రద్ధగా వినేవారు. సభల్లో ఆయన ప్రసంగించినా, విడిగా ఎవరినైనా కలిసినప్పుడైనా, వారి కష్టసుఖాలను మనసు విప్పి చెప్పుకునే అవకాశం ఇవ్వటమే కాక, అవి శ్రద్ధగా విని, చక్కగా జ్ఞాపకం పెట్టుకునేవారు కూడా. అంతకుముందు వారు చెప్పుకున్న విషయాన్నేదో గుర్తుచేసి, అది ఎలా ఉందని అడిగేవారు. అందువల్ల ప్రతి ఒక్కరు, స్వామిజీకి నేనంటేనే చాలా ఇష్టం, స్వామీజీకి నేను ఆత్మీయుణ్ణి అని మురిసిపోయేవారు.

**సువిజాతశాస్త్రమ్ –** శాస్త్రంలో ఆరితేరిన వ్యక్తి. శాస్త్రాన్ని తాను స్వయంగా బాగా ఔపోసన పట్టటమే కాక, దాన్ని దశదిశలా వ్యాపింపజేస్తూ ఉండేవారు.

**కషాయాక్త వస్త్రమ్ –** కాషాయ వస్త్రాన్ని ధరించే వ్యక్తి. అంటే ఆశ్రమ సన్న్యాసి లేదా యతి అంటారు. అటువంటి గురువుకు నా వందనాలు.

**పరబ్రహ్మనిష్ఠం స్వతో ధర్మనిష్ఠమ్**
**అహింసైకనిష్ఠం స్వశిష్యైః సుజుష్టమ్ ।**
**యతీనాం వరిష్ఠం గురూణాం గరిష్ఠం**
**దయానందరూపం మదాచార్యమీడే ॥ 2**

**పరబ్రహ్మనిష్ఠం స్వతో ధర్మనిష్ఠమ్ –** మన ప్రాథమిక గ్రంథం వేదం. వేదంలో రెండు భాగాలున్నాయి. వేదపూర్వభాగం, వేదాంతభాగం. వేద పూర్వభాగం ధర్మం గురించి మాట్లాడుతుంది. జైమిని మహర్షి, దీన్ని వివరిస్తూ ధర్మసూత్రాలు రచించారు. అందులో మొదటి సూత్రం – **అథాతో ధర్మజిజ్ఞాసా.** వేద అంతభాగం బ్రహ్మజ్ఞానం గురించి బోధిస్తుంది. వ్యాసాచార్యులు దీన్ని వివరిస్తూ బ్రహ్మసూత్రాలు రచించారు. అందులో మొదటి సూత్రం **అథాతో బ్రహ్మజిజ్ఞాసా.** అందువల్ల ధర్మసూత్రాలు ధర్మశాస్త్రం, బ్రహ్మసూత్రాలు బ్రహ్మశాస్త్రం బోధిస్తాయి.

స్వామీజీ తరచు చెప్పేవారు **'బ్రహ్మసూత్రాలకు రానిదే ధర్మసూత్రాలు అసంపూర్ణం, ధర్మసూత్రాలు లేనిదే బ్రహ్మసూత్రాలు అసంభవం'** అని.

బ్రహ్మవిద్య నేర్చుకోవాలంటే ధర్మానికి మారుపేరులా ఉండాలి. ధర్మానికి ప్రతీకగా నిలవాలంటే, బ్రహ్మజ్ఞానం కలిగి ఉండాలి. ఒకదానితో ఒకటి పెనవేసుకుని ఉంటాయి.మనం ధర్మంతో మొదలు పెట్టి బ్రహ్మను గురించి నేర్చుకుని, మళ్ళీ ప్రపంచంలోకి అడుగుపెట్టి, మళ్ళీ ధర్మాచరణ చేయాలి. **ధర్మం – బ్రహ్మం – ధర్మం.**

బ్రహ్మ పారమార్థికసత్యం. అక్కడ అద్వైతం. వ్యావహారికసత్యంలో ద్వైతం. ద్వైతభావనే ధర్మం. ద్వైతప్రపంచంలో ధర్మాన్ని ఆచరిస్తూ, పారమార్థిక స్థాయిలో అద్వైతంలో నిలబడటమే ధర్మనిష్ఠ. ధర్మనిష్ఠలో నిలబడితే ఏ సంఘటన జరిగినా దానికి ఆ వ్యక్తి ప్రతిస్పందనలో 'ధార్మిక విలువ' అంటుంది. ధర్మం ఒక నియమం అవుతుంది. ధర్మం భగవంతుడవుతుంది. అతని జీవితం విలువలతో కూడినదై ఉంటుంది. అతను కావాలని ప్రయత్నపూర్వకంగా విలువలను పాటించడు. అతనికి విలువలు సహజంగా అబ్బుతాయి. విలువలకే విలువనిస్తాడు అతను. విలువ గురించి పూజ్యస్వామీజీ తరచు చెప్పేమాట – 'ఒక **విలువ** యొక్క **విలువకు** నువ్వు **విలువ**నిచ్చినప్పుడే, ఒక **విలువ విలువ** అవుతుంది.' మన మనసు, ప్రకృతి సిద్ధాంతం అంటే భగవంతునితో లయమయినప్పుడే మనకి ఒక విలువ విలువైనది అవుతుంది.

ఒక పూజ జరిగాక, పూలు దేవునిమీద వేయటానికి వచ్చేటప్పుడు కూడా ఒక పద్ధతిలో రావాలి. అలా రమ్మని ఏ స్వామీజీ చెప్పనక్కర్లేదు. ఎవరూ చెప్పకుండా నియమాన్ని పాటించే వ్యక్తిని స్వతో ధర్మనిష్ఠః అంటారు. పూజ్యస్వామీజీ **స్వతో ధర్మనిష్ఠః.**

అందువల్ల ఆయన వేదాంతబోధ చేసేటప్పుడు తన జీవితంలో **ధర్మాన్ని** ఎంతగా రంగరించుకున్నారో, అంత బాగా అద్వైతబ్రహ్మ గురించి కూడా జీర్ణించుకున్నారు. పారమార్థిక సత్యం **అద్వైతబ్రహ్మ** అని ఖచ్చితంగా తెలుసుకోవటమే కాదు **ఆ అద్వైతబ్రహ్మ ఎవరో కాదు నేనే** అని అంత ఖచ్చితంగానూ తెలుసు. ఆయన బోధలో దాన్ని ఎంతగా నూరిపోసేవారంటే, ఆయన బోధలు విన్నవారంతా, వద్దనుకున్నా, ఈ సత్యాన్ని జీర్ణించుకుంటారు. 'పారమార్థిక సత్యం అద్వైతబహ్మ. **ఆ అద్వైతబ్రహ్మ ఎవరో కాదు నేనే.'**

అందువల్ల – పరబ్రహ్మ నిష్ఠం అంటే వేదాంతభాగంలో ఉన్నారు; స్వతో ధర్మనిష్ఠం అంటే వేదపూర్వభాగంలో ఉన్నారు. రెండింటిలోనూ ఈ పదాలు ఆయన జీర్ణించుకున్న సత్యాన్నిబట్టి వచ్చాయి. అలా రెండింటిలోనూ నిష్ణాతులాయన.

**అహింసైకనిష్ఠమ్ –** ధర్మం గురించి మాట్లాడేటప్పుడు ఆయన ఎప్పుడూ ఒక విలువ గురించి నొక్కివక్కాణించేవారు. అది **అహింసా పరమో ధర్మః.** దాని వెనుక

ఉన్న తర్కాన్ని అర్థం చేసుకోవటం చాలా తేలిక. ప్రాణమున్న ఏ జీవైనా సరే, బాధపడకూడదు అనుకుంటుంది. ప్రతివారూ నేను సుఖంగా ఉండాలి అనుకుంటారు. ఎప్పుడు? సదా! ఇది సర్వజనీన కోరిక. అందరి కోరిక తీరాలంటే నేనేం చేయాలి? ఎదుటివారికి ఆనందాన్ని ఇవ్వాలి. ఆనందం ఇవ్వకపోయినా ఫర్వాలేదు. కాని కాయిక, వాచిక, మానసిక బాధల్లో ఏదీ ఎన్నడూ ఇవ్వకూడదు. స్వామీజీ మొత్తం ధర్మాన్ని అందంగా ఒక్కముక్కలో అభివర్ణించారు. ధర్మం అంటే ఒక్కటే విలువ – **అహింస** అన్నారు. ఎందుకు? తక్కినవన్నీ అహింసనుంచి పుట్టినవే. ఎందుకు దొంగతనం చేయకూడదు? ఎందుకంటే నేను ఇతరుల సొమ్ము దొంగిలిస్తే, వారు బాధపడుతారు. **ఎదుటివారిని ఏది బాధిస్తుందో, దాన్ని నేను చేయకుండా ఉండాలి.**

అందువల్ల అన్ని విలువలూ అహింసనుంచి పుట్టినవే. **'అష్టాదశ పురాణేషు వ్యాసస్య వచనద్వయమ్। పరోపకారః పుణ్యాయ, పాపాయ పరపీడనమ్'** – ఎంత అందమైన శ్లోకం! కుదిరితే ఇతరులకు ఆనందాన్ని పంచండి. లేదా కనీసం బాధపెట్టకుండా ఉండండి. ఈ రెండు ప్రాథమిక విలువలనూ స్వామీజీ గట్టిగా చెప్పటమే కాక, జీవితాంతం ఆయన కూడా అక్షరాలా పాటించారు.

**స్వశిష్యైః సుజుష్టమ్ –** అహింస పాటించారు కాబట్టి శిష్యులు ఆయనను ఆరాధించే వారు. శిష్యులను వారి స్వభావాలతో పాటుగా స్వీకరించేవారు. ఒకరితో ఒకరిని ఎన్నడూ పోల్చేవారు కాదు. అందుకే వారి గురుకులవాసం ముగిశాక, వారే మార్గం ఎన్నుకుంటే దానిని ప్రోత్సహించేవారే తప్ప ఇదే చేయమని ఎవరినీ బలవంతపెట్టలేదు. 'నీకు ఆచార్యుడవాలని ఉందా? సంతోషం, అక్కడికి వెళ్ళి బోధ చేయి. నీకు ఊళ్ళు తిరగాలని ఉందా, మరీ మంచిది. నీకు ఏర్పాటు చేస్తాను.' ఇలా ఎవరేది అనుకుంటే దానికి ఏర్పాట్లు చేసేవారు. ఆశ్రమాలు స్థాపిస్తానన్నా వాటికి కావాల్సిన ఆర్థికసహాయం చేయటం, స్వయంగా వెళ్ళి చూసిరావటం, మానసికస్థైర్యం ఇవ్వటంలాంటివి చేసేవారు. ఆఖరికి వస్త్రాలంకరణ విషయంలో కూడా స్వేచ్ఛనిచ్చేవారు. శిరోముండనం చేసుకున్నా, చేసుకోకపోయినా ఆక్షేపించేవారు కాదు. కాని **బ్రహ్మాను, ధర్మాన్ని** మాత్రం ఎట్టిపరిస్థితుల్లోనూ వదలవద్దనేవారు.

అందుకే స్వామీజీ ఎన్నడూ ఒక సంస్థని ఏర్పరచాలని గాని, దానికి అధిపతిగా ఉండాలనిగాని కోరలేదు. అప్పుడు సంస్థ నిర్వహణ ప్రముఖస్థానంకి వెళ్ళి, శిష్యుల ఆలనాపాలనా చూడటం తగ్గుతుంది. అది వారి స్వేచ్ఛను కూడా అరికట్టుతుంది. అందుకే స్వామీజీ వ్యక్తిగతంగా తన శిష్యులకు అండగా నిలిచారు తప్ప, ఆశ్రమం తరుపున కాదు.

**ఆర్షవిద్య** స్వామీజీ సంస్థ **కాదు.** అందరూ దాన్ని ఆయన ఆశ్రమంగా భావించి, ఉత్తరాధికారి ఎవరూ అని అడుగుతారు. పీఠం ఉంటే కదా, పీఠాధిపతి ప్రశ్న ఉదయించేది? **అహింస**మీద ఆయనకెంత మక్కువ అంటే, ఒక పీఠం ఉంటే, అది తన శిష్యులకు **హింస** అవుతుంది అని భావించేవారు. జుష్ఠమ్ అంటే ఆరాధన. సుజుష్ఠమ్ అంటే చెప్పలేనంత ఆరాధన. ఎవరికీ; ఆయన శిష్యులకు.

**యతీనాం వరిష్ఠమ్** – సన్న్యాసుల్లో శ్రేష్ఠులు. ఒక సన్న్యాసి పాటించాల్సిన విలువలు పాటించటంలో శ్రేష్ఠులు. ఒక ముఖ్యవిలువ, **ప్రతిఫలాన్ని ఆశించకపోవడం,** ముఖ్యంగా తన శిష్యులనుంచి. భవిష్యత్తు గురించిన సంకల్పం లేదు. **సర్వసంకల్ప సన్న్యాసి.**

**జ్ఞేయః స నిత్యసన్న్యాసీ యో న ద్వేష్టి న కాంక్షతి।**
**నిర్ద్వంద్వో హి మహాబాహో సుఖం బంధాత్ ప్రముచ్యతే॥ గీత 5–3**

అంతర్గతంగా శ్రేష్ఠమైన గురువు. 'బాహ్యంగా ఒక మఠాధిపతి పాటించాల్సిన ఆచారాలు పాటించను,' అని ఆయనే చెప్పుకునేవారు. అంటే ఉదాహరణకు, ఒక సన్న్యాసి చాతుర్మాస వ్రతం పాటించాలి. కాని ఈ గురుపరంపరలో పరంపరగా వచ్చే బోధకి ప్రాముఖ్యతనిచ్చేవారు కాని నియమాలకు కాదు. అందుకని కూడా యతీనాం వరిష్ఠం.

**గురూణాం గరిష్ఠమ్** – బ్రహ్మవిద్యను ఒక క్రమపద్ధతిలో నేర్చుకునేందుకు వీలుగా ఒక కోర్సును తీర్చిదిద్దారు స్వామీజీ. అందుకే గురువులలో శ్రేష్ఠులు. ముందు ప్రాథమిక గ్రంథాలయిన తత్త్వబోధ, ఉపదేశ సారం నేర్చుకోవాలి. దాని తర్వాత భగవద్గీతను సంపూర్ణంగా నేర్చుకోవాలి. దానితర్వాత (పది కాకపోయినా), కనీసం ఆరు ఉపనిషత్తులు నేర్చుకోవాలి. దానిక్కూడా ఒక వరుసక్రమం ఉంది. ముండకం, కేన, కఠ, కైవల్యం, తైత్తిరీయం, మాండూక్యం దాని తర్వాత బ్రహ్మసూత్రాల్లో మొదటి నాలుగూ నేర్చుకోవాలి. వాటిని చతుస్సూత్రీ అంటారు. ఆ విధంగా ప్రస్థానత్రయం నేర్చుకుంటే వేదాంతం బాగా అర్థమవుతుందని అలా తీర్చిదిద్దారు. దాన్ని మూడేళ్ళ కోర్సుగా ఏర్పరచారు.

ఇవికాక కొన్ని ప్రకరణ గ్రంథాలు ఉన్నాయి. ఉదాహరణకు అపరోక్షానుభూతి, వాక్యవృత్తి, దృగ్ద్రృశ్యవివేకము, అద్వైతమకరందము, దక్షిణామూర్తి స్తోత్రము, సాధన పంచకము – ఇవి శాస్త్రం గురించిన విహంగ వీక్షణని ఇస్తాయి. ఇవన్నీ లోతుగా చదివితే, బ్రహ్మవిద్య ఫలాన్ని సంపూర్ణంగా పొందగలరు. పైన చెప్పినవీ, ఇవీ అన్నీ కలిపి స్వామీజీ ఆరు కోర్సులు నడిపారు. ముంబాయ్‌లో రెండు, అమెరికాలో రెండు, కోయంబత్తూర్‌లో రెండు. వీటిద్వారా ఎందరో ఆచార్యులను ఆయన తీర్చిదిద్దారు. వారు వటవృక్షంనుంచి వచ్చిన ఊడలలాంటివారు. ఆ విధంగా సన్న్యాసులు, గృహస్థులు,

బ్రహ్మచారులు– దేశవిదేశాల్లో బ్రహ్మవిద్యను పొందుతున్నారు. వేదాంతమనే వటవృక్షం పూజ్యస్వామీజీ నీడలో దేశదేశాలలో శాఖలను పెంచుకుంటున్నది. అందుకే గురూణాం గరిష్ఠం. శ్రేష్ఠులలో శ్రేష్ఠులు.

**సుశాస్త్రే చరంతం సదా సంచరంతం**
**జనాన్ బోధయంతం భవాదుద్ధరంతమ్।**
**మతాన్‌స్థాపయంతం గురూన్పూజయంతం**
**దయానందరూపం మదాచార్యమీడే॥ 3**

**సుశాస్త్రే చరంతమ్ –** శాస్త్రంలో రమించేవారు. శాస్త్రాన్ని ఆయన ఒక ప్రత్యేక పద్ధతిలో విశ్లేషించేవారు. ఉదాహరణకు అందరికీ తెలిసిన ఈ మంత్రం చూడండి –

**హరే రామ హరే రామ, రామ రామ హరే హరే।**
**హరే కృష్ణ హరే కృష్ణ, కృష్ణ కృష్ణ హరే హరే॥ కలిసంతరణ ఉపనిషత్తు**

ఈ మంత్రం అందరికీ తెలుసు. దీంట్లో పూజ్య స్వామీజీయే ఒక ప్రశ్నవేసి, జవాబు ఇస్తారు. మంత్రంలో హరేరామ, హరేకృష్ణ అని పిలుస్తున్నామే కాని, రాముడు లేదా కృష్ణుడు మనకేసి చూస్తే, ఏమీ కోరటం లేదు. ఎవరినన్నా పిలిస్తే, ఏదన్నా చెప్పాలి కదా! కాని ఇది వేదమంత్రం కాబట్టి మంత్రంలోనే జవాబుండి ఉండాలి అని తీర్మానించారు ఆయన.

ఏమిటది? హరే, రామ, కృష్ణ – పదాలలోనే మన కోరిక నిక్షిప్తమై ఉందిట!

హరిః అంటే పాపాలను, అజ్ఞానాన్ని హరించేది అని అర్థం. **హరతి పాపాన్ అజ్ఞానం చ ఇతి హరిః** అందువల్ల 'హరే' అంటే 'నువ్వు చేయాల్సింది నువ్వు చెయ్యి.' దానికి స్వామీజీ ఒక ఉదాహరణ కూడా ఇస్తారు. స్టేషన్‌లో టీ అమ్మే వ్యక్తి 'టీ, టీ,' అని అరుస్తాడు. మనం కూడా 'టీ,' అని పిలుస్తాము. అతను అర్థం చేసుకుని వస్తాడు. 'ఎందుకు, ఏమిటి? ' అని అడగడు. అలాగే 'ఓ హరీ,' అని పిలిచినప్పుడు ఏం చేయాలి దేవుడు? మన పాపాన్ని, అజ్ఞానాన్ని హరించాలి. అంటే అంతఃకరణ శుద్ధిచేయాలి.

కృష్ణ అంటే నాకు దారి చూపించు. నన్ను ప్రేయోమార్గంనుంచి శ్రేయోమార్గం వైపు మళ్ళించు. నాకు ప్రియమైన దాన్ని నేను ఎన్నుకుంటున్నాను. కాని అది శ్రేయస్కరమైనది కాదు. అందుకని నాకు శ్రేయస్సునిచ్చే మార్గం వైపు తీసుకువెళ్ళు. అంటే వేదాంత శ్రవణ, మననాలు చేసేలాగా చేయి.

రామ అంటే **రమంతే స్వస్వరూపే ఇతి రామః** నా స్వస్వరూపంలో నిలిచేలా చేయి. శ్రవణ, మననాల ద్వారా**, అహం బ్రహ్మాస్మి** అని తెలుసుకున్నాను. కాని అందులో నిలిచేటట్టు చేయి. అంటే నిదిధ్యాసనం చేసేటట్టు చేయి.

వేదాంత జ్ఞానం పొందాలంటే చిత్తశుద్ధి పెంచుకుని, శ్రవణ, మనన, నిదిధ్యాసనలు చేయాలి. హరేరామ, హరేకృష్ణ అన్న చిన్న ప్రార్థనలో ఈ నాలుగూ నాకు కలిగేటట్టు చేయమని ప్రార్థన నిండి నిబిడీకృతమై ఉందిట. ఎంత లోతైన అవగాహన!

**సదా సంచరంతమ్** – ఎప్పుడూ ప్రయాణాలు చేస్తూనే ఉండేవారు. విమానం దిగగానే క్లాసుకి వెళ్ళిపోయేవారు, అలుపన్నది ఎరుగకుండా.

**జనాన్ బోధయంతమ్** – ప్రయాణం ఎందుకు? డబ్బుకోసం కాదు. జనులకు బోధ చేయటానికి.

**భవాదుద్ధరంతమ్** – బోధ ఎందుకు? వారిని సంసారసాగరంనుంచి లేపటానికి.

**మఠాన్‌స్థాపయంతమ్** – మఠం అంటే గురుకులం. ఎన్నో గురుకులాలు స్థాపించారు.

దేశ విదేశాల్లో వేద అధ్యయనం ఎక్కడ జరుగుతుందో, అదే ఆశ్రమం అంటారు స్వామీజీ.

ఆచార్యుడు బ్రహ్మవిద్య బోధ చేసే ఆశ్రమమే ఆశ్రమం. అందుకని మఠాన్ స్థాపయంతం.

**గురూన్పూజయంతమ్** – తనను ఎంతమంది శిష్యులు పూజించినా, తాను తన గురువును పూజించటం ఎన్నడూ మరిచేవారు కాదు. ఎందరో ఆచార్యులనుంచి తాను నేర్చుకున్నారు, వారందరినీ పూజిస్తుండేవారు.

**కలానాం ప్రచారం దధానం వినమ్రం**
**స్వయం గ్రంథకారం సతాం మానితారమ్।**
**నమత్తాపహారం స్వయం నిర్వికారమ్।**
**దయానందరూపం మదాచార్యమీడే ॥ 4**

**కలానాం ప్రచారమ్** – అన్ని రకాల కళలను ఇష్టపడేవారు. ఎవరికే కళలో ప్రవేశం ఉంటే వారిని ప్రోత్సహించేవారు. మమ్మల్ని పిలిచి సంగీతం పాడమనేవారు. నేను మృదంగం వాయిస్తానని తెలిసి, నాకు చెన్నైనుంచి ముంబై ఆశ్రమానికి మృదంగం తెప్పించారు. నన్ను వాయించమన్నారు! నేను అన్నీ పరిత్యజించాను కదా, **వివిధిషా సన్న్యాసిని** కదా, ఎలా? 'కళలు గొప్పవి. ఆ భగవానుని ఆరాధించటానికి మంచి అవకాశం!' అన్నారు. స్వామీజీయే చాలా బాగా పాడుతారు. తర్వాత **ఆర్షకళా భూషణమ్** స్థాపించి ఎన్నో బహుమతి ప్రదానాలు చేశారు.

**దధానం వినమ్రమ్** – వినయానికి మారుపేరు. మనం వెళ్ళి మాట్లాడితే అంతర్జాతీయంగా ప్రసిద్ధి చెందిన వ్యక్తితో మాట్లాడుతున్నామనుకోము. చాలా సరదాగా హాస్యంగా మాట్లాడేవారు.

**స్వయం గ్రంథకారమ్** – ఆయనే స్వయంగా ఎన్నో పాటలను, భజనలను రచించారు.

**సతాం మానితారమ్** – ఒక సన్న్యాసి తక్కిన సాధువులను, సన్న్యాసులను గౌరవించాలి, వారి సిద్ధాంతం ఏదైనాకూడా. స్వామీజీ బోధ చేసేటప్పుడు, క్లాసులో నిష్పక్షపాతంగా అన్ని సిద్ధాంతాలనూ విశ్లేషించి ఖండించేవారు. కాని ఆ సిద్ధాంతాలను పాటించేవారిని ఎన్నడూ చిన్నచూపు చూడలేదు. నిజానికి తానే ఒక ఆచార్యసభను స్థాపించారు. దానికి అన్ని సాంప్రదాయాలకు చెందిన ఆచార్యులను పిలిచి, వారిని ఉన్నతాసనంలో కూర్చోపెట్టి, తాను మఠాధిపతి కానందున కింద కూర్చునేవారు.

**సమత్తాపహారం** – ఆయన మనస్తత్వ శాస్త్రవేత్త కూడా. మేము ఆశ్రమంలో ఉండగా, మూడేసి లేదా ఆరేసి నెలలకొకసారి స్వామీజీ అనేక రంగాలకు చెందిన వైద్యులను పిలిపించి, మా అందరికీ మొత్తం చెకప్ చేయించేవారు. వారు స్వామీజీతో ప్రత్యేకంగా భిక్ష తీసుకునేవారు. స్వామీజీ అనేవారు, 'అందరు వైద్యులనూ పిలిచాను, కానీ సైకియాట్రిస్ట్‌ని పిలవలేదు. ఎందుకో తెలుసా? నేనే ఆ అంశాన్ని చూసుకుంటాను!' అలాగే సలహా సంప్రదింపులు చేసేవారు. **తాపహారం** – మానసిక బాధలను తొలగించేవారు.

**స్వయం నిర్వికారమ్** – సైకియాట్రిస్ట్‌లకు ఒక సూత్రం ఉంది. వారు కొన్ని గంటలు రోగితో మాట్లాడాక, వారు కాసేపు ఒంటరిగా విశ్రాంతి తీసుకోవాలి. లేకపోతే వారే రోగి అయ్యే ప్రమాదం ఉంది. కాని స్వామీజీ విషయంలో అది వర్తించదు. ఆయన నిర్వికారుడు.

**సదా శాంతిమూర్తిం సదా క్షాంతిమూర్తిం**
**సదా దాంతిమూర్తిం సదా సత్యమూర్తిమ్।**
**ప్రమాణప్రవృత్తిం దిశంతం సుకీర్తిం**
**దయానందరూపం మదాచార్యమీడే।। 5**

**సదా శాంతిమూర్తిమ్** – తను బోధ చేసే ప్రతి ఒక్క విలువను కూడా, తను చెప్పి ఊరుకోలేదు. అక్షరాలా తనే పాటించేవారు. ఆయన ఆ విలువలకు ప్రతీకగా నిలిచారు. ఆ విలువలను అలవోకగా పాటించారు తప్పితే, ప్రయత్నపూర్వకంగానో, కావాలనో

చేయలేదు. స్వామీజీ ఎప్పుడూ చెప్పేవారు. 'విలువలను కావాలని పాటించటం మొదలుపెట్టండి. అదే అలవోకగా వచ్చేస్తుంది.'

**సదా క్షాంతి మూర్తిమ్ –** క్షాంతి అంటే ఓర్పు! అంతులేని ఓర్పు.

**సదా దాంతిమూర్తిమ్ –** ఇంద్రియనిగ్రహం, ముఖ్యంగా వాగింద్రియ నిగ్రహం.

తన శిష్యులు ఎంత పెద్ద తప్పు చేసినా సరే, వారిని సరిదిద్దాల్సిన పద్ధతిలో సరిదిద్దేవారు తప్ప, ఎన్నడూ వారి మనసును కష్టపెట్టలేదు.

**సదా సత్యమూర్తిమ్ –** సత్యానికి మారుపేరు.

**ప్రమాణప్రవృత్తిం దిశంతమ్ –** వేదం తక్కిన ప్రమాణాలకు అతీతమైనది. వేదం ప్రాథమిక ప్రమాణం. 'వేదం ఒక ప్రమాణం' అనే ఈ ప్రత్యేక అంశాన్ని ఆయన మన నరనరాల్లోనూ జీర్ణించుకుపోయేలా నొక్కివక్కాణించేవారు ఎప్పుడూ. అలా ప్రమాణంగా తీసుకోకపోతే వేదాంత జ్ఞానం జ్ఞానంగానే మిగిలిపోతుంది కాని, కావలసిన మార్పు కాదు.

**సుకీర్తిమ్ –** సహజంగా చాలా, చాలా కీర్తిమంతులయ్యారు. అమెరికాలో ముందు గౌరవించారు. ఒకసారి స్వామీజీ తన పుట్టినరోజుకు అమెరికాలో ఉన్నారు. అక్కడ వారు, ఆయన అమెరికాకు చేసిన సేవకు గుర్తింపుగా, ప్రత్యేక జెండా వందన కార్యక్రమం జరిపారు. మన ప్రధానమంత్రి మోడీగారు కూడా అటువంటి గౌరవాన్ని చూపారు.

ఇది పంచకం అంటే ఐదు శ్లోకాలు ఉండాలి. మరి ఆరు ఉన్నాయేంటి అని ఎవరైనా ఆశ్చర్యపోవచ్చు! ఆరోది ఫలం. ఈ పంచకాన్ని చదవాలన్న ఉత్సాహం కలగజేయటంకోసం ఫలశ్రుతి కూడా రాయటం జరిగింది.

**ఇదం పంచకం యః పఠేచ్ఛుద్ధచిత్తః**
**సదా మోక్షమార్గే నితాన్తం ప్రవృత్తః।**
**ప్రసాదాత్ స శాస్తుర్భవేత్ జ్ఞానయుక్తః।**
**స జీవన్మృతో వా భవేన్నిత్యముక్తః॥ 6**

**ఇదం పంచకం యః పఠేత్ –** ఎవరైతే ఈ పంచకాన్ని పఠిస్తారో,

**శుద్ధచిత్తః –** శుద్ధమైన మనసుతో,

**సదా మోక్షమార్గే నితాన్తం ప్రవృత్తః –** ఆ వ్యక్తి ముముక్షువు అయితే, మోక్షం కావాలన్న తీవ్రతపన గనుక ఉండి, గురువు లేకపోతే, ఈ ప్రార్థన అతనికి గురువును పొందటానికి అవసరమైన పుణ్యాన్ని ఇస్తుంది. గురువు ఉంటే, శాస్త్రాధ్యయనం చేసి, జ్ఞానం పొందే అవకాశాన్ని కలుగజేస్తుంది.

**ప్రసాదాత్ స శాస్తుర్భవే జ్ఞానయుక్తః –** గురువు దయవల్ల, ఆ వ్యక్తి జ్ఞానాన్ని పొంది జ్ఞాని అవుతాడు.

**స భవేన్నిత్యముక్తః –** జీవించి ఉండగానే ముక్తి పొందుతాడు. మరణించాక విదేహముక్తి పొందుతాడు.

**జీవన్మృతో వా –** జీవించి ఉండగానూ, మరణించాక కూడా బ్రహ్మవిద్యా ఫలం పొందుతాడు. అంటే పునరపి జననం, పునరపి మరణం చక్రంనుంచి విముక్తుడవుతాడు.

**తెలుగుసేత – మద్దూరి రాజ్యశ్రీ**

# కో౽హమితి

**యది చక్షుషా దృష్టం యది శ్రోత్రేణ శ్రుతం యది త్వచా స్పృష్టం యది మనసా ధ్యాతం యద్యపానేనాభ్యపానితం యది శిశ్నేన విసృష్టమథ కో౽హమితి॥**

ఉపనిషత్తులన్నింటిలోనూ ఉన్న సందేశం ఒకటే అని నిరూపించటానికి, శంకరులవారు నాలుగు వేదాలనుంచి పది ఉపనిషత్తులను ఎంచుకున్నారు.

**బ్రహ్మ సత్యం జగన్మిథ్యా**
**జీవో బ్రహ్మైవ నాపరః॥**

ఇది ఉపనిషత్తులు బోధించే బ్రహ్మజ్ఞానం. ఇలా ఒకటే అంశాన్ని అన్ని ఉపనిషత్తులూ బోధించే పద్ధతిని **గతిసామాన్యదర్శనం** అంటారు. ఈ విషయాన్ని వివరించేటప్పుడు పరమార్థానంద స్వామీజీ – 'పెద్ద ఉపనిషత్తు పెద్ద ఆత్మ గురించీ, చిన్న ఉపనిషత్తు చిన్న ఆత్మ గురించీ చెప్పదు,' అని చెబుతారు. అందువల్ల ఏ ఉపనిషత్తును అధ్యయనం చేసినా ఈ ఒకటి సరిగ్గా జీర్ణించుకుంటే చాలు ఆత్మజ్ఞానం వస్తుంది అనిపిస్తుంది. అంతేకాదు ఒక్కొక్క ఉపనిషత్తులో కొన్ని మహావాక్యాలు ఉంటాయి.

మహావాక్యం అంటే జీవ – ఈశ్వర ఐక్యాన్ని బోధించేది.

**అఙ్గుష్ఠమాత్రః పురుషో మధ్య ఆత్మని తిష్ఠతి**
**ఈశానో భూతభవ్యస్య న తతో విజుగుప్సతే । ఏతద్వైతత్ – కఠ**
**అఙ్గుష్ఠమాత్రః పురుషః – జీవాత్మ**
**ఈశానో భూతభవ్యస్య – పరమాత్మ**
**న తతో విజుగుప్సతే – ఫలం**

ఇలాంటి మహావాక్యాలు ఒకటి రెండు అర్థం చేసుకున్నా చాలు అనుకుంటాము, కాని కనీసం పది ఉపనిషత్తులు అధ్యయనం చేయాలి అంటారు. శ్రవణం నిర్వచనమే అది. ఒక క్రమపద్ధతిలో, క్రమం తప్పకుండా,

కొన్ని సంవత్సరాల పాటు, సమర్థుడైన ఆచార్యుని దగ్గర శాస్త్ర అధ్యయనం చేయాలి. ఇలా ఎందుకు చెప్పారో కొన్ని ఉపనిషత్తులు నేర్చుకుంటే తెలుస్తుంది.

కఠోపనిషత్తులో ఆత్మ నిర్వచనం – **అనుభవిస్తున్న నేనే ఎప్పటికీ ఆత్మను, అనుభవించబడే వస్తువు కాదు ఎన్నటికీ**

ముండకోపనిషత్తులో బ్రహ్మ నిర్వచనం –

**కారణం బ్రహ్మ – ఏకం, నిత్యం, సారం,సత్యం**

**కార్యం జగత్తు – అనేకం, అనిత్యం, అసారం, అసత్యం**

ఇది ఛాందోగ్యంలో బాగా అర్థమవుతుంది.

ఛాందోగ్యోపనిషత్‌లో కార్యంనుంచి కారణానికి ఎలా వెళ్ళాలో, చాలా తేలిగ్గా అర్థమవుతుంది. ముందు పంచభూతాలు సృష్టించబడ్డాయి. వాటినుంచి తక్కిన సృష్టి జరిగింది. ఛాందోగ్యంలో మూడు భూతాలనే చూస్తాము. అగ్ని, నీరు, పృథివీ. తక్కిన రెండింటినీ కలుపుకోవాలి. ఈ మూడు భూతాలకీ మూడు రంగులు చెబుతుంది ఉపనిషత్తు. అవి – అగ్నికి ఎరుపు, నీటికి తెలుపు, పృథివీకి నలుపు. జగత్తులో ఏ రంగు చూసినా వాటిలో ఈ మూడు రంగులే ఉంటాయి. అంటే ఈ మూడు భూతాలనుంచి అవి సృష్టించబడ్డాయి అని వస్తుంది.

**త్రీణి రూపాణీత్యేవ సత్యమ్**

జగత్తు అనే కార్యానికి ఈ మూడు రంగుల మూడు భూతాలే కారణం. మనం ఇంకొంచెం వెనక్కి వెళ్ళాలి. ఈ మూడు భూతాలకు కారణం బ్రహ్మ. అందువల్ల **బ్రహ్మ సత్యం జగన్మిథ్యా.**

అదే ఛాందోగ్యంలో బ్రహ్మ సృష్టి చేసి తానే అనుప్రవేశం చేశాడని వస్తుంది. కాని అది ఈ ఉపనిషత్తులో అంటే ఐతరేయోపనిషత్తులో బాగా అర్థమవుతుంది.

బ్రహ్మ జగత్తును సృష్టించాడు కాని, జీవిని సృష్టించలేదు. తానే జీవిలో చైతన్యంగా **అనుప్రవేశం** చేశాడు. ఎందుకు? లోక వ్యవహారార్థం, బ్రహ్మ జ్ఞానార్థం.

ఉన్నదంతా జడం కదా! నన్ను ఎవరు తెలుసుకుంటారు అనుకున్నాడుట. అందుకని తనే జీవాత్మగా ప్రవేశించాడు. ప్రవేశించక ముందు ఆయన ఆలోచన ఇలా ఉంది. ఈ జీవి ముందు తను శరీరం, ఇంద్రియాలు, మనస్సు అనుకుని వ్యవహారం చేస్తాడు. కాని కొన్నాళ్లయ్యాక కన్ను చూస్తోందని తెలుస్తోంది, మనస్సు ఆలోచిస్తోందని తెలుస్తోందంటే **నేను కన్నుకాదు, నేను మనస్సు కాదు, ఇవేవీ నేను కాకపోతే నేనెవరు**? ఈ ప్రశ్న ఎవరు అడుగుతారు? ఒకరోజు జీవాత్మలో ఉదయిస్తుందని పరమాత్మ ఆశిస్తున్నాడు.

దీని ముక్తాయింపు బృహదారణ్యకోపనిషత్తులో వస్తుంది.

**అహం బ్రహ్మ అస్మి** అని ఎవరు తెలుసుకున్నారు? జీవాత్మనా, పరమాత్మనా? రెండూ ఒకరేనా? భిన్నమా? ఎంత అద్భుతంగా ఉందో చూశారా!

**అహో శాస్త్రమహో శాస్త్రమహో గురురహో గురుః**
**అహో జ్ఞానమహో జ్ఞానమహో సుఖమహో సుఖమ్-పంచదశీ 7-297**

**- మద్దూరి రాజ్యశ్రీ**

# ఆర్ష ఆనంద కుటీర్ సభ్యుల స్పందన

శ్రీమతి మద్దూరి రాజ్యశ్రీగారు ఈ **ఐతరేయోపనిషత్‌ను** అనువదించి అందరికీ అందుబాటులోకి తెచ్చారు. అప్పుడే ఇది ద్వితీయ ముద్రణకు నోచుకుంది. శ్రీమతి రాజ్యశ్రీగారు, కస్తూరి రాఘవరావు గారు నిస్వార్థులు. వారు మాకు గురువులుగా లభించటం మా పూర్వజన్మ సుకృతం. వారి బోధనలు అర్థవంతంగా కథాకథనాలతో, సోదాహరణంగా సాగుతుంది. విషయపరిజ్ఞానం ఆర్జించి, మాకు హృదయానికి హత్తుకునేట్లు వివరిస్తారు.

శ్రీమతి రాజ్యశ్రీగారి రచనలు, అనువాదాలు సులభశైలిలో సరళమైన పదాలతో అర్థం తెలిసేలా ఉంటాయి. వారి కలంనుండి జాలువారిన ప్రతి పదం వెనుక వారి శ్రమ, జ్ఞానాన్ని అందించాలనే ఆకాంక్ష కనపడును. పరమార్థానంద స్వామివారి ఉపన్యాసాల స్ఫూర్తితో మూడు ప్రకరణ గ్రంథాలను, పది ఉపనిషత్తులను, భగవద్గీతను (మూడు షట్కాలు), వేదాంత జీవన విధానమును తెలుగులోకి అనువదించి ప్రచురించారు. "తత్త్వబోధ"తో ప్రాధమిక జ్ఞానం అందించి, మమ్మల్ని ఆత్మజ్ఞానంపట్ల ఆకర్షితులను గావించారు. నా పై గల సద్భావనతో ముందు మాట వ్రాయుటకు అవకాశం కల్పించిన గురువుగార్లకు సుమాంజలులు, కృతజ్ఞతలు.

ఆర్ష ఆనంద కుటీర్‌లో ఆరు సంవత్సరాల క్రితం ఉపనిషత్ బోధ శ్రీకారం చుట్టుకున్నది. ముందుగా గురుదంపతులను పరిచయం చేసిన సూర్యకుమారిగారికి కృతజ్ఞతలు. పది ఉపనిషత్ బోధలు పూర్తి అయినవి. ప్రస్తుతం ఎం ఎస్ టీమ్స్‌లో ఆర్షవిద్య సవివరంగా బోధ చేస్తున్నందుకు గురువర్యులు శ్రీ కస్తూరి రాఘవరావుగారికి, శ్రీమతి రాజ్యశ్రీగారికి హార్ధిక ధన్యవాదాలు తెలియజేస్తున్నాము.

ప్రజ్ఞానం బ్రహ్మ = ప్రజ్ఞానమే బ్రహ్మ. నేనే ఆ బ్రహ్మను. జీవ ఈశ్వర ఐక్యము. ఐతరేయ ఋషి పేరుతో ఈ ఉపనిషత్ ఐతరేయోపనిషత్‌గా ప్రాచుర్యం పొందింది. ఈ ఉపనిషత్ 33 మంత్రాలతో 3 అధ్యాయాలుగా ఉంది. ఋగ్వేదంలో నిబిఢీకృతమైన ఈ ఐతరేయోపనిషత్‌ను శంకరాచార్యులు విశ్లేషించారు. దీనితోపాటు ఇంకా 9 ఉపనిషత్తులకు భాష్యము వ్రాసి

ప్రాచుర్యంలోకి తేవడం జరిగింది. ఏ ఉపనిషత్తు అయినా **బ్రహ్మసత్యం జగత్ మిథ్యా** అని విశదీకరించింది. **"అహం బ్రహ్మోస్మి"** అని తెలుసుకుంటే జ్ఞాని అగును. జ్ఞానికి ఇక్కడే ఇప్పుడే జీవన్ముక్తి, మరణానంతరం విదేహముక్తి లభించును.

సృష్టిప్రకరణం గూర్చి ఒక్కొక్క ఉపనిషత్ ఒక్కోరకంగా వివరించటం గమనార్హము. నిజానికి సృష్టి జరుగలేదని, అవ్యక్తంనుండి వ్యక్తం అయిందని చెబుతారు. పంచభూతాలు సృష్టికి ప్రాతిపదికలుగా, బ్రహ్మ ఉపాదాన నిమిత్తకారణాలుగా ఉండి సృష్టి ప్రక్రియ జరిపినట్లు అన్ని ఉపనిషత్‌లు విశదీకరించాయి. బ్రహ్మ సంకల్పంవల్ల ఈ ఐతరేయోపనిషత్తులో స్థూలప్రపంచ సృష్టి, సూక్ష్మప్రపంచ సృష్టి జరిగాయని వివరించారు.

గోళకాలు, ఇంద్రియాలు, అధిష్ఠాన దేవతాసృష్టి జరిగింది. ఆ దేవతలను, ఆకలిదప్పులకు లోను చేశాడు. దేవతలు తమకు నివాసస్థానం కావాలని బ్రహ్మను వేడుకున్నారు. బ్రహ్మ మొదట ఆవును తరువాత గుర్రాన్ని చూపగా వారికి సరిపోవన్నారు. మనిషి శరీరం తమకు అనువైందని చెప్పాక బ్రహ్మ ఆదేశించినట్టు వారి స్థానాల్లో చేరారు.

ఆకలిదప్పులు తీర్చడానికి జలంనుండి అన్నాన్ని సృష్టించాడు బ్రహ్మ. బాహ్యప్రపంచంలోని శబ్ద, స్పర్శ, రూప, రస, గంధాలన్నీ ఇంద్రియ తృష్ణ తీర్చేవి. సృష్టించిన అన్నం వెనుక ఇద్రియాలు పరుగెత్తి పట్టుకోవాలని ప్రయత్నించాయి. ఏ ఇంద్రియం పట్టుకోలేకపోయింది. అపానము చివరకు పట్టుకున్నది. నోటి ద్వారా లోపలికి పంపింది. వాక్కు, ప్రాణం, చక్షువు, శ్రోత్రం, త్వక్, మనసు, శిశ్నం వీటిలో ఏ ఒక్కటి పట్టుకున్నా ప్రపంచం భిన్నంగా ఉండేది.

11 ద్వారాల ఈ జడమైన శరీరంలోకి పురస్వామిగా, పరమాత్మ అనుప్రవేశం చేశాడు. సర్వవ్యాపి అయిన పరమాత్మ అనుప్రవేశం ఏమిటి? ఒకే సూర్యబింబం వివిధ అద్దాలలో ప్రతిబింబించినట్లు, ప్రతిబింబ చైతన్యంగా ప్రకాశించి జడమైన శరీరాలకి చేతనత్వాన్ని ఇచ్చాడు. జీవాత్మగా వ్యవహరించే పరమాత్మ, జీవాత్మ తన స్వస్వరూపాన్ని గుర్తించకపోతాడా అని భావించాడు.

రెండవ అధ్యాయాన్ని గర్భిణీస్త్రీలు వినరాదని సూచన. పితృశరీరంనుండి రేతస్సుగా మాతృశరీరాన్ని చేరటం మొదటి జన్మ. మాతృశరీరంలో పిండంగా బస చేసి స్వశరీరంగా బహిర్గతం అవడం రెండవ జన్మ. స్వశరీరంతో కర్మఫలాలు అనుభవించాక మరణించి మరొక పితృశరీరాన్ని చేరడం మూడవ జన్మ. ఇందు మరణప్రస్తావన రావడం, బిడ్డ గూర్చి కలలుకనే స్త్రీ వినరాదన్న భావనవల్ల స్త్రీలు ఆత్మజ్ఞానాన్ని పొందవచ్చు అనేది తెలుస్తుంది. జాతి, కుల, లింగభేదాలు జ్ఞానానికి అడ్డు గావని ఈ ఉపనిషత్తు చెప్పింది. నిమ్నజాతికి చెందిన (మహిదాసు) ఐతరేయఋషి ఆత్మజ్ఞానాన్ని పొందాడు అనేది నిజం.

ఈ అవసథల్లో – జననమరణ చక్రబంధంలో చిక్కిన జీవాత్మ పునరపి జననం పునరపి మరణం తప్ప, మోక్షం పొందుట లేదు. వామదేవుడు తల్లిగర్భంలోనే తన పూర్వజన్మ సుకృతంవలన జ్ఞానం పొందుటవల్ల జన్మరాహిత్యం సిద్ధించింది. అంటే ఏ దశలోనైనా, ఎక్కడైనా మోక్షం పొందవచ్చు అనేది స్పష్టంగా తెలిసింది.

అమరత్వసిద్ధికి ఆత్మజ్ఞానమే మార్గం. మనిషి, వృత్తి, ప్రవృత్తి, అనుభవం వెనుక ఉండే చైతన్యము మారని ఎరుక. జ్ఞానిని రాగద్వేషాలు, అహంకార మమకారాలు, భవబంధాలు, మమతానురాగాలు, అభద్రత బాధించవు. తామరాకుపై నీటిబొట్టులా జీవిస్తూ మొదట జీవన్ముక్తి మరణానంతరం విదేహ ముక్తి పొందును.

**మీ శిష్యురాలు**

**కానాల సుమంగళి**

**ఆర్ష ఆనంద కుటీర్ సభ్యురాలు**

# శ్రీగణపతి ప్రార్థన

ఓం గణానాం త్వా గణపతిగ్ం హవామహే
కవిం కవీనాముపమశ్రవస్తమమ్।
జ్యేష్ఠరాజం బ్రహ్మణాం బ్రహ్మణస్పత ఆ నః
శృణ్వన్నూతిభిస్సీద సాదనమ్॥

ప్రణో దేవీ సరస్వతీ వాజేభిర్వాజినీవతీ ।
ధీనామవిత్ర్యవతు । గణేశాయ నమః ।
సరస్వత్యై నమః । శ్రీ గురుభ్యో నమః ।
హరిః ఓమ్ ॥

ఓం శాంతిః శాంతిః శాంతిః॥

# ఐతరేయోపనిషత్

## ఉపోద్ఘాతం

**ఈశ కేన కఠ ప్రశ్న ముండ మాండూక్య తిత్తిరిః।**
**ఐతరేయం చ ఛాందోగ్యం బృహదారణ్యకం తథా॥**

శ్రీశంకరాచార్యులు పది ప్రధాన ఉపనిషత్తులకు భాష్యం వ్రాశారు. వాటిని తేలికగా గుర్తుపెట్టుకునేందుకు వీలుగా పై శ్లోకం రూపంలో చెబుతారు. ఇవి నాలుగు వేదాల్లోంచి గ్రహించబడ్డాయి.

| | | |
|---|---|---|
| ఈశ, బృహదారణ్యకమ్ | – | శుక్లయజుర్వేదమ్ |
| ప్రశ్న, ముండకం, మాండూక్యమ్ | – | అథర్వణ వేదమ్ |
| కేన, ఛాందోగ్యమ్ | – | సామవేదమ్ |
| కఠ, తైత్తిరీయమ్ | – | కృష్ణయజుర్వేదమ్ |
| ఐతరేయమ్ | – | ఋగ్వేదమ్ |

బాష్యం రాయటానకి ఈ పది ఉపనిషత్తులను శంకరాచార్యులవారు ఎంచుకోవటానికి రెండు కారణాలు ఉన్నాయి.

1. బ్రహ్మసూత్రాల్లో వేదవ్యాసులవారు ఈ పది ఉపనిషత్తులనూ ఎక్కువగా వాడారు. బ్రహ్మసూత్రాల్లో ఉపనిషత్తుల్లో ఉన్న వాక్యాలను తీసుకుని వాటిని విశ్లేషించారు. అందువల్ల ఈ ఉపనిషత్తులను అధ్యయనం చేశాక బ్రహ్మసూత్రాలకు వెళితే, వాటిలో ఉన్న తర్కం, మీమాంస, వాదోపవాదాలు తేలిగ్గా అర్థమవుతాయి.

2. **గతి సామాన్య దర్శనార్థమ్ –** ఉపనిషత్తులన్నింట్లోనూ ఉన్న సందేశం ఒకటే అని నిరూపించటానికి, వివిధ వేదాలనుంచి ఈ పై ఉపనిషత్తులను ఏరారు.

**బ్రహ్మ సత్యం, జగన్మిథ్యా జీవో బ్రహ్మైవ నాపరః** ఇది ఉపనిషత్తులో బోధించే బ్రహ్మజ్ఞానం.

ఇదే విషయాన్ని ఒక్కొక్క ఉపనిషత్తు ఒక్కొక్క పద్ధతిలో విశ్లేషిస్తుంది. పంచకోశ వివేకం, అవస్థాత్రయ వివేకం, ఆత్మానాత్మ వివేకంలాంటి పద్ధతులు వాడుతాయి. పద్ధతి వేరైనా లక్ష్యం ఒకటే. జీవ ఈశ్వర ఐక్యం బోధిస్తాయి.

ఒక్కొక్క వేదం ఒక్కొక్క మహావాక్యానికి ప్రసిద్ధి. జీవ ఈశ్వర ఐక్యం సూచించే ఏ మంత్రమైనా కూడా మహావాక్యం కిందే వస్తుంది. అలాంటి మహావాక్యాలు ఉపనిషత్తుల్లో కోకొల్లలు. కాని బాగా ప్రాచుర్యం పొందిన మహావాక్యాలు నాలుగు ఉన్నాయి.

| **మహావాక్యం** | **ఉపనిషత్తు** |
|---|---|
| ప్రజ్ఞానం బ్రహ్మ | ఐతరేయమ్ |
| అహం బ్రహ్మ అస్మి | బృహదారణ్యకమ్ |
| తత్ త్వమ్ అసి | ఛాందోగ్యమ్ |
| అయమాత్మా బ్రహ్మ | మాండూక్యమ్ |

వేదాలను నాలుగు భాగాల క్రింద విడదీయవచ్చు.

1. సంహిత – సూక్తాలు
2. బ్రాహ్మణమ్ – యజ్ఞాలు
3. ఆరణ్యకమ్ – ఉపాసన
4. ఉపనిషత్తు – జ్ఞానమ్

అంటే క్రమంగా మనం భక్తినుంచి, కర్మనుంచి ఉపాసనకు వచ్చి చిత్తశుద్ధి, చిత్త ఏకాగ్రత ఏర్పరచుకుని, జ్ఞానకాండకు రావాలని వేదం అంతరార్థం.

**జ్ఞానయోగానికి రానిదే కర్మయోగం అసంపూర్ణం.**

ఉపనిషత్తుకు వేదాంతం అనీ, జ్ఞానకాండ అనీ, బ్రహ్మవిద్య అనీ, ఆత్మ విద్య అనీ కూడా పేర్లు ఉన్నాయి. **విద విచారణే విద సత్తాయం విద జ్ఞానే విద లాభే! ఏతేషాం ధాతూనాం విషయే వర్తంతే యస్మాత్ తతో వేదాః ఇత్యుక్తమ్॥**

ఇది వేదం నిర్వచనం. బ్రహ్మ గురించిన విచారణ చేసి, బ్రహ్మ ఉన్నాడని చెప్పి, బ్రహ్మజ్ఞానం బోధించి, బ్రహ్మజ్ఞానఫలం గురించి చెప్పేది వేదం.

వేదానికి ఇంకో నిర్వచనం కూడా ఉంది.

**ప్రత్యక్షేణానుమిత్యావా**
**యస్తూపాయో న విద్యతే।**
**ఏనం విదంతి వేదేన**
**తస్మాత్ వేదస్య వేదతా॥**

ప్రత్యక్ష ప్రమాణంచేత, తర్కంచేత తెలియని విషయాన్ని చెబుతుంది కాబట్టి వేదం.

వేదానికి తొమ్మిది పేర్లు ఉన్నాయి.

1. శ్రుతి – ఋషులు విన్నారు.
2. అనుశ్రవము – శిష్యులు విని మళ్ళీ చెప్పారు.
3. త్రయీ – మూడు వేదాలు (అథర్వణ వేదాన్ని ఎక్కువగా చెప్పరు)
4. ఆమ్నాయము – పవిత్ర గ్రంథాలు, పదే పదే వల్లె వేసేవి.
5. సమామ్నాయము – పవిత్ర గ్రంథాలు, పదే పదే వల్లె వేసేవి.
6. ఛందస్సు – ఛందోబద్ధంగా ఉంటుంది.
7. స్వాధ్యాయము – తనకు విధించిన శాఖను చదవటం
8. ఆగమము – మిత్రునిలాగా వచ్చి చేరుతుంది.
9. నిగమము – పదాల ధాతువు చెబుతుంది.

వ్యాసమహర్షి అపౌరుషేయమైన వేదాలను నాలుగుగా విభజించి, తన శిష్యులు నలుగురికి ఒక్కొక్క వేదం బోధించి, వారి ద్వారా వ్యాప్తి చెందించాడు.

ఋగ్వేదమ్ – పైలుడు
యజుర్వేదమ్ – వైశంపాయనుడు
సామవేదమ్ – జైమిని
అథర్వణవేదమ్ – సుమంతుడు

ఉపనిషత్తుకు అనేక పేర్లు ఉన్నాయి అవి –

| | | |
|---|---|---|
| వేదాంతం | – | వేద అంతభాగంలో వస్తుంది. |
| జ్ఞానకాండ | – | జ్ఞానాన్ని బోధిస్తుంది. |
| ఆత్మవిద్య | – | ఆత్మ గురించి చెబుతుంది |
| బ్రహ్మవిద్య | – | బ్రహ్మ గురించి చెబుతుంది. |

వేద అంతభాగంలో ఉండి, జీవ(ఆత్మ), ఈశ్వర(బ్రహ్మ) ఐక్యం గురించిన జ్ఞానాన్ని బోధించేది ఉపనిషత్తు.

ఉపనిషత్తుకు ఆ పేరు ఎందుకు వచ్చింది?

ఉపనిషత్తును విడదీస్తే **ఉప+ని+షద్** అవుతుంది.

**షద్ –** ముందుగా షద్ పదాన్ని చూద్దాము. షద్ అంటే నాశనం చేసేది. సంసారాన్ని నాశనంచేస్తుంది. సంసారానికి మూలకారణమైన అజ్ఞానాన్ని నాశనం చేస్తుంది. అజ్ఞానాన్ని పారద్రోలటంవల్ల దుఃఖనాశనం కలిగి మోక్షప్రాప్తి కలుగుతుంది.

**ని –** ని అంటే నిశ్చయజ్ఞానం. ఆత్మస్వరూపం గురించిన అన్ని సంశయాలనూ పారద్రోలి, నిశ్చయాత్మకమైన జ్ఞానాన్ని కలుగచేస్తుంది.

**ఉప –** ఉప అంటే సమీపం. గురువు సమీపంలో కూర్చుని, ఆయన ద్వారా జ్ఞానాన్ని పొందాలి. వేదాంతం శ్రవణ, మనన, నిదిధ్యాసనల ద్వారానే అర్థం చేసుకోగలము. దానికి గురుశాస్త్ర ఉపదేశం కావాలి. శాస్త్రాన్ని బాగా బోధించే గురువు కావాలి. అటువంటి గురువును శ్రోత్రియ బ్రహ్మనిష్ఠ గురువు అంటారు.

ఇప్పుడు మూడూ కలిపితే ఆచార్యుని సమీపానికి వెళ్ళి ఆత్మజ్ఞానం పొందితే, సంసారాన్ని నాశనం చేసే నిశ్చయజ్ఞానం కలిగిస్తుంది అని అర్థం.

## ఐతరేయోపనిషత్తుకు ఆ పేరెలా వచ్చింది?

ఒక్కొక్క ఉపనిషత్తుకు ఒక్కొక్క పద్ధతిలో పేరు పెట్టారు.

**కేన** – కేనేషితం పతతి ప్రేషితం మనః

**ఈశావాస్యమ్** – ఈశావాస్యమిదగ్ం సర్వమ్.

ఈ రెండు ఉపనిషత్తులు ఈ పదాలతో మొదలయ్యాయి కాబట్టి వాటికి ఆ పేరు వచ్చింది. కాని అన్ని ఉపనిషత్తులకూ ఈ సూత్రం వర్తించదు.

**ప్రశ్న –** ఆరుగురు శిష్యులు ఒక గురువును ప్రశ్నలు అడిగారు కాబట్టి ప్రశ్నోపనిషత్తు.

**ముండకమ్ –** ముండక అనేది ఒక శిరోవ్రతం. అదికాక ముండకోపనిషత్తు తక్కిన ఉపనిషత్తులకు శిరస్సువంటిది. ఉపనిషత్తులను నేర్చుకునేవారు, ఓం ప్రధమంగా ముండకోపనిషత్తును నేర్చుకుంటారు.

**కఠ –** కాఠక ఋషి చెప్పారు కాబట్టి కఠోపనిషత్తు అయింది.

అలా ఒక్కొక్క ఉపనిషత్తుకు ఒక్కొక్క కారణంవల్ల ఆ పేరు వచ్చింది.

ఐతరేయ ఉపనిషత్తుకు ఆ పేరు ఎందుకు వచ్చింది?

ఐతరేయ అనే ఋషినుంచి వచ్చింది కాబట్టి దీనికి ఐతరేయోపనిషత్తు అనే పేరు వచ్చింది.

**ఇతరాయాః పుత్రః ఐతరేయః.**

ఇతర అనే పేరుగల స్త్రీకి పుత్రుడు కాబట్టి ఆయనకు ఐతరేయ అనే పేరు వచ్చింది అంటారు. దీనికి ఇంకో ఉదాహరణ కూడా చెబుతారు.

ఇతర అంటే రెండు అర్థాలు ఉన్నాయి. ఇతర అంటే మొదటి భార్య కాదు, ఇంకో భార్య అని ఒక అర్థం. ఇతర అంటే నిమ్న జాతికి చెందిన స్త్రీ అని కూడా అర్థం వస్తుంది. దానికి కారణం ఐతరేయ ఋషికి ఉన్న ఇంకో పేరు. అది మహిదాసుడు. దాస అనే పేరు నిమ్న సంబంధమైనది.

ఆయన పుట్టు పూర్వోత్తరాలు ఎలా ఉన్నా మనకు అనవసరం. నిజానికి ఋషిమూలం, నదిమూలం గురించి విచారించకూడదు అంటారు. ఆయన జ్ఞానం పొందటంకోసం భూదేవిని ప్రార్థించాడనీ, ఆ దేవి కృపవల్ల జ్ఞానం పొందాడనీ, అందుకనే మహిదాసుడు అంటారనీ కూడా ఒక వివరణ ఉంది. మహి అంటే భూమి. దాసుడు అంటే భక్తుడు. భూదేవికి భక్తుడు. భూదేవి కృపవల్ల ఐతరేయ ఋషి ఐతరేయ బ్రాహ్మణం, ఐతరేయ ఆరణ్యకం, ఐతరేయ

ఉపనిషత్తు భాగాన్ని అందుకుని, మనకు అందచేశారు. అలా జ్ఞానం అందచేయటంవల్ల జ్ఞానానికి ఎవరైనా అర్హులే అని తెలుస్తున్నది.

కర్మకాండ విషయంలో అనేక నిబంధనలు ఉంటాయి. కాని జ్ఞానం ఎవరైనా పొందవచ్చు. మైత్రేయి, గార్గి అనే స్త్రీలు పొందినట్టు ఉంది, నచికేతుడనే బాలుడు పొందినట్టు ఉంది. ఇప్పుడు తక్కువ కులానికి చెందిన వ్యక్తి పొందినట్టు తెలుస్తోంది. అంతేకాదు, ఈ ఉపనిషత్తులోనే ఒకచోట గర్భిణీ స్త్రీలు కనుక ఈ ఉపనిషత్తును వింటున్నట్టు అయితే, దయచేసి బయటకు వెళ్ళండి అని వస్తుంది. అక్కడ గర్భస్థ శిశువును గురించిన వర్ణన వస్తుంది.

**అపక్రామత(న్తు) గర్భిణ్యః.**

గర్భిణీ స్త్రీల గురించి ప్రత్యేకం చెప్పింది కాబట్టి స్త్రీలు కూడా ఉపనిషత్తులు వినవచ్చని తెలుస్తోంది.

అన్ని వేదాలనుంచీ కనీసం రెండు ఉపనిషత్తులకు శంకరులవారు భాష్యం రాస్తే, ఋగ్వేదంనుంచి ఈ ఐతరేయ ఉపనిషత్తుకు మాత్రమే రాశారు. అందువల్ల ఇది చాలా ముఖ్యమైన ఉపనిషత్తు. ఋగ్వేదంకు చెందిన కొంచెం ప్రాచుర్యం పొందిన ఇంకో ఉపనిషత్తు కౌషీతకీ ఉపనిషత్తు. ఐతరేయ ఉపనిషత్తులో నాలుగు ప్రముఖ మహావాక్యాల్లో ఒకటి వస్తుంది.

**ప్రజ్ఞానం బ్రహ్మ**

అందువల్ల కూడా ఈ ఉపనిషత్తు ప్రాముఖ్యాన్ని సంతరించుకుంది.

# శాంతిపాఠం

ప్రతి ఉపనిషత్తుకు ఒక శాంతిపాఠం ఉంటుంది.

ఆ శాంతిపాఠం ఆ వేదానికి చెందినదై ఉంటుంది.

| **ఉపనిషత్తు** | **వేదం** | **శాంతిపాఠం** |
|---|---|---|
| ఐతరేయమ్ | ఋగ్వేదమ్ | వాఙ్మే మనసి ప్రతిష్ఠితా |
| ఈశ,బృహదారణ్యకమ్ | శుక్లయజుర్వేదమ్ | పూర్ణమదః పూర్ణమిదం |
| కఠ, తైత్తిరీయమ్ | కృష్ణయజుర్వేదమ్ | సహ నావవతు ... |
| కేన, ఛాందోగ్యమ్ | సామవేదమ్ | ఆప్యాయంతు ... |
| ప్రశ్న, ముండకం,మాండూక్యమ్ | అథర్వణ వేదమ్ | భద్రం కర్ణేభిః ... |

పైన ఉదహరించిన శాంతి పాఠాలన్నీ రోజూ ప్రార్థన చేస్తే మంచిది. ఉపనిషత్తు నేర్చుకునే విద్యార్థులు శాంతి పాఠం రెండు కారణాలకోసం పఠిస్తారు. ఒకటి శారీరక ఆరోగ్యంకోసం, రెండు ఆటంకాలు తొలగటంకోసం. అంటే జ్ఞానయోగ్యతాప్రాప్తికోసం ప్రార్థిస్తారు.

**ఓం వాఙ్మే మనసి ప్రతిష్ఠితా, మనో మే వాచి ప్రతిష్ఠితమ్ ।**
**ఆవిరావీర్మ ఏధి । వేదస్య మ ఆణీస్థః।**
**శ్రుతం మే మా ప్రహాసీరనేనాధీతేనాహోరాత్రాన్సందధామి।**
**ఋతం వదిష్యామి। సత్యం వదిష్యామి। తన్మామవతు। తద్వక్తారమవతు।**
**అవతు మామవతువక్తారమవతు వక్తారమ్ ॥**

**ఓం శాన్తిః శాన్తిః శాన్తిః ॥**

శాంతి పాఠాల్లో శారీరక ఆరోగ్యం గురించిన ప్రార్థన ఉంటుందని చూశాము. **భద్రం కర్ణేభిః శ్రుణయామ దేవాః భద్రం పశ్యేమాక్షభిర్యజత్రాః**

ఈ శాంతిపాఠంలో చెవులు, కళ్ళు బాగుండాలని ప్రార్థన. ఇప్పుడు మనం చేయబోయే శాంతిపాఠంలో వాక్కు, మనస్సుకు ప్రాముఖ్యత ఉంది. విద్యార్థికి వాక్కు, మనస్సు ముఖ్యం అయితే వేదాంత విద్యార్థికి చాలా ముఖ్యం. **మనస్సు-** మనస్సు అంటే మనస్సుకున్న నాలుగు భాగాలూ ముఖ్యమే.

అవి మనస్సు, బుద్ధి, చిత్తం, అహంకారం. వేదాంతం వింటున్నప్పుడు, చెవి వెనుక మనస్సు లేకపోతే, వేదాంత పాఠం బోధపడదు. మనస్సు రాగద్వేషాలతో మండిపడుతున్నా శ్రద్ధ చూపలేదు. దిగులు, బెంగలతో కృంగిపోతున్నా శ్రద్ధ చూపలేదు. వేదాంతానికొచ్చేసరికి బుద్ధి చాలా పదునుగా ఉండాలి. అందుకే ఒక శాంతిపాఠంలో నా మేధాశక్తి పదునుగా ఉండాలని ప్రార్థన ఉంటుంది. చాలా సూక్ష్మబుద్ధి ఉన్నవారే అర్థం చేసుకోగలరని యమధర్మరాజు చెబుతాడు. ఎందుకంటే వేదాంతంలో వివేకం చూపాలి. విశ్లేషణలు అర్థం చేసుకోవాలి. తార్కికంగా ఆలోచించాలి. 'చ' అక్షరాన్ని కూడా విశ్లేషిస్తుంది ఒక్కో సందర్భంలో. మధ్యలో కొంత వినకపోతే మిథ్య అర్థం కాదు. మిథ్య అర్థంకాక పోతే అద్వైతమే లేదు.

ఇందులో మెదడు వేడెక్కే వాదప్రతివాదనలు ఉంటాయి. వేద పూర్వభాగాన్ని అనుసరించే వారిని పూర్వపక్షులనీ, వేద అంతభాగాన్ని అనుసరించే వారిని సిద్ధాంతులనీ అంటారు. సిద్ధాంతికీ, పూర్వపక్షికీ వాదోపవాదాలు వస్తాయి. పూర్వపక్షి వాదన వింటే అతనే సబబనిపిస్తుంది. దానికి శంకరాచార్యులవారు ఎలా జవాబు చెబుతారోనని కుతూహలం కలుగుతుంది. కాని శంకరులవారు ఆ వాదనను కూకటివేళ్ళతో పెకళించివేస్తారు. ఆ వాదనలో ఎలా బలం లేదో సహేతుకంగా, సశాస్త్రీయంగా వివరిస్తారు.

అందువల్ల సూక్ష్మబుద్ధి ఉండాలి. మోక్షం కర్మచేస్తే వచ్చేది కాదు. వృత్తిలో మార్పువల్ల వస్తుంది. అది అర్థం చేసుకునేలోపు అనేక సందేహాలు రావచ్చు. సందేహ నివృత్తి చేసుకోవాలి. ఇది బుద్ధికి అందనంత ఎక్కువగా ఉంది అని చెప్పటానికి కూడా బుద్ధిని ఉపయోగించాలి. అందువల్ల వేదాధ్యయనం చేసేవారికి తర్కశాస్త్రం, మీమాంస, వ్యాకరణం కూడా నేర్పిస్తారు.

బుద్ధిపదునుగా ఉంటే చాలదు. మనస్సు ఏకాగ్రత చూపాలి. ఒక గుడ్డివాడు ఎవరి సహాయంతోనో రాజుగారి దర్శనానికి వచ్చాడు. వారు ఆ గుంపులో ఎక్కడో మాయమయ్యారు. తీరా రాజప్రాకారంలోకి వెళ్ళాక,

రాజుగారు ఆ రోజు దర్శనం ఇవ్వటం లేదని తెలిసింది. బయటకు వెళ్ళటానికి దోవ తెలియదు. కన్ను కనబడదు. అక్కడ ఉన్న రాజభటుణ్ణి తనను బయటకు తీసుకువెళ్ళమని కోరాడు. ఆ భటుడు తను అక్కడనుంచి కదలకూడదని చెప్పి, ఒక గోడ చూపించి, ఆ గోడ పట్టుకుంటూ వెళ్ళమని, అలా వెళితే గుమ్మం వస్తుందనీ, అది దాటితే బయటకు వెళ్ళవచ్చనీ చెప్పాడు.

కొంతసేపటికి రాజభటుణ్ణి ఎవరో తట్టి పిలుస్తున్నారు. తీరా చూస్తే మళ్ళీ ఆ గుడ్డివాడే. అదేమిటి మళ్ళీ వెనక్కి వచ్చాడని ఆశ్చర్యపోయాడు. తీరా ఆరా తీస్తే తేలిన విషయం ఇది. ఆ గుడ్డివాడు సరిగ్గా గుమ్మం దగ్గరకి వెళ్ళేసరికి, వీపు దురద పుట్టింది. అక్కడ గోక్కోవటానికి ఆ చెయ్యే ఎత్తాడు. కాని ఆగలేదు. ఆకారణంగా గుమ్మం దాటి ముందుకు పోయాడు. అలా వేదాంతం శ్రద్ధగా ప్రతిరోజూ, ప్రతిమాటా వినకపోతే, ఇందాక చూసినట్టుగా ముఖ్యమైన విషయం దగ్గర మనస్సెటో వెళిపోతుంది. అందువల్ల శ్రద్ధగా వినాలి. విన్నది గుర్తుంచుకోవాలి.

**వాక్కు:-** వేదాంతం గురుశిష్యుల సంవాద రూపంలో ఉంటుంది. గురువును శిష్యుడు ప్రశ్న వేస్తే దానికి గురువు జవాబు చెప్పాలి. ప్రశ్న టూకీగా, స్పష్టంగా, ఎటువంటి అయోమయం కలుగకుండా, ఎదుటివారికి అర్థమయ్యేలా ఉండాలి. దీనికి గొప్ప ఉదాహరణ ముండకోపనిషత్తులో శౌనక ఋషి వేసిన ప్రశ్న

**కస్మిన్ను భగవో విజ్ఞాతే సర్వమిదం విజ్ఞాతం భవతి (ముండక 1.1.3)**

శ్రవణం చేశాక, మననం స్థాయిలో కూడా అనేక సందేహాలు రేగుతాయి. వాటిని స్పష్టంగా చెప్పగలగాలి. ఆలోచన స్పష్టంగా ఉండాలి. మననంలో ఎప్పుడూ అదే అదే ఆలోచిస్తూ ఉండాలి. తనకు అర్థమయింది ఎదుటివారికి బోధించటం కూడా ఒక పద్ధతి.

**స్వాధ్యాయ ప్రవచనే చ - తైత్తిరీయమ్**

అలా చేయటంవల్ల రెండు ప్రయోజనాలు కలుగుతాయి. మనకు విషయం లోతుగా అర్థమవుతుంది. గురుశిష్యుల పరంపరగా సాగే సాంప్రదాయాన్ని నిలబెట్టినట్టవుతుంది.

అందువల్ల వాచిక తపస్సు పాటించాలి. అందుకే పూజ్యస్వామీజీ అప్పుడప్పుడూ మౌనవ్రతం పాటించాలని చెబుతారు. కాని వచ్చిన చిక్కేమిటంటే చాలా నిర్లక్ష్యంగా వాడే అంగం– వాక్కు. అతిగా మాట్లాడటంవల్ల అలసిపోరు, దానికి ఎవరూ టాక్స్ కూడా వేయరు. అందువల్ల, నదికన్నా ఆనకట్ట ఉంటుందేమో కాని కొందరి వాక్ప్రవాహానికి ఆనకట్ట ఉండదు.

వాచిక తపస్సులో రెండు రకాలుగా వాక్కును నిరోధించాలి. అతిగా మాట్లాడకూడదు. చెడు మాట్లాడకూడదు. అతిగా మాట్లాడుతూ పోతే అది సంభాషణ అవదు. ప్రసంగం అవుతుంది. అతిగా మాట్లాడటంవల్ల ఆచి తూచి మాట్లాడలేము. దానివల్ల ఇంకో ప్రమాదం కూడా ఉంది. మాట తూలుతాము; ఒక మాటకూ ఇంకో మాటకూ పొంతన ఉండదు.

వీలున్నంత తక్కువగా మాట్లాడాలి. పదాలను జాగ్రత్తగా ఎన్నుకోవాలి. ఏదైనా బాగుంది అని చెప్పటానికి చాలా బాగుంది అనే పదం వాడేస్తే, దానికన్నా బాగున్న విషయం వస్తే చాలా చాలా బాగుంది అనాల్సి వస్తుంది.

మాటల్లో ఎలా జాగ్రత్త వహించాలి? శ్రీకృష్ణ భగవానుడు నాలుగు సూత్రాలు చెప్పాడు.

**1. అనుద్వేగకరమ్ –** ఎదుటివారికి ఉద్రేకం తెప్పించేలాగా ఉండకూడదు మన మాట తీరు. అంటే వారిని విమర్శించటం కాని, తిట్టటం కాని చేయకూడదు.

**2. సత్యమ్ –** సత్యం పలకాలి. అలాగే మనకు తెలియనిది కూడా చెప్పకూడదు. అంతేకాదు మనకు ఒక విషయంలో సందిగ్ధంగా ఉన్నా కూడా దాని గురించి చెప్పకూడదు. ఇది కూడా అజ్ఞానం కిందే వస్తుంది. ఎవరో ఎవరి గురించో నాతో చెప్పిన విషయాన్ని నమ్మి, వారికి అది చెప్పకూడదు.

**3. ప్రియమ్ –** సత్యం పలకాలన్నారని పనిగట్టుకుని వెళ్ళి నీ చీర బాలేదని ఎవరికి చెప్పనవసరం లేదు. మన మాట ఎదుటివారికి ప్రియం కలిగించేదిగా ఉండాలి. కుదరదు అని దూకుడుగా చెప్పే బదులు సుతారంగా చెప్పాలి.

**4. హితమ్ –** మనం మాట్లాడేమాట చెప్పే మనకూ, వినే ఎదుటివ్యక్తికి కూడా ప్రయోజనం చేకూర్చేదిగా ఉండాలి. పుకార్లు మాట్లాడకూడదు. వేదాంత విద్యార్థులకు సత్సంగం ఉండాలి.

మనం మాట్లాడే ప్రతి వాక్యం కూడా ఈ నాలుగు లక్షణాలనూ పుణికిపుచ్చుకున్నాయో లేదో చూసి మరీ మాట్లాడాలి. ఇంతవరకూ వ్యావహారిక జీవితానికి వర్తిస్తుంది. వేదాంత విద్యార్థులకు శాస్త్రం మరో మూడు చెబుతుంది.

**5. పదాల ఎన్నిక –** మాటలను ఆచి తూచి మాట్లాడాలని చూశాము. దానికి పదశాస్త్రం లేదా వ్యాకరణ శాస్త్రం తోడ్పడుతుంది. ఒక సందర్భానికి సరిగ్గా సరిపోయే పదాన్ని ఏరుకోవటానికి ఇది తోడ్పడుతుంది.

**6. స్పష్టత –** మాట్లాడే అంశం ఏమిటో స్పష్టంగా తెలిసేలా మాట్లాడాలి. చెప్పే విషయాన్నించి పక్కదారి తొక్కకూడదు. ఒక సభలో మాట్లాడాలనుకుంటే, తను చెప్పే విషయం సరిగ్గా చెప్పగలగాలి. అలా చెప్పలేకపోయినట్లయితే, అడవిలో నున్న మదపుటేనుగుని, సన్నని కలువకాడతో కడదామని చూసినట్టు ఉంటుందిట. స్పష్టత ఏర్పడటానికి మీమాంసశాస్త్రం తోడ్పడుతుంది. దీన్నే వాక్యశాస్త్రం అని కూడా అంటారు.

**7. మితంగా –** వీలున్నంత తక్కువ మాటల్లో చెప్పాల్సింది చెప్పాలి. దీనికి తర్కశాస్త్రం తోడ్పడుతుంది. దీన్నే ప్రమాణశాస్త్రం అని కూడా అంటారు.

ఈ విధంగా వాక్ నిరోధం చేయాలి. కాని దురదృష్టకరమైన విషయమేమిటంటే అందరూ అన్ని విషయాలనూ సలహా అడుగుతారు. కాని, వాక్ నిరోధం ఎలా చేయాలో అడగరు. వారు చేయటానికి ప్రయత్నించరు. అందువల్ల వ్యావహారిక విషయాల్లో కృష్ణ భగవానుడు చెప్పిన నాలుగూ, ఆధ్యాత్మిక జీవనంలో ఆ నాలుగుతోపాటు శాస్త్రం అదనంగా చెప్పిన మూడూ పాటించాలి.

ఈ నేపథ్యంతో శాంతిపాఠాన్ని చూద్దాము.

ఈ శాంతిపాఠంలో శిష్యుడు నాలుగు అంశాలను కోరుతున్నాడు. అవి జ్ఞానయోగ్యతాప్రాప్తి, జ్ఞానప్రాప్తి, జ్ఞాననిష్ఠాప్రాప్తి, ప్రతిబంధ నివృత్తి.

1.**జ్ఞానయోగ్యతాప్రాప్తి – వాఙ్మే మనసి ప్రతిష్ఠితా –** నేను ఏం మాట్లాడినా మనస్ఫూర్తిగా మాట్లాడాలి. దీనికి కర్మ కూడా కలుపుకోవాలి. అంటే మనోవాక్కాయ కర్మలు ఒకటే ఉండాలి. మనసు చెప్పిందే మాట్లాడాలి; మాట్లాడినదే చేయాలి. అప్పుడే ఋజువర్తన ఉంటుంది.

**మనో మే వాచి ప్రతిష్ఠితమ్ –** మనస్సు వాక్కులో లయమవాలి. ఒక మాటంటే దానికి తిరుగులేనట్టుగా ఉండాలి. కఠోపనిషత్తులో వాజశ్రవుడు తన పుత్రుడైన నచికేతుణ్ణి యమధర్మరాజుకు యిస్తానన్నాడు. నచికేతుడు, 'నువ్వు యజ్ఞశాలలో ఆ మాట అన్నావు. నీ మాట నిలబెట్టుకో' అన్నాడు. మాటకు అంత శక్తి ఉంది. అది ప్రామిసరీ నోటుకన్నా విలువైనది.

2. **జ్ఞానప్రాప్తి –ఆవిరావీర్మ ఏధి –** స్వయం ప్రకాశక బ్రహ్మ! నువ్వు నా ముందు ఆవిర్భావం అవు. ఆవిర్భావం అంటే ప్రత్యక్షమవటం. కాని ఇక్కడ అర్థం వేరు. బ్రహ్మ సర్వవ్యాపకం. ఆవిర్భావం, అంతర్ధానం జరుగవు. నేను అజ్ఞానం అనే ముసుగుతో కప్పబడిఉన్నాను. అది తొలగి, నాకు బ్రహ్మజ్ఞానం కలుగుగాక!

3. **జ్ఞాననిష్ఠాప్రాప్తి –వేదస్య మ ఆణీస్థః –** ఇక్కడ వాక్కును, మనస్సును సంబోధిస్తున్నాడు. వేదాంత జ్ఞానాన్ని నాకు తీసుకురండి.

**శ్రుతం మే మా ప్రహాసీః –** విన్నది మర్చిపోకుండా ఉండే ధారణ శక్తి కలుగజేయండి.

**అనేనాధీతేనాహెూరాత్రాన్సందధామి –** దైవ ప్రార్థనకు మానవ ప్రయత్నం కూడా తోడవ్వాలి. అందుకని తన వంతు ప్రయత్నం గురించి కూడా చెబుతున్నాడు. నేను నేర్చుకున్నదాన్ని రాత్రీ, పగలూ మననం చేసుకునేలా చేయి. వేదాంత విద్య శ్రవణ, మనన, నిదిధ్యాసనల ద్వారా సాగుతుంది. గురువు శ్రవణం వరకే చూసుకోగలడు. అది కూడా గురువు దగ్గరకు క్రమం తప్పకుండా వెళితేనే. మననం, నిదిధ్యాసనం శిష్యుని చేతిలో ఉంటాయి.

కొంతమంది సమయం లేదు అంటారు. అది ఉట్టిమాట. శ్రద్ధ ఉంటే, సమయం అదే వస్తుంది. మీ స్నేహితుల విషయాలు ఎలా గుర్తుంటాయి? వాటిని పదే పదే తలుచుకోవటంవల్ల. వేదాంతం కూడా మననం చేస్తేనే

వంటబడుతుంది. అందుకని, నేను రాత్రింబవళ్ళు మననం చేసుకుంటాను అంటున్నాడు విద్యార్థి.

**ఋతం వదిష్యామి, సత్యం వదిష్యామి –** ఋతం, సత్యం, పదాలకు అర్థాలు సందర్భాన్నిబట్టి మారుతాయి. తైత్తిరీయ ఉపనిషత్తులో ఒక అర్థం చూశాము. దాని ప్రకారం ఋతం అంటే శాస్త్రీయజ్ఞానం. సత్యం అంటే ఋజువర్తన. జ్ఞానం ఉండి ఏం లాభం. ఋజువర్తన లేకపోయాక?

ఇక్కడ ఇంకో అర్థం వస్తుంది. ఋతం వ్యావహారిక సత్యాన్నీ, సత్యం పారమార్థిక సత్యాన్నీ సూచిస్తాయి.

పారమార్థిక సత్యం తెలిశాక, ఎవరైనా తప్పు చెపితే అది ఖండించగలగాలి. జ్ఞానంవల్లనే మోక్షం వస్తుందని తెలుసుకున్నాక, ఎవరైనా కర్మవల్లో, భక్తివల్లో మోక్షం వస్తుందంటే వారికి మీకు తెలిసిన విషయం చెప్పగలగాలి.

4. **ప్రతిబంధ నివృత్తి –** నాకు జ్ఞానం వచ్చేదాకా, నీకొక పనిని అప్పజెపుతున్నాను. నాకు జ్ఞానం వచ్చేదాకా నన్నూ, నా గురువునూ కాపాడాలి. **తన్మామవతు –** ఆ పరమాత్మ నన్ను రక్షించుగాక. ఇలా నన్ను రక్షించు అని వేడినప్పుడు, అది ద్వైతభావంతో కూడినది కాబట్టి, పరమాత్మను సగుణబ్రహ్మగా తీసుకోవాలి. ఎలా రక్షించాలి? నేను శాస్త్రాన్ని సరిగ్గా అర్థం చేసుకునేలా చేయటం ద్వారా. **తద్వక్తారమవతు –** నా గురువును కూడా రక్షించు గాక. ఎలా రక్షించాలి? గురువు సరిగ్గా బోధ చేసేలా చేయటం ద్వారా.

**అవతు మామవతు వక్తారమవతు వక్తారమ్ –** మళ్ళీ నన్ను, నా గురువునూ రక్షించమని కోరటం ద్వారా దీని ప్రాముఖ్యతను తెలియజేస్తున్నాడు.

**ఓం శాంతిః శాంతిః శాంతిః –** త్రివిధమైన ఆటంకాలను కలుగకుండా చూడు.

**అధ్యాత్మికమ్ –** మొదటి శాంతి నానుంచి వచ్చే ఆటంకం తొలగించటానికి. ఏ పనికైనా మూడు అడుగులు ముందుకు వేస్తే, ఆరు అడుగులు వెనక్కిలాగేది నేనే. నానుంచి వచ్చే ఆటంకంమీద నాకు అధికారం ఉంది. వాటిని తొలగించుకునేలా చేయగలను. ఆ శక్తినివ్వు.

**అధిభౌతికమ్ –** రెండవ శాంతి చుట్టుప్రక్కల వారినుంచి వచ్చే ఆటంకం తొలగించమని. అది పూర్తిగా నా అదుపులో ఉండదు. కాని కొంతమేరకు అరికట్టగలను. ఉదాహరణకు నేను వేదాంత బోధకు ఒక నిర్ణీత సమయంలో వెళుతుంటే, నా బంధుమిత్రులకు ఆ సమయంలో రావద్దని చెప్పగలను.

**అధిదైవికమ్ –** మూడవ శాంతి దైవపరంగా వచ్చే ఆటంకం తొలగించమని చేసే ప్రార్థన. దానిమీద నాకు బొత్తిగా అధికారం లేదు. సునామీలాంటి ప్రకృతి వైపరీత్యాలు వస్తే మనం చేయగలిగిందేమీ లేదు.

ఈ విధంగా శాంతిపాఠం ద్వారా, కొన్ని గంటలు నన్ను నిర్విఘ్నంగా ఉపనిషత్తు పఠించనియ్యమని స్టే ఆర్డర్ తెచ్చుకున్నాం కాబట్టి ఇప్పుడు ఉపనిషత్తులోకి అడుగుపెడదాం.

## ఐతరేయోపనిషత్తు వివరాలు

ఐతరేయోపనిషత్తులో మూడు అధ్యాయాలు ఉన్నాయి. మొదటి అధ్యాయంలో మూడు ఖండాలు ఉన్నాయి కాని, తక్కిన రెండింట్లోనూ ఒక్కొక్క ఖండమే ఉన్నాయి. వెరసి 3 అధ్యాయాలూ, 5 ఖండాలూ ఉన్నాయి.

**అధ్యాయం 1 – అధ్యారోప, అపవాద ప్రకరణం**
**అధ్యాయం 2 – సంసార ప్రకరణం**
**అధ్యాయం 3 – మహావాక్య ప్రకరణం**

# ప్రథమ అధ్యాయం

## ప్రథమ ఖండం

ఉపనిషత్తులన్నింటి సారాంశం ఒక్కటే

**బ్రహ్మ సత్యం, జగన్మిథ్యా**
**జీవో బ్రహ్మైవ నాపరః**

ఈ రెండు వాక్యాలనూ రెండు పద్ధతుల ద్వారా నిరూపిస్తుంది.

**బ్రహ్మ సత్యం జగన్మిథ్యా –** కార్యకారణ ప్రక్రియ లేదా సృష్టి ప్రక్రియ ద్వారా చూపిస్తుంది. ప్రక్రియ అంటే బోధించే విధానం.

**జీవో బ్రహ్మైవ నాపరః –** అనుప్రవేశ ప్రక్రియ ద్వారా చూపిస్తుంది.ఐతరేయ ఉపనిషత్తులో ముందుగా కార్యకారణ ప్రక్రియను చూస్తాము. కార్యకారణ ప్రక్రియనే సృష్టి ప్రక్రియ అని కూడా అంటారు.

**మంత్రం-1**

**ఆత్మా వా ఇదమేక ఏవాగ్ర ఆసీత్। నాన్యత్కించన మిషత్। స ఈక్షత లోకాన్ను సృజా ఇతి॥**

మొదటి మంత్రంలో బ్రహ్మగురించి వస్తుంది. ఉపనిషత్తు ముఖ్య లక్ష్యం బ్రహ్మజ్ఞానాన్ని బోధించటం. అందుకే ప్రారంభంలోనే బ్రహ్మను పరిచయం చేస్తుంది.

**బ్రహ్మవిదాప్నోతి పరమ్ – తైత్తిరీయమ్**
**సదేవ సోమ్యేదమగ్ర ఆసీదేకమేవాద్వితీయమ్ – ఛాందోగ్యమ్**
**ఆత్మవిత్ తరతి శోకమ్ – ఛాందోగ్యమ్**

ఇటువంటి వాక్యాలను ప్రతిజ్ఞావాక్యాలు అంటారు. చెప్పదలచుకున్న అంశాన్ని ముందు సూత్రవాక్యంగా చెప్పేసి, తర్వాత వచ్చే మంత్రాల్లో వివరంగా చెప్పటం, ఉపనిషత్తు ప్రత్యేకత. ఇక్కడ ప్రతిజ్ఞావాక్యం –

**ఆత్మా వా ఇదమేక ఏవాగ్ర ఆసీత్। నాన్యత్కించన మిషత్।**

కాకపోతే ఇక్కడ బ్రహ్మ పదం వాడకుండా 'ఆత్మ' అంది. ఆత్మ అంటే జీవాత్మ కావచ్చు,పరమాత్మ కావచ్చు. అలాంటప్పుడు ఆత్మ అంటే బ్రహ్మ అని ఎలా అర్థం చేసుకుంటాము? ఎందుకంటే జీవాత్మ జ్ఞానంతో మోక్షం రాదు.

ఆత్మకు అనేక అర్థాలు ఉన్నాయి – సర్వవ్యాపకం అనీ, లయ కారణం అనీ, చైతన్య స్వరూపం అనీ, నిత్యం అనీ వస్తుంది. ఇక్కడ సర్వవ్యాపకం అర్థం తీసుకోవాలి.

**ఆత్మా వా ఇదమ్ –** ఇదం అంటే ఈ జగత్తు. ప్రత్యక్ష ప్రమాణ గోచరమైన జగత్తు. ఈ జగత్తు సృష్టింపబడకముందు ఆత్మే ఉంది. అంటే దీని అర్థం జగత్తు అవ్యక్తరూపంలో ఆత్మలో ఉంది. ఆత్మ అంటే పరమాత్మ లేదా బ్రహ్మ అని అర్థం.

జగత్తు రాకముందు బ్రహ్మ ఉంది.

దీన్ని తిరగేస్తే బ్రహ్మ జగత్తు అంతటా నిండి ఉంది.

అందువల్ల **బ్రహ్మ = జగత్తు**

**కాలభేద ఏవ, న తు వస్తుభేదః**

వీటి మధ్య భేదం వస్తుపరంగా లేదు. కాలభేదంగా ఉంది. లేదా అవస్థాపరంగా ఉంది. కార్యకారణ రూపంలో భేదం ఉంది.

దీనివల్ల ఒక విషయం స్పష్టమవుతున్నది.

బ్రహ్మ కారణం, జగత్ కార్యం.

ఏ కారణం? ఉపాదాన కారణం. కారణానికీ, కార్యానికీ భేదం లేదని ఎప్పుడైతే అంటామో, అప్పుడే అది ఉపాదాన కారణమవుతుంది.

ఏ వస్తువును సృష్టించాలన్నా కూడా దానికి రెండు కారణాలు ఉంటాయి. నిమిత్తకారణం, ఉపాదానకారణం. వీటిని పూజ్యస్వామీజీ **మేకర్ అండ్ మెటీరియల్** అంటారు. ఉదాహరణకు ఆభరణాలు తీసుకుంటే, కంసాలి నిమిత్తకారణం, బంగారం ఉపాదానకారణం. ఒక ఆభరణం మెడలో వేసుకుంటే, అందులో బంగారమనే ఉపాదానకారణం కూడా ఉంటుంది కాని,

కంసాలి అనే నిమిత్తకారణం ఉండదు కదా! బంగారమనే ఉపాదానకారణం ఉంది అంటే అర్థం ఆభరణం అంతటా బంగారం ఉంది.

అలా జగత్తు అంతటా బ్రహ్మ ఉంది. ఈ విధంగా జీవాత్మ, పరమాత్మ ఐక్యం తెలుస్తుంది. ఎటువంటి బ్రహ్మ?

**ఏక ఏవాగ్ర ఆసీత్ నాన్యత్కిఞ్చన మిషత్–** భేదాలు మూడు రకాలు– విజాతీయ, సజాతీయ, స్వగత భేదాలు

| | | |
|---|---|---|
| **విజాతీయ** | – | రెండు భిన్నజాతులకు చెందినవి<br>ఉదా:– చెట్టు, జంతువు |
| **సజాతీయ** | – | ఒకే జాతిలో ఉండే భిన్నత్వం<br>ఉదా:– చెట్టు – మామిడి, మందార వగైరా |
| **స్వగత** | – | ఒకే చెట్టులో ఉండే భిన్నభాగాలు.<br>ఉదా:– కొమ్మ, పువ్వు, వేళ్ళు వగైరా. |

బ్రహ్మ స్వజాతీయ, విజాతీయ, స్వగత భేదరహితం.

**ఏకమ్ –** అంటే స్వగతభేదాలు లేవు. బ్రహ్మ నిరాకారం. నిరవయవం కాబట్టి ఒకే అంశంలో ఉండే భిన్నభాగాలు లేవు.

**ఏవ –** సజాతీయ భేదరహితం. ఉన్నది ఒకటే బ్రహ్మ. రెండు బ్రహ్మలు లేవు. ఉదాహరణకు ఆకాశాన్ని తీసుకుంటే ఆకాశానికి పై రెండు వర్ణనలూ సరిపోతాయి. అది ఏకం అంటే నిరవయవం; ఏవః అంటే రెండు ఆకాశాలు లేవు. కాని విజాతీయ భేదం ఉంది. అగ్ని, వాయువులాంటి తక్కిన భూతాలు ఉన్నాయి. అవి ఆకాశానికి భిన్నంగా ఉన్నాయి. అదే బ్రహ్మ విషయానికి వచ్చేసరికి బ్రహ్మకు విభిన్నంగా ఏమీ లేవు.

**నాన్యత్కిఞ్చన మిషత్ –** కొంచెం కూడా బ్రహ్మకు భిన్నంగా ఏవీ లేవు. కించన అంటే ఏ కాస్త కూడా. ఏ కాస్త కూడా బ్రహ్మకు భిన్నంగా లేదు. అంటే విజాతీయ భేదరహితం. మిషత్ అంటే రెప్పలాడించే జీవరాశులు. మనుష్యులు కూడా అందులోకే వస్తారు. బ్రహ్మకు భిన్నంగా ఏ జీవీ లేదు అంటే అచేతన వస్తువు ఉందనుకోకూడదు. చేతనవస్తువుతో పాటు, అచేతనవస్తువును కూడా

కలుపుకోవాలి అని ఆనందగిరి చెబుతారు. ఆనందగిరి అంటే శంకరభాష్యానికి భాష్యం రాసిన భాష్యకారులు.

**ఆత్మా వా ఇదమేక ఏవాగ్ర ఆసీత్ నాన్యత్కిఞ్చన మిషత్**. ఇప్పుడు ఈ ప్రతిజ్ఞావాక్యానికి పైన వచ్చిన వివరణ అంతా కలుపుకుంటే దీని అర్థం ఇలా వస్తుంది.

సృష్టికి పూర్వం సజాతీయ, విజాతీయ, స్వగత భేదరహిత బ్రహ్మ మాత్రమే ఉంది.

ఛాందోగ్యంలో ప్రతిజ్ఞావాక్యానికి కూడా ఇదే అర్థం

**సదేవ సోమ్యేదమగ్ర ఆసీదేకమేవాద్వితీయమ్**

అక్కడ సత్ ఉంది, ఇక్కడ ఆత్మ ఉంది. ఆత్మ లేదా బ్రహ్మ నిర్వచనం సత్ చిత్ ఆనంద స్వరూపం. అందులోని సత్‌ను తీసుకుంది ఆ ఉపనిషత్తు. ఇక్కడ ఐతరేయ ఉపనిషత్తు ఆత్మ పదాన్ని తీసుకుంది. అంతే తేడా.

పరమాత్మలో ఈ మూడు భేదాలూ లేవు కాని, ఆయన సృష్టించిన ఈ జగత్తులో మూడు భేదాలూ ఉన్నాయి.

**స ఈక్షత –** సః అంటే పరమాత్మ. ఆత్మ, బ్రహ్మ, పరమాత్మ అన్ని పదాల అర్థం ఒకటే. పరమాత్మ చూశాడు. ఈక్షత నిజానికి ఐక్షత అని ఉండాలి. కాని ఇది శ్రుతి వాడింది కాబట్టి దాన్ని మనం తప్పుపట్టకూడదు. దీన్ని ఛాందస ప్రయోగం అంటారు. దీన్ని మనసులోనే సరిదిద్దుకోవాలి. చూశాడు అంటే సంకల్పించాడు అని అర్థం.

**తదైక్షత బహు స్యాం ప్రజాయేయేతి –** ఛాందోగ్యంలో పరమాత్మ నేను అనేక జీవులుగా అవుతాను అనుకున్నాడుట. ఇక్కడ ఏం అనుకున్నాడు?

**లోకాన్ను సృజా ఇతి –** లోకాలను సృష్టిస్తాను అనుకున్నాడు. **స ఈక్షత** పదం చాలా ముఖ్యం. ఎందుకంటే ఈ పదం ద్వారా ఒక **నిమిత్త కారణం** ఉంది అని తెలుస్తోంది. సృష్టి పరిణామం చెంది దానంతట అదే వచ్చిందని, దానిని ఎవరూ సృష్టించలేదనీ ఒక వాదన ఉంది. దీన్ని స్వభావవాదం అంటారు. దీన్ని ఖండించటానికి **స ఈక్షత** పదం తోడ్పడుతుంది. సృష్టి జరగటానికి

ఆ నిమిత్తకారణం వేరే ఎవరో కాదు పరమాత్మే. పరమాత్మే నిమిత్తకారణం ఉపాదానకారణం. రెండూ ఆయనే ఎలా అయ్యాడు? అసంభవదోషం అంటదా?

పరమాత్మే నిమిత్తకారణం, ఉపాదానకారణం అనటానికి మనకు తెలిసిన ఉదాహరణే ఉంది.

**యథోర్ణనాభిః సృజతే గృహ్ణతే చ – ముండకమ్ 1.1.7**

సాలెపురుగు తనలోంచే దారం తీసుకుని గూడు కట్టుకుంటుంది. అలా సాలెపురుగు నిమిత్తకారణం, ఉపాదనకారణం – రెండూ తానే అయింది. మనకు అత్యంత సమీపంగా తెలిసిన ఇంకో ఉదాహరణ ఉంది. అది మనం సృష్టించే స్వప్నప్రపంచం. స్వప్నప్రపంచం మననుంచే వచ్చింది. ముడిసరుకూ మనమే. ఆలోచనా మనదే.

అలాగే ముడిసరుకూ పరమాత్మే, ఆలోచనా పరమాత్మదే. సృష్టికి ముందు పరమాత్మ ఒక్కడే ఉన్నాడు. అవయవాలు లేవు అన్నాం. అంటే మనస్సు కూడా లేనట్టేగా! మరి ఆలోచన ఎలా చేశాడు? మాయాశక్తి ద్వారా చేశాడు. మనస్సు ఎలాగైతే వాసనల శక్తితో సృష్టిస్తుందో అలాగే పరమాత్మ మాయాశక్తి సహాయంతో సృష్టి చేశాడు. మాయాశక్తి బ్రహ్మకు భిన్నంగా లేదు. అది బ్రహ్మ అంశమే. ఒక నాట్యాచార్యుడు వస్తుంటే, అదిగో నాట్యాచార్యుడు, ఆయన నాట్యశక్తి కలిసి వస్తున్నాయి అంటామా? ఆయనలో నాట్యశక్తి అవ్యక్తంగా ఉంటుంది. అలాగే మాయాశక్తి బ్రహ్మలో దాగి ఉంటుంది.

పరమాత్మ సృష్టి చేస్తానని సంకల్పించాడు. ప్రతి ఉపనిషత్తు లోనూ సృష్టి గురించి వస్తుంది. బ్రహ్మ కారణం, జగత్‌కార్యం అని చూపించటానికి సృష్టి ప్రక్రియ గురించి వస్తుంది. కాని సృష్టి గురించిన వివరం మాత్రం అన్నింటిలోనూ ఒకేలా ఉండదు.

జీవాత్మ, పరమాత్మల ఐక్యం మాత్రం అన్నింటిలోనూ ఒకేలా ఉంటుంది. పెద్ద ఉపనిషత్తు పెద్ద ఆత్మ గురించి, చిన్న ఉపనిషత్తు చిన్న ఆత్మ గురించి చెప్పదు. ఒకసారి జీవాత్మనుంచి మొదలుపెట్టి పరమాత్మకు

వెళుతుంది. ఇంకోసారి పరమాత్మనుంచి మొదలుపెట్టి జీవాత్మకు వస్తుంది. కాని అన్నింటిలోనూ సారాంశం ఒకటే. దీన్ని **గతి సామాన్య దర్శనం** అంటారు.

ఇకపోతే సృష్టి దగ్గరకు వచ్చేసరికి ఒక్కొక్క ఉపనిషత్తులోనూ ఒక్కొక్కలా వస్తుంది.

**తస్మాద్వా ఏతస్మాదాత్మన ఆకాశస్సంభూతః। ఆకాశాద్వాయుః। వాయోరగ్నిః అగ్నేరాపః। అద్భ్యః పృథివీ। పృథివ్యా ఓషధయః। ఓషధీభ్యోఽన్నమ్। అన్నాత్పురుషః। - బ్రహ్మానందవల్లీ, తైత్తిరీయమ్**

ఇది మామూలుగా వచ్చే ప్రక్రియ. ముందు పంచభూతాలు, దాన్నించి అన్నం, అన్నంనుంచి జీవరాశి పుట్టాయి అని అర్థం.

**ప్రశ్నోపనిషత్తులో** మిథున సృష్టి ద్వారా వస్తుంది. అన్నీ జంటగా పుట్టాయి అని అర్థం.

**బృహదారణ్యకోపనిషత్తులో** మను, శతరూప అనే జంట ద్వారా మొత్తం ప్రాణికోటి పుట్టిందని వస్తుంది.

ఇన్నిరకాలుగా ఎందుకు చెప్తున్నాయి ఉపనిషత్తులు?

ఎందుకంటే ఎలాగూ జగత్తును మిథ్యగా కొట్టిపారేయబోతోంది కాబట్టి దాని గురించి ఎలా చెప్పినా ఫర్వాలేదు కాబట్టి. సృష్టి ద్వారా బ్రహ్మ సత్యం, జగన్మిథ్యా అని నిరూపిస్తుంది.

బ్రహ్మకారణం, జగత్తు కార్యం. ఈ కారణ కార్య సంబంధమేమిటో చూద్దాము ముందు.

**1. కారణం ఏకం, కార్యం అనేకం –** ఉన్నది ఒకటే కారణం, దాన్నుంచి వచ్చిన కార్యాలు అనేకం. కుండ, మట్టిని తీసుకుంటే ఉన్నది ఒకటే మట్టి. దాన్నుంచి కుండ, కూజా, పాత్ర, ప్రమిదెలాంటి అనేక కారణాలు వచ్చాయి. అలా ఒక్క బ్రహ్మనుంచి అనేక నామరూపాలున్న జగత్తు వచ్చింది. అందువల్ల కారణం ఏకం, కార్యం అనేకం.

**వాచాఽఽరమ్భణం వికారో నామధేయం మృత్తికేత్యేవ సత్యమ్ – ఛాందోగ్యమ్**

**2. కారణం నిత్యం, కార్యం అనిత్యం –** కారణం నిత్యం అంటే మూడు కాలాల్లోనూ ఉంటుంది. త్రికాలేపి తిష్ఠతి.

మట్టి, కుండ పుట్టుక ముందూ ఉంది, కుండలోనూ ఉంది, కుండ పోయాకా ఉంటుంది. అలాగే బ్రహ్మ సృష్టికి ముందూ ఉంది, సృష్టి ఉన్నప్పుడూ ఉంది,సృష్టి లయమయ్యాకా ఉంటుంది. అందువల్ల కారణం నిత్యం, కార్యం అనేకం.

**3. కారణం సారం, కార్యం అసారం–** కారణం కార్యానికి అధిష్ఠానం. కుండలో మట్టి ఎక్కడ ఉంది? కార్యమంతటా ఉంది. మట్టినీ, కుండనీ విడదీసి చూడలేము. అందువల్ల కుండకు మట్టి సారం. అలాగే జగత్తు అంతటా బ్రహ్మ ఉంది. బ్రహ్మనూ, జగత్తునూ విడదీసి చూడలేము. అందువల్ల కారణం సారం, కార్యం అసారం.

**4. కారణం సత్యం, కార్యం అసత్యం:–** కారణం లేకుండా కార్యానికి ఉనికి లేదు. కుండనీ, మట్టినీ విడదీసి చూడలేమంటే అర్థం ఏమిటి? మట్టి లేకుండా కుండకు ఉనికి లేదు. విడిగా ఉనికి లేనిదాన్ని మిథ్య అంటాము. జాగ్రత్తగా చూడండి. మిథ్య అంటే అసలు ఉనికి లేనిది కాదు అని అర్థం కాదు. మిథ్య అంటే స్వతంత్రంగా ఉనికి లేనిది అని. అందువల్ల కారణం సత్యం. కార్యం అసత్యం. దీన్ని మిథ్య అంటారు.

సత్యం, తుచ్ఛం, మిథ్యల మధ్య భేదాలను తెలుసుకోవాలి. సత్యం అంటే మూడు కాలాల్లోనూ ఉండేది అని చూశాము. తుచ్ఛం అంటే మూడు కాలాల్లోనూ లేనిది. ఉదాహరణకు వంధ్యాపుత్రుడు, ఆకాశపుష్పాలు, కుందేటి కొమ్ము వగైరా. మిథ్య అంటే ఒక కాలంలో ఉండి, ఒక కాలంలో లేనిది. దీనికి మరోపేరు **వ్యావహారిక సత్యమ్.**

**కారణం – ఏకం, నిత్యం,సారం, సత్యం.**

**కార్యం – అనేకం, అనిత్యం, అసారం, అసత్యం.**

అందువల్ల కారణమైన బ్రహ్మ నిత్యం. కార్యమైన జగత్తు మిథ్య (అసత్యం)

జగత్తు అనుభవంలోకి వస్తోంది కదా, అది ఎలా మిథ్య?

జగత్తు అనుభవంలోకి వస్తుంది, అందులో వ్యవహారాలు చేస్తాము, అది మనకు ప్రయోజనకారిగా ఉంది. అవేవీ కాదనటం లేదు. కుండలో నీళ్ళు పట్టుకుంటున్నాము. కాని మిథ్య అని ఎందుకు అంటున్నాము? కుండకు మట్టి లేకుండా ఉనికి లేదు కాబట్టి. అది అస్వతంత్రం కాబట్టి. జగత్తుకు విడిగా ఉనికి లేదు కాబట్టి దాన్ని మిథ్య అంటున్నాము.

జగత్తు మిథ్య కాబట్టి, సృష్టి నిజంగా జరగలేదు. అది అవ్యక్తస్థితినుంచి వ్యక్తమయింది కాబట్టి, కొత్తగా ఏమీ పుట్టలేదు. సృష్టి నిజంగా జరుగలేదు అని చెప్పటానికి శంకరభాష్యంలోంచి కొన్ని విశ్లేషణలను చూద్దాము.

**1. కూటస్థ శ్రుతి విరోధ ప్రసంగః –** ఒకవేళ సృష్టి నిజంగా జరిగి ఉంటే పరమాత్మ సాకారంగా ఉండాలి.

**యత్ర అవస్థా భేదః తత్ర వికారః**

ఎక్కడ అవస్థలో మార్పు వస్తుందో అక్కడ వికారం జరగాలి. అది ఒక నియమం. కాని శ్రుతి పరమాత్మను నిర్వికారం అంటుంది. **నిర్వికారం** అంటే కూటస్థం. అందువల్ల సృష్టి నిజంగా జరిగి ఉంటే శ్రుతి చెప్పిన దానికి విరోధమవుతుంది.

**2. అనిర్మోక్ష ప్రసంగః –** ఒకవేళ పరమాత్మ సృష్టి చేసి ఉంటే, సవికారం సాకారం అవాలి అని చూశాము కదా. పరమాత్మ సవికారం కాలేదు. మూడు కాలాల్లోనూ ఉండేది సత్యం అని చూశాము. **సత్యస్య నిషేధః న భవతి**

పరమాత్మను అందుకే నిషేధం చేయలేము.

**నేహ నానాస్తి కించన**

**న భూమిరాపో న చ వహ్నిరస్తి ...**

ఇక్కడ ద్వైతం లేదు అంటుంది శ్రుతి. అస్తి అనేది వర్తమాన కాలానికి వర్తిస్తుంది. ఇప్పుడే భూమి, నీరులాంటివి లేవు అంటున్నది. నిజంగా ఉనికి ఉంటే, అలా అనలేదు కదా! అందువల్ల నిజంగా సృష్టి జరిగి ఉంటే, జగత్తును నిషేధించలేదు.

**3. నింద అభావ ప్రసంగః –** ఒకవేళ నిజంగా సృష్టి జరిగి ఉంటే ద్వైతాన్ని నిందించలేము. సృష్టిలో ద్వైతం ఉంది. కాని ద్వైతభావాన్ని నిందిస్తుంది శ్రుతి.

**మృత్యోఃస్స మృత్యుమాప్నోతి**

ఎవరైతే జగత్తులో భిన్నత్వాన్ని దర్శిస్తారో వారిని మూఢులంటుంది శ్రుతి. వారు పునరపి జననం, పునరపి మరణం అనే జీవిత చక్రంలో పడి కొట్టుమిట్టాడుతారంటుంది శ్రుతి. అందువల్ల నిజంగా సృష్టి జరిగి ఉంటే, ద్వైతాన్ని నిందించలేము.

**4. అప్రమాణభావస్య ప్రసంగః –** ఒకవేళ నిజంగా సృష్టి జరిగి ఉంటే, దాని గురించి శ్రుతి చెప్పనవసరం లేదు. మీమాంస శాస్త్రంలో ప్రమాణం గురించి నిర్వచనం ఉంది. అందులో ఒక అంశం ప్రమాణం మనకు తెలియని విషయం గురించి చెప్పాలి. కాని సృష్టి మనకు తెలుస్తున్నది. కాబట్టి, దాని గురించి శ్రుతి మనకు చెప్పనవసరం లేదు. నిప్పు వేడిగా ఉంటుంది అని శ్రుతి మనకు చెప్పనవసరం లేదు. అనుభవం చెబుతుంది. మనకు తెలియని మిథ్యాత్వం గురించి చెబుతుంది. అందువల్ల నిజంగా సృష్టి జరిగి ఉంటే శ్రుతి అప్రమాణం అవుతుంది.

**5. నిష్ప్రయోజనత్వ ప్రసంగః–** ఒకవేళ నిజంగా సృష్టి జరిగి ఉంటే, దానికొక ఫలం చెప్పాలి. మనకు తెలియని కొత్త విషయం గురించి శ్రుతి చెపితే దానిని తెలుసుకోవటంవల్ల వచ్చే ఫలమేమిటో కూడా చెప్పాలి.

**బ్రహ్మవిదాప్నోతి పరం – తైత్తిరీయం** అన్నట్టుగా

**యః సృష్టిం వేద సః బ్రహ్మలోకమాప్నోతి** అని ఎక్కడా చెప్పలేదు. సృష్టి గురించి తెలుసుకుంటే, బ్రహ్మ లోకాన్ని పొందుతారులాంటి ఫలమేమీ ఎక్కడా రాలేదు. అందువల్ల సృష్టి జరిగి ఉంటే దాని గురించి చెప్పటం నిష్ప్రయోజనం అవుతుంది.

**6. అపశ్రుతి ప్రసంగః –** ఒకవేళ సృష్టి నిజంగా జరిగి ఉంటే, దాని గురించి శ్రుతి ఇన్నిచోట్ల యిన్ని రకాలుగా చెప్పలేదు. నేను ఈ గదిలో మనిషిగా ఉంటే,

ఈ గది బయటకు వచ్చాక కూడా మనిషినే. సృష్టి నిజమయితే, అన్ని సందర్భాలలోనూ ఒకటేలాగా ఉండాలి కదా! కాని భిన్నంగా చెప్తోంది. దీన్ని **విగానం** లేదా **అపశ్రుతి** అంటారు.

ఇంతకుముందు చూశాం జీవ – ఈశ్వర ఐక్యం అన్ని ఉపనిషత్తుల్లోనూ ఒక్కలాగే వస్తుంది. జీవ – ఈశ్వర ఐక్యాన్ని చూసే వాక్యాన్ని **మహావాక్యం** అంటారు. దాని అర్థం అన్నింటిలోనూ ఒకటేలాగా ఉంటుంది. అందువల్ల సృష్టి జరిగి ఉంటే, ఇలా అపశ్రుతి ఉండేది కాదు.

**7. అద్యతన విషయ ప్రసంగః –** ఒకవేళ సృష్టి నిజంగా జరిగి ఉంటే, ఐక్యం గురించి భూతకాలం వాడాలి. సృష్టి జరిగితే మనం జీవాత్మ అవుతాము. ఒకచెట్టు విత్తనంనుంచి వస్తుంది. ఆ చెట్టుతో విత్తనం గురించి చెప్పేటప్పుడు ఏమంటాము?ఓ చెట్టూ! నువ్వు అంతకుముందు **విత్తనంగా ఉన్నావు** అంటాము. అంటే ఇప్పుడు లేనట్టే కదా! అలాగే మనతో ఓ జీవాత్మా! నువ్వు అంతకుముందు పరమాత్మగా ఉన్నావు అనాలి. కాని ఏమంటున్నది?

**తత్త్వమసి ఇప్పుడు నువ్వు ఆ బ్రహ్మవు అంటున్నది.**

అందువల్ల నిజంగా సృష్టి జరిగితే, **ఇప్పుడు నువ్వు బ్రహ్మవు అనలేదు.**

పై కారణాల దృష్ట్యా బ్రహ్మ సత్యం, జగన్మిథ్యా అని తెలుస్తున్నది. దానివల్ల సృష్టి నిజంగా జరగలేదు, జరిగినట్టుగా అనిపిస్తున్నది అని కూడా చెబుతుంది.

**న జాయతే మ్రియతే వా విపశ్చిన్నాయం కుతశ్చిన్న బభూవ కశ్చిత్**

పరమాత్మ దేన్నుంచీరాలేదు, పరమాత్మనుంచీ ఏమీ రాలేదు. ముందు పరమాత్మనుంచి సృష్టి వచ్చిందని చెప్పి అసలు సృష్టే లేదంటుంది తర్వాత. అనుభవమేమో సృష్టి ఉందంటుంది, వేదమేమో లేదంటుంది. దేన్ని నమ్మాలి?

**అనాది కాల ప్రవృత్తో వేదః**

వేదం అనాదిగా వస్తున్నది కదా! మిథ్య అంటే అసలు లేదని కాదని చూశాము. పారమార్థిక సత్యం కాదు. అనుభవంలోకి వస్తుంది కాని అది శాశ్వతంకాదు. అనుభవంలోకి వచ్చేదంతా నిజం అవాలని లేదు.

సూర్యోదయం, సూర్యాస్తమయాలను అనుభవిస్తున్నా కూడా అవి నిజం కాదని మనకు తెలుసు. అలాగే భూమి కదలనట్టు మనకు అనుభవమవుతున్నా, భూమి తిరుగుతుందని మనకు తెలుసు. అలాగే జగత్తు అనుభవంలోకి వస్తున్నా అది నిజం కాదని మనం తెలుసుకోవాలి.

మరి నిజంగా సృష్టి జరగకపోతే, ఓం ప్రథమంగా సృష్టి ప్రక్రియ ఎందుకు తీసుకుంది? **స ఈక్షత లోకాన్ను సృజా ఇతి**

ఈ వాక్యం ఎందుకు వచ్చింది? మొదలుపెడుతూనే సృష్టి లేదు అంటే సాధకుడు స్వీకరించలేడు. అతను వచ్చింది ద్వైతవాసనలతో. ఆరోగ్యసమస్య, ఆర్థికసమస్య, కుటుంబ సమస్యలు భూతద్దంలోంచి కనిపిస్తుంటే, ప్రత్యక్షంగా అనుభవిస్తుంటే అవి లేదంటే సాధకుడు బెంబేలెత్తిపోతాడు. అందుకని అతన్ని ఒక్కొక్క మెట్టు ఎక్కించాలి.

1. పరమాత్మ ఉన్నాడు.
2. సృష్టికి పూర్వం ఆయనే ఉన్నాడు.
3. సృష్టిలోనూ ఆయనే ఉన్నాడు.
4. పరమాత్మ ఉంటాడు – సృష్టి తర్వాత కూడా ఆయనే ఉంటాడు.

ప్రపంచం నామరూపాత్మకమైనది. వచ్చిపోతుంది, శాశ్వతంగా మిగిలేది ఆయనే.

పరమాత్మ ఏకం, నిత్యం,సారం,సత్యం.

జగత్తు అనేకం,అనిత్యం,అసారం, అసత్యం

ఇలా చెప్పి ఒక్కొక్క మెట్టూ ఎక్కించి చివరికి ఆ పరమాత్మ నువ్వే అంటుంది. అది పెద్ద గెంతు. **జీవో బ్రహ్మైవ నా పరః**

## మంత్రం 1 ప్రాముఖ్యత

ఈ చిన్ని మంత్రంలో అనేక అంశాలు చొప్పించింది ఉపనిషత్తు.

1. బ్రహ్మ ఉపాదాన కారణం, నిమిత్తకారణం.
2. బ్రహ్మ సజాతీయ, విజాతీయ, స్వగత భేదరహితం
3. బ్రహ్మ సత్యం, జగన్మిథ్యా
4. సృష్టి నిజంగా జరగలేదు.

## మంత్రం-2

**స ఇమాన్ లోకానసృజత। అమ్భో మరీచీర్మరమాపోஉదోஉమ్భః పరేణ దివం ద్యౌః ప్రతిష్ఠాஉన్తరిక్షం మరీచయః। పృథివీ మరో యా అధస్తాత్తా ఆపః ॥**

సృష్టి ప్రకరణ అన్నింటిలోనూ ఒక్కలాగా లేదని ముందే చూశాము. ఇక్కడ లోకసృష్టితో మొదలవుతుంది. ఆత్మనుంచి పంచభూతాలు, వృక్షాలు, అన్నం, పురుషుడు వచ్చాయని తైత్తిరీయంలో చూస్తాము. ఛాందోగ్యంలో పంచభూతాలను పేర్కొనకుండా అగ్నినుంచి వస్తుంది.

**త్రీణి రూపాణీత్యేవ సత్యమ్**

అగ్ని,నీరు, పృథివీనుంచి అన్నీ వచ్చాయని, అవి ఆత్మనుంచి వచ్చాయని వస్తుంది ఛాందోగ్యంలో.

ఇక్కడ సరాసరి లోకసృష్టికి వచ్చేశాము. మొదటి మంత్రం- **లోకాన్ను సృజా ఇతి** తో ముగిసింది.

**స ఇమాన్ లోకానసృజత-** సః అంటే సృష్టికి పూర్వం తాను మాత్రమే ఉండి,సృష్టి చేసిన పరమాత్మ ఈ లోకాలను సృష్టించాడు.

మొత్తం 14 లోకాలున్నాయి భూలోకంతో కలిపి అవి -

**భూలోక, భువర్లోక,సువర్లోక, మహర్లోక, జనలోక, తపోలోక, సత్యలోకాలు - ఊర్ధ్వలోకాలు.**

**అతల, వితల, సుతల, రసాతల, తలాతల, మహాతల, పాతాళ లోకాలు- అధోలోకాలు.**

ఈ పద్నాలుగు లోకాలను నాలుగు లోకాలుగా విభజించింది ఉపనిషత్తు.

**అమ్భో మరీచీర్మరమాపః -** అంభ, మరీచీః, మరమ్, ఆపః ఈ లోకాల పేర్లు. పేర్లు కొత్తగా ఉన్నాయి కాబట్టి ఉపనిషత్తే ఆ పేర్లు ఏ లోకాలకు వర్తిస్తాయో చెబుతున్నది.

**అదో౽మ్భః పరేణ దివం ద్యౌః ప్రతిష్ఠా –** ఆ అంభోలోకం పైన ఉన్న లోకాలు. దేనికి పైన? దివం అంటే స్వర్గలోకం. స్వర్గలోకానికి పైన ఉన్న లోకాలు.

ద్యౌః ప్రతిష్ఠా – స్వర్గలోకం వాటికి ఆధారంగా ఉంది. అంటే స్వర్గలోకాన్ని కూడా కలుపుకోవాలి. స్వర్గలోకం అంటే సువర్లోకం. ద్యౌ, దివం అన్నీ పర్యాయపదాలు. సువర్లోక, మహర్లోక, జనలోక, తపోలోక, సత్యలోకాలు కలిపి అంభోలోకం అయ్యాయి. సత్యలోకం అంటే బ్రహ్మలోకం. అంభాః అంటే వీటిల్లో నీరు ఎక్కువగా ఉంటుందని అర్థం.

**భూరితి వా అయం లోకః భువ ఇత్యంతరిక్షమ్**
**సువరిత్యసౌ లోకః – శీక్షావల్లీ, తైత్తిరీయమ్**

**అన్తరిక్షం మరీచీః –** అన్తరిక్షం అంటే భువర్లోకం. సూర్యకిరణాలు ఎక్కువగా ఉంటాయి.

**పృథివీ మరః –** భూలోకం

**మ్రియంతే అస్మిన్ జనాః ఇతి**

ఎక్కువ జనరాశి త్వరగా మరణిస్తారు.

**యా అధస్థాత్తా ఆపః –** కింద ఉన్న ఏడు లోకాలు.

పారిశేష న్యాయం ప్రకారం, మిగిలినవి అథోలోకాలు. వాటన్నింటినీ ఒక లోకం కింద చెప్పేసింది ఉపనిషత్తు. ఆపః అంటే మామూలుగా నీరు. కాని నీటి గురించి ముందే చెప్పింది కాబట్టి వేరే అర్థం తీసుకోవాలి.

**ఆప్యంతే బహుభిః జనైః –** జనసందోహంతో నిండి ఉంటాయి ఆ లోకాలు.

ఆ విధంగా 5+1+1+7 = 14 లోకాల సృష్టి అయింది.

**మంత్రం–3**

**స ఈక్షతేమే ను లోకా లోకపాలాన్ను సృజా ఇతి ।**
**సో౽ద్భ్య ఏవ పురుషం సముద్ధృత్యామూర్ఛయత్ ॥**

ఇప్పుడు లోకపాలకుల సృష్టి

**సః ఈక్షత–** ఆ పరమాత్మ సంకల్పం చేశాడు.

**ఇమే ను లోకాః–** ఈ లోకాలను సృష్టించాను.

**లోకపాలాన్ను సృజా ఇతి–** లోకపాలకులు లేకపోతే ఇవి నాశనమవుతాయి. లోకాలను రక్షించే దేవతలను కూడా సృష్టించాలనుకున్నాడు.

ఈ ఉపనిషత్తులో సృష్టి ప్రకరణం ప్రత్యేకంగా ఉంది. మామూలుగా ముందు సూక్ష్మపంచభూతాల సృష్టి వస్తుంది. కాని, ఇక్కడ స్థూలప్రపంచానికి అధిష్ఠానమైన విరాట్ సృష్టి గురించి వర్ణన వస్తుంది.

**సోఽద్భ్య ఏవ పురుషం సముద్ధృత్యామూర్ఛయత్ –** అద్భ్య అంటే నీరు. ఇక్కడ నీటిని ఉపలక్షణంగా తీసుకోవాలి. ఉపలక్షణం అంటే ఒక విషయం చెపితే, దానికి సంబంధించిన తక్కిన వాటిని కూడా కలుపుకోవాలి. ఇక్కడ పంచభూతాల్లో ఒకటైన నీరు గురించి చెప్పటంవల్ల తక్కిన వాటిని కూడా కలుపుకోవాలి. వీటినుంచి స్థూల సమష్టి సృష్టి వస్తుంది. మాంసపిండం సృష్టించాడు ముందు.

## మంత్రం – 4

**తమభ్యతపత్తస్యాభితప్తస్య ముఖం నిరభిద్యత యథాణ్డం।**
**ముఖాద్వాగ్వాచోఽగ్నిర్నాసికే నిరభిద్యేతాం నాసికాభ్యాం ప్రాణః।**
**ప్రాణాద్వాయురక్షిణీ నిరభిద్యేతామక్షిభ్యాం చక్షుశ్చక్షుష ఆదిత్యః కర్ణౌ**
**నిరభిద్యేతాం కర్ణాభ్యాం శ్రోత్రం శ్రోత్రాద్దిశస్త్వక్ నిరభిద్యత త్వచో**
**లోమానిలోమభ్య ఓషధివనస్పతయో హృదయం నిరభిద్యత**
**హృదయాన్మనో మనసశ్చన్ద్రమా నాభిర్నిరభిద్యత నాభ్యా అపానోఽ**
**పానాన్మృత్యుః శిశ్నం నిరభిద్యత శిశ్నాద్రేతో రేతస ఆపః ॥**

ఇప్పుడు వచ్చే సృష్టి ఒక అద్భుతమైన సిద్ధాంతం. మూడేసి అంశాల చొప్పున జరిగింది. అవి గోళకాలు, ఇంద్రియాలు, అధిష్ఠాన దేవతలు. గోళకాలు అంటే స్థూలశరీరంలో కనిపించే కన్ను, ముక్కు, నోరు లాంటివి. వాటికి

శక్తినిచ్చేది సూక్ష్మశరీరంలోని ఇంద్రియాలు. ఇవి వ్యష్టిపరంగా అయితే, వాటి అధిష్ఠాన దేవతలు సమష్టిపరంగా వస్తాయి. ఈ మంత్రంలో వచ్చిన వర్ణనే తత్త్వబోధకు ఆధారం.

**తమభ్యతపత్:–** పరమాత్మ సంకల్పం చేశాడు. పరమాత్మ సంకల్పం చేశాడు అని పదే పదే చెప్పటంలోని ఉద్దేశం, సృష్టి ఏర్పడటానికి ఒక చేతనతత్త్వం ఉండాలి అని చెప్పటానికి. సాంఖ్యదార్శనికులు సృష్టి ప్రధానంనుంచి, అంటే ప్రకృతినుంచి వచ్చిందంటారు. దీన్ని స్వభావవాదన అంటారు. కాని అలా సాధ్యంకాదు, దాని వెనుక సంకల్పం కావాలి.

**నిరభిద్యత –** చీల్చుకుని వచ్చింది.

**యథాణ్డమ్ –** గ్రుడ్డులోంచి పక్షి చీల్చుకుని వచ్చినట్టుగా.

| **గోళకం** | **ఇంద్రియం** | **అధిష్ఠాన దేవత** |
|---|---|---|
| ముఖం | వాక్కు | అగ్ని |
| నాసిక | ప్రాణం | వాయువు |
| అక్షిణి | చక్షువు | ఆదిత్యుడు |
| చెవులు | శ్రోత్రం | దిశలు |
| త్వక్ | రోమాలు | ఓషధివనస్పతులు |
| హృదయం | మనస్సు | చంద్రుడు |
| నాభి | అపానం | మృత్యువు |
| శిశ్నం | రేతస్సు | నీరు |

సంస్కృతంలో ముఖం అంటే నోరు అని తీసుకోవాలి. ప్రాణం అంటే శ్వాసక్రియ. అక్షిణి అంటే బాహ్యంగా కనపడే కన్ను. వాటికున్న కంటిచూపును చక్షువు అంటారు. కొంతమందికి కంటిచూపు లేకపోతే బాహ్యంగా కనపడే కన్ను గాజుకన్నులా ఉంటుంది. లోమాని అంటే రోమాలు. శాస్త్రంలో 'ర'కు, 'ల'కు భేదం ఉండదు. ఏదైనా వింటే రోమాలు నిక్కబొడుచుకున్నాయి అంటాము కదా! వాటికి అధిష్ఠానదేవత చెట్లు. అద్భుతమైన భావన. చెట్లను కొట్టివేస్తే

భగవానునికి హాని చేసినట్టు అవుతుంది. అపానం మృత్యువెలా అయింది? అపానం పని విసర్జన చేయటం. మన శరీరంలో ఏర్పడిన వ్యర్థపదార్థాలను విసర్జిస్తుంది. అలాగే ఎప్పుడో మనం ఈ భూమీమ్మీద వ్యర్థంగా ఉన్నాము అనిపించినప్పుడు మనను కూడా ఉదానంతో కలిపి తీసుకువెళ్ళిపోతుంది. రేతస్సు అంటే పురుషబీజం. ఇక్కడ ఉపస్థ ఇంద్రియం.

ఇక్కడ కొన్ని విషయాలను గమనించాలి. వీటిలో అన్ని అంగాలూ రాలేదు. మన సూక్ష్మశరీరంలో 19 అంగాలు ఉంటాయని చూశాం. వాటిలో కొన్నే వచ్చాయి. వాటిని ఉపలక్షణంగా తీసుకోవాలి.

2. ఇలా వీటిని ఒక పట్టికగా వేసుకున్నాము.కాని ఇంకా ఇవి ఒకదానితో ఒకటి ముడిపడలేదు. అన్నీ గాలిలో విడిగా తేలుతున్నాయి.

3. నిజానికి సూక్ష్మశరీరంనుంచి స్థూలశరీరం వస్తుంది. కాని ఇక్కడ స్థూల శరీరంనుంచి సూక్ష్మశరీరం వచ్చినట్టు వస్తున్నది. దాన్ని సరిగ్గా అర్థం చేసుకోవాలి.

**అభివ్యక్తిః ఉచ్యతే న తు ఉత్పత్తిః**

దాన్నుంచి వ్యక్తమయినట్టుగా తీసుకోవాలి తప్ప దాన్నించి పుట్టినట్టుగా తీసుకోకూడదు. అద్దంలో సూర్యప్రతిబింబం కనిపిస్తే, అద్దం సూర్యుణ్ణి సృష్టించలేదు. ప్రతిబింబింపజేసింది అంతే.

ఇక్కడితో లోకపాలకుల సృష్టి అయింది. మొదటి ఖండంలో లోకాల సృష్టి, లోకపాలకుల సృష్టి జరిగింది.

# ద్వితీయ ఖండం

## మంత్రం-1

**తా ఏతా దేవతాః సృష్టా అస్మిన్మహత్యర్ణవే**
**ప్రాపతంస్తమశనాయాపిపాసాభ్యామన్వవార్జత్తా ఏనమబ్రువన్నాయతనం**
**నః ప్రజానీహి యస్మిన్ప్రతిష్ఠితా అన్నమదామేతి ॥**

సృష్టి ప్రకరణం కొనసాగుతున్నది.

**తా ఏతా దేవతాః సృష్టాః -** విరాట్‌దేహంనుంచి వచ్చిన ఈ దేవతలు;
**అస్మిన్మహత్యర్ణవే ప్రాపతన్-** అర్ణవం అంటే సముద్రం. మహాసముద్రంలో పడ్డారుట. ఎవరు? దేవతలు. దీన్నిబట్టి దేవతలు కూడా సంసారులే అనీ, వారికి కూడా రాగద్వేషాలు ఉంటాయనీ, వారిని ఉపాసన చేస్తే ఊర్ధ్వలోకాలకు వెళతారు కాని, మోక్షం రాదనీ అర్థమవుతోంది.
**తమశనాయాపిపాసాభ్యామ్ అన్వవార్జత్-** ఆ దేవతలను ఆకలిదప్పులకు లోను చేశాడు పరమాత్మ.

| | | |
|---|---|---|
| **అశనాయాపిపాసాది యుక్తమ్** | - | **సంసారమ్** |
| **అశనాయాపిపాసాది వర్జితమ్** | - | **మోక్షమ్** |

ఆకలిదప్పులను సంసారానికి ప్రతీకగా వివరిస్తారు. దేవతలకు కూడా ఆకలిదప్పులు ఉన్నాయా?

**స్వర్గలోకే న భయం కిన్చనాస్తి**
**న తత్ర త్వం న జరయా బిభేతి**
**ఉభే తీర్త్వాఽ_శనాయాపిపాసే**
**శోకాతిగో మోదతే స్వర్గలోకే** **కఠ - 1-1-12**

కఠోపనిషత్తులో స్వర్గలోకంలో ఆకలిదప్పులు ఉండవని వర్ణిస్తాడు నచికేతుడు. అంటే దీన్ని ఆపేక్షిక సత్యంగా తీసుకోవాలి. అక్కడ కాలవ్యవధి

చాలా ఎక్కువ కాబట్టి వారికి ఆకలివేసే సమయం మన సమయంతో పోలిస్తే చాలా తక్కువ. పైగా అక్కడ స్వర్గలోకస్తుతి, ఇక్కడ సంసారవర్ణన.

దేవతలకు ఆకలిదప్పులను అనుభవించటానికి ఇంకా శరీరం లేదు. శరీరం ద్వారానే సుఖదుఃఖాలను అనుభవించగలరు.

**తా ఏనమబ్రువన్** – ఆ దేవతలు భగవానునితో చెప్పారు.

**ఆయతనం నః ప్రజానీహి** – మాకు ఒక స్థూలశరీరాన్ని ఏర్పాటు చేయి.

**యస్మిన్ప్రతిష్ఠితా అన్నమదామేతి** – అందులో ఉండి, ఆకలిదప్పులను తీర్చుకుంటాము.

ఆనందగిరి శంకరభాష్యానికి భాష్యం రాశారు. ఆయన ఆకలిదప్పులను కేవలం ఆకలి, దాహంగానే తీసుకోకూడదు అంటారు.

**స్వ స్వ విషయ తృష్ణ**

అంటే ఆయా అంగాలకు సంబంధించిన తృష్ణ. ఉదాహరణకు కన్నుకు ఆకలి మంచి దృశ్యం చూడటం. చెవికి ఆకలి మంచి శబ్దం వినటం.

**మంత్రం-2**

**తాభ్యో గామానయత్తా అబ్రువన్న వై నోఽయమలమితి ।**
**తాభ్యోఽశ్వమానయత్తా అబ్రువన్న వై నోఽయమలమితి ॥**

**తాభ్యో గామానయత్**– వారికి పరమాత్మ గోవును తెచ్చాడు.

**తా అబ్రువన్న వై నోఽయమలమితి**– ఇది మాకు చాలదు అన్నారు వారు.

**తాభ్యోఽశ్వమానయత్**– వారికి పరమాత్మ అశ్వాన్ని తెచ్చాడు.

**తా అబ్రువన్న వై నోఽయమలమితి** – ఇది మాకు చాలదు అన్నారు వారు.

**మంత్రం-3**

**తాభ్యః పురుషమానయత్తా అబ్రువన్సుకృతం బతేతి। పురుషో వావ సుకృతమ్। తా అబ్రవీద్యథాయతనం ప్రవిశతేతి ॥**

దేవతలకు కూడా రాగద్వేషాలు ఉన్నట్టు ఉన్నాయి. ఇంకా మంచి శరీరం కావాలి అన్నారు.

**తాభ్యః పురుషమానయత్ –** వారికి మనుష్య శరీరం తెచ్చాడు. పురుష అంటే మనుష్య శరీరం.

**తా అబ్రువన్సుకృతం బతేతి –** చాలా బాగుంది అన్నారు వారు.

దేవుడు మనుష్య శరీరాన్ని చాలా శ్రద్ధగా చేశాడు అంటారు ఆనందగిరి. ఆయనకెలా తెలుసు అనకూడదు. తార్కికంగా చూసినా, వైజ్ఞాన శాస్త్రపరంగా చూసినా కూడా మనిషి పూర్తిగా పరిణామం చెందాడు. మనిషిని మాత్రమే **బుద్ధిజీవి** అంటారు. మనిషి ఒక్కడే నవ్వగలడు. మనిషి ఒక్కడే అనేకభాషల్లో మాట్లాడగలడు. అంతదాకా ఎందుకు? మనిషి సృష్టికి ప్రతిసృష్టి చేయగలడు. అతన్ని చిన్నసైజు భగవానుడనవచ్చు. పేరు కూడా పురుషః. భగవానుని కూడా పురుషః అంటాము. పురుషసూక్తం భగవానుని స్తుతే.

**స వా ఏష పురుషః**

**పురుషో వావ సుకృతమ్ –** అందుకే పురుష శరీరం చూసి దేవతలు శభాష్ అనటమే కాదు, అందరూ శభాష్ అంటారు. వావ అంటే అవును, నిజంగా అని అర్థం.

దేవతలు శరీరంలో ప్రవేశించబోతున్నారు.

**తా అబ్రవీద్యథాయతనం ప్రవిశతేతి–** నేను ఎలా ఏర్పాటు చేశానో అలా ప్రవేశించండి అని పరమాత్మ వారిని శాసించాడు. వారు అలాగే పాటించారు.

**మంత్రం–4**

**అగ్నిర్వాగ్భూత్వా ముఖం ప్రావిశద్వాయుః ప్రాణో భూత్వా నాసికే**
**ప్రావిశదాదిత్యశ్చక్షుర్భూత్వాఽక్షిణీ ప్రావిశద్దిశః శ్రోత్రం భూత్వా కర్ణౌ**
**ప్రావిశన్నోషధివనస్పతయో లోమాని భూత్వా త్వచం ప్రావిశంశ్చన్ద్రమా**
**మనో భూత్వా హృదయం ప్రావిశన్మృత్యురపానో భూత్వా నాభిం**
**ప్రావిశదాపో రేతో భూత్వా శిశ్నం ప్రావిశన్ ॥**

**అగ్నిర్వాగ్భూత్వా ముఖం ప్రావిశత్–** అగ్ని ప్రవేశించింది; భూత్వాకి ఏకీభూత్వా అని తీసుకోవాలి. అంటే దానితో కలిసి ప్రవేశించింది. ఉదాహరణకు **అగ్ని వాక్కుతో కలిసి నోటిలో ప్రవేశించింది.** ఇప్పుడు అదే పట్టికను అటునుంచి చూస్తాము. అంటే ముందు అధిష్ఠానదేవత, తరువాత ఇంద్రియం, గోళకం.

| **అధిష్ఠాన దేవత** | **ఇంద్రియం** | **గోళకం** |
|---|---|---|
| అగ్ని | వాక్కు | ముఖం |
| వాయువు | ప్రాణం | నాసిక |
| ఆదిత్యుడు | చక్షువు | అక్షిణీ |
| దిశలు | శ్రోత్రం | చెవులు |
| ఓషధివనస్పతులు | రోమాలు | త్వక్ |
| చంద్రుడు | మనస్సు | హృదయం |
| మృత్యువు | అపానం | నాభి |
| శిశ్నం | రేతస్సు | నీరు |

గోళకం ద్వారా దేవతలు వెళ్ళారు అంటే దేవతలవల్ల ఈ గోళకాలకు శక్తి వచ్చింది. ఇంద్రియం వ్యష్టిపరంగా శక్తినిస్తే, ఇంద్రియానికి శక్తిని అధిష్ఠాన దేవతలు ఇస్తారు.

### మంత్రం–5

**తమశనాయాపిపాసే అబ్రూతామావాభ్యామభిప్రజానీహీతి । తే**
**అబ్రవీదేతాస్వేవ వాం దేవతాస్వాభజామ్యేతాసు భాగిన్యౌ కరోమీతి ।**
**తస్మాద్యస్యై కస్యై చ దేవతాయై హవిర్గృహ్యతే**
**భాగిన్యావేవాస్యామశనాయాపిపాసే భవతః ॥**

**తమశనాయాపిపాసే అబ్రూతామ్ –** ఆకలిదప్పులు పరమాత్మను అడిగాయి.
**ఆవాభ్యామభిప్రజానీహీతి –** మా ఇద్దరికీ కూడా ఏదైనా స్థానాన్ని కల్పించు.
**తే అబ్రవీత్ –** వారితో పరమాత్మ అన్నాడు.

**ఏతాస్వేవ వాం దేవతాస్వాభజామి –** మీరిద్దరూ ఆ దేవతలతో కలవండి.

**ఏతాసు భాగిన్యౌ కరోమీతి –** మిమ్మల్ని వారితో భాగస్వాములుగా చేస్తున్నాను.

**తస్మాద్యస్యై కస్యై చ దేవతాయై హవిర్గృహ్యతే –** అందువల్ల ఏ దేవతలకు ఏ ఆహుతులను సమర్పిస్తే;

**భాగిన్యావేవాస్యామశనాయాపిపాసే భవతః –** ఆకలిదప్పులనే మీరు దానిలో మీ భాగం పొందుతారు.

ఆకలిదప్పులంటే ఏ ఇంద్రియానికి తగ్గ ఆకలి అని చూశాము. అంటే కన్ను ఇంద్రియానికి దృశ్యం కనిపిస్తే దాని ఆకలి తీరినట్టు.

రెండవ ఖండంలో అశనాయా పిపాసలు, పురుష శరీరం సృష్టించ బడ్డాయి. దేవతలు, ఇంద్రియాలు, గోళకాలు, అశనాయా, పిపాసలు పురుష శరీరంలో ప్రవేశించాయి.

శంకరభాష్యంలో సంసారవర్ణన చక్కగా వస్తుంది. దాన్ని చూద్దాము.

**సంసారసముద్రే మహతి అవిద్యా కామకర్మప్రభవదుఃఖోదకే**
**తీవ్ర రోగజరామృత్యుమహాగ్రాహే అనాదౌ అనన్తే అపారే**
**నిరాలమ్బే విషయేన్ద్రియజనితసుఖలవలక్షణవిశ్రామే**
**పఞ్చేన్ద్రియార్థతృణ్మారుతవిక్షోభోత్థితానర్థశతమహోర్మౌ**
**మహారౌరవాద్యనేకనిరయగతహాహేత్యాదికూజితాక్రోశనోద్భూతమహారవే**
**సత్యార్జవదానదయా**
**ఉహింసాదమశమధృత్యాద్యాత్మగుణపాథేయపూర్ణజ్ఞానోడుపే**
**సత్సఙ్గసర్వత్యాగమార్గే మోక్షతీరే ఏతస్మిన్ మహత్యర్ణవే ప్రాపతన్ పతితవత్యః।**

**మహత్యర్ణవే –** మహాసముద్రం

**అనాదౌ అనన్తే అపారే –** సముద్రం మధ్యలో ఉంటే ఆది, అంతాలు తెలియవు. చాలా లోతైనది కూడా.

**నిరాలమ్బే–** ఆశ్రయం దొరకదు.

**అవిద్యా కామకర్మప్రభవదుఃఖోదకే –** సముద్రంలోని నీరు అజ్ఞానం, కోరిక, కర్మలవల్ల కలిగే దుఃఖం.

**తీవ్ర రోగజరామృత్యుమహాగ్రాహే** – అందులో భయంకర జలజంతువులు తీవ్రరోగం, వార్ధక్యం, మృత్యువులు.

**విషయేన్ద్రియజనితసుఖలవలక్షణవిశ్రామే** – ప్రాపంచిక విషయాలకు సంబంధించిన అల్పమైన సుఖాలు ఎప్పుడైనా కాస్త విశ్రాంతినిస్తాయి.

**పఞ్చేన్ద్రియార్థతృష్ణామారుతవిక్షోభోత్థితానర్థశతమహోర్మౌ** – పంచేంద్రియాలు కోరే ప్రాపంచిక సుఖాలమీద తృష్ణ అనేక అనర్థాలకు దారితీస్తున్నది. అది తుఫానులాగా ఎగసిపడేటంత పెద్ద అలలుగా బుద్ధిని కల్లోలపరుస్తున్నది.

**మహారౌరవాద్యనేకనిరయగతహాహేత్యాదికూజితాక్రోశనోద్భూతమహారవే** – మహారౌరవాది నరకాలు ఉన్నట్టుగా సంసారసముద్రంలో ఎందరో అవస్థలు పడుతున్నారు. సముద్రఘోషకు ధీటుగా వీరి హాహాకారాలు ఆకాశాన్ని అంటుతున్నాయి.

ఈ సంసార సాగరం దాటటానికేమైనా మార్గం ఉందా?

**సత్యార్జవదానదయాఽహింసాదమశమధృత్యాద్యాత్మగుణపాథేయపూర్ణజ్ఞానోడుపే**

పెద్ద ఓడల్లో చిన్న లైఫ్‌బోట్లు ఉన్నట్టుగా ఈ మహా సముద్రాన్ని దాటటానికి చిన్న తెప్ప ఉందిట. అది జ్ఞానతెప్ప. దానికి తెడ్లు సత్యం, ఆర్జవం, దయ, అహింస, శమం, దమం, ధైర్యంలాంటివి.

**సత్సంగసర్వత్యాగమార్గే మోక్షతీరే** – దానికి మార్గం సత్సంగత్వం. సర్వత్యాగం. అది చేర్చే తీరం మోక్షం.

**సత్సంగత్వే నిస్సంగత్వమ్।**
**నిస్సంగత్వే నిర్మోహత్వమ్।**
**నిర్మోహత్వే నిశ్చలతత్త్వమ్।**
**నిశ్చలతత్త్వే జీవన్ముక్తిః॥** – **భజగోవిందం**

# తృతీయ ఖండం

సృష్టిలో మూడు అంశాలు ఉంటాయి. భోక్త, భోగకరణం, భోగవిషయం. ఇప్పటివరకు భోగకరణాలు వచ్చాయి. ఇప్పుడు భోగవిషయం రావాలి. పరికరం వచ్చింది. వస్తువు రావాలి. ఇంకా భోక్త రాలేదు. భోక్త లేకుండా కరణం శిల్పంతో సమానం. దానిలో ఇంకా జీవం లేదు. పురస్వామి వస్తేనే పురానికి జీవం. మరి పురస్వామి లేకుండా కరణాలు ఎలా మాట్లాడాయి? సృష్టి గురించి ఉపనిషత్తులు రకరకాలుగా చెబుతాయని చూశాము. ఇదొక రకం. దీన్ని కథగా తీసుకుని ఆనందించాలి అంతే, నిజానిజాలు జోలికి వెళ్ళకూడదు.

**మంత్రం-1**

**స ఈక్షతేమే ను లోకాశ్చ లోకపాలాశ్చాన్నమేభ్యః సృజా ఇతి ॥**

**స ఈక్షత-** పరమాత్మ సంకల్పించాడు;
**ఇమే ను లోకాశ్చ లోకపాలాశ్చ -** ఈ లోకాలను, లోక పాలకులను సృష్టించాను.
**అన్నమేభ్యః సృజా ఇతి-** ఇప్పుడు అన్నాన్ని సృష్టిస్తాను అనుకున్నాడు.

**మంత్రం-2**

**సోఽపోఽభ్యతపత్తాభ్యోఽభితప్తాభ్యో మూర్తిరజాయత ।**
**యా వై సా మూర్తిరజాయతాన్నం వై తత్ ॥**

**సోఽపోఽభ్యతపత్-** పరమాత్మ నీటి గురించి తపస్సు చేశాడు. నీరు అంటే పంచభూతాలన్నింటినీ తీసుకోవాలని చూశాము.
**తాభ్యోఽభితప్తాభ్యో మూర్తిరజాయత-** ఆ నీటినుంచి ఒక మూర్తి ఉద్భవించింది.
**యా వై సా మూర్తిరజాయతాన్నం వై తత్-** ఆ మూర్తే అన్నం. అన్నం అంటే వ్రీహి, ధాన్యంలాంటివన్నీ తీసుకోవాలి.

## మంత్రం-3

**తదేనదభిసృష్టం పరాజత్యజిఘాంసత్తద్వాచాఽ జిఘృక్షత్తన్నాశక్నోద్వాచా గ్రహీతుమ్। స యద్ధైనద్వాచాగ్రహైష్యదభివ్యాహృత్య హైవాన్నమత్రప్స్యత్॥**

ఇక్కడ్నుంచీ కథ మొదలవుతుంది. దీన్ని కథగానే తీసుకుని మనం ఆనందించాలి.

**తదేనదభిసృష్టం పరాజత్యజిఘాంసత్–** అన్నం వచ్చాక అన్నానికి తనను అన్నీ తింటాయని భయంవేసి అన్నం పరుగుతీసిందట. అన్నం వెంట ఒక్కొక్క అంగమూ పరిగెత్తింది. కాని ఏదీ పట్టుకోలేకపోయింది. చివరికి అపానం జయించింది. అన్నింటిలోనూ సమానంగా ఉన్న పదాలను తీసుకుంటే ఆ మంత్రాల అర్థాలు తెలుస్తాయి.

**అజిఘృక్షత్ –** ఆ అంగం పట్టుకుందామని చూసింది.

**న అశక్నోత్ గ్రహీతుమ్ –** పట్టుకోలేకపోయింది.

**అగ్రహైష్యత్ –** ఒకవేళ పట్టుకోగలిగి ఉంటే;

**అత్రప్స్యత్ –** దానివల్ల తృప్తి పడి ఉండేవారు.

అంతకుముందు చూసిన పట్టికల్లో ఇంద్రియాల పట్టికను తీసుకోవాలి ఇక్కడ. ఈ మంత్రంలో ప్రయత్నించిన ఇంద్రియం వాక్కు (ముఖం). ఒకవేళ వాక్కు గనుక అన్నాన్ని పట్టుకోగలిగి ఉంటే, అన్నం గురించి మాట్లాడి ఉంటేనే ఆకలి తీరిపోయేది.

## మంత్రాలు 4-9

ఇంచుమించుగా ఇంద్రియాలు పుట్టిన వరుసలోనే వాటి ప్రయత్నం గురించిన వరుస కూడా వస్తుంది. అంటే వరుసగా వాక్కు, ప్రాణం, చక్షువు, శ్రోత్రం, రోమాలు, మనస్సు, అపానం, రేతస్సు. రేతస్సు తర్వాత అపానం వస్తుంది ఇక్కడ.

**తత్ప్రాణేనాజిఘృక్షత్తన్నాశక్నోత్ప్రాణేన గ్రహీతుమ్ । స యద్ధైనత్ప్రాణేనాగ్రహైష్యదభిప్రాణ్య హైవాన్నమత్రప్స్యత్ ॥ 4**

ఒకవేళ ప్రాణం అన్నాన్ని పట్టుకోగలిగి ఉంటే, ఆహారాన్ని ఆఘ్రాణించటంతోనే జీవి తృప్తి చెంది ఉండేవాడు. ప్రాణం అంటే ఇక్కడ ఘ్రాణ శక్తిగా తీసుకోవాలి.

**తచ్చక్షుషాఽజిఘృక్షత్తన్నాశక్నోచ్చక్షుషా గ్రహీతుమ్ । స**
**యద్ధైనచ్చక్షుషాఽగ్రహైష్యద్దృష్ట్వా హైవాన్నమత్రప్స్యత్ ॥ 5**

ఒకవేళ కన్ను అన్నాన్ని పట్టుకోగలిగి ఉంటే, కంటిచూపుతోనే జీవికి ఆకలి తీరి ఉండేది.

**తచ్ఛ్రోత్రేణాజిఘృక్షత్తన్నాశక్నోచ్ఛ్రోత్రేణ గ్రహీతుమ్ । స**
**యద్ధైనచ్ఛ్రోత్రేణాగ్రహైష్యచ్ఛ్రుత్వా హైవాన్నమత్రప్స్యత్ ॥ 6**

ఒకవేళ చెవి అన్నాన్ని పట్టుకోగలిగి ఉంటే, అన్నం మాట వింటేనే జీవికి ఆకలి తీరి ఉండేది.

**తత్త్వచాజిఘృక్షత్తన్నాశక్నోత్త్వచా గ్రహీతుమ్ । స**
**యద్ధైనత్త్వచాఽగ్రహైష్యత్స్పృష్ట్వా హైవాన్నమత్రప్స్యత్ ॥ 7**

ఒకవేళ స్పర్శ పట్టుకోగలిగి ఉండి ఉంటే, అన్నాన్ని సర్శిస్తేనే జీవికి ఆకలి తీరి ఉండేది.

**తన్మనసాజిఘృక్షత్తన్నాశక్నోన్మనసా గ్రహీతుమ్ । స**
**యద్ధైనన్మనసాఽగ్రహైష్యద్ధ్యాత్వా హైవాన్నమత్రప్స్యత్ ॥ 8**

ఒకవేళ మనస్సు పట్టుకోగలిగి ఉంటే, మనస్సులో భావన చేస్తేనే జీవికి ఆకలి తీరి ఉండేది.

**తచ్ఛిశ్నేనాజిఘృక్షత్తన్నాశక్నోచ్ఛిశ్నేన గ్రహీతుమ్। స**
**యద్ధైనచ్ఛిశ్నేనాఽగ్రహైష్యద్విసృజ్య హైవాన్నమత్రప్స్యత్ ॥ 9**

ఒకవేళ జననేంద్రియం పట్టుకోగలిగి ఉంటే, అన్నాన్ని విసర్జిస్తేనే జీవికి ఆకలి తీరి ఉండేది.

## మంత్రం-10

**తదపానేనాజిఘృక్షత్తదావయత్ సైషోఽన్నస్య గ్రహో।**
**యద్వాయురన్నాయుర్వా ఏష యద్వాయుః ॥**

**తదపానేనాజిఘృక్షత్–** తర్వాత అపానం పట్టుకోవటానికి ప్రయత్నించింది.
**తదావయత్ సైషోఽన్నస్య గ్రహో యద్వాయుః –** అన్నాన్ని అపానం మాత్రమే పట్టుకోగలిగింది.

అపాన వాయువుకు మూడు పనులు ఉన్నాయి.

1. శ్వాసక్రియలో తోడ్పడుతుంది. గాలిని లోపలికి పీలుస్తుంది.
2. అన్నాన్ని లోపలికి తీసుకుని కిందకి తోస్తుంది.
3. తిన్న అన్నం అరిగాక, వచ్చిన వ్యర్థమైన పదార్థాన్ని విసర్జిస్తుంది. అంటే పైనుంచి కింద దాకా అపాన వాయువు పనిచేస్తుంది. ఇక్కడ మనం రెండో అర్థాన్ని తీసుకోవాలి. అన్నాన్ని లోపలికి తీసుకుని కిందకి తోస్తుంది.

**అన్నాయుర్వా ఏష యద్వాయుః –** అన్నాన్ని పట్టుకోగలగటంవల్ల అపానవాయువుకు ఒక బిరుదు వచ్చింది. అది అన్నఆయుః (అన్నాయుః)

మనకు ఆయుష్షను పెంచే అన్నాన్ని అపానం ఇవ్వటంవల్ల పరోక్షంగా అపాన వాయువు మనకు దీర్ఘాయుష్షను ఇస్తుంది.

**అన్నగ్రాహకో హేతు భూత వాయుః అన్నాయుః**

దీనితో అన్న సృష్టి అయింది. అన్నం అంటే అన్నం మాత్రమే కాదని చూశాము. శబ్ద, స్పర్శ, రస, రూప, గంధాలతో కూడిన బాహ్యప్రపంచం. అన్నం పరిగెత్తింది, అపానం పట్టుకుంది అన్న ఈ వాక్యంనుంచి మనం రెండు విషయాలు గ్రహించాలి.

1. ఇంద్రియాలు, భోగకరణం; అన్నం భోగవిషయం. భోగకరణాలు అంతర్గతంగా ఉన్నాయి కాని, భోగ్యవస్తువు బాహ్యంగా ఉంది. అందువల్ల

ఆ భోగ్యవస్తువును ఎన్నుకునే అధికారం మన చేతిలో ఉంది. మంచి వస్తువును ఎన్నుకుంటామా, చెడు వస్తువును ఎన్నుకుంటామా అన్నది మన బుద్ధినిబట్టి ఉంది.

2. ఏ ఇంద్రియం చేసే పనిని ఆ ఇంద్రియంతోనే చేయాలి. ఉదాహరణకు నా కళ్ళకన్నా నా చెవులు బాగా పనిచేస్తాయి, నేను చెవులతో గులాబీపువ్వును వింటాను అనకూడదు. అందుకని ఈ కథను ఒక్కొక్క ఇంద్రియానికీ వర్తించుకోవచ్చు. అంటే రూపం వెనుక అన్నీ పరుగెత్తాయి కాని కన్నే సాధించింది.

## మంత్రం-11

**స ఈక్షత కథం న్విదం మదృతే స్యాదితి స ఈక్షత కతరేణ ప్రపద్యా ఇతి స ఈక్షత యది వాచా౭భివ్యాహృతం యది ప్రాణేనాభిప్రాణితం యది చక్షుషా దృష్టం యది శ్రోత్రేణ శ్రుతం యది త్వచా స్పృష్టం యది మనసా ధ్యాతం యద్యపానేనాభ్యపానితం యది శిశ్నేన విసృష్టమథ కో౭హమితి॥**

ఇది చాలా ముఖ్యమైన మంత్రం. దీన్ని అనుప్రవేశ శ్రుతి అంటారు.

ఇప్పటిదాకా భోగ్యకరణ సృష్టి, భోగ్యవస్తువు సృష్టి అయ్యాయి. ఇవన్నీ జడమే. ఇంకా భోక్త రాలేదు. భగవంతుడు తానే భోక్తగా ప్రవేశించాడు.

**స ఈక్షత –** సృష్టి ప్రకరణాలు చెబుతున్నంత సేపు, అడుగడుగునా స ఈక్షత మర్చిపోవటం లేదు ఉపనిషత్తు. సృష్టికి కేవలం ఉపాదానకారణం ఉంటే చాలదు, నిమిత్తకారణం కూడా ఉండాలి. ఆ నిమిత్తకారణం ఎవరు? భగవానుడే.

**ఆత్మా వా ఇదమేక ఏవాగ్ర ఆసీత్**

సః అంటే సృష్టికి పూర్వం తానొక్కడే ఉండి, తర్వాత లోకాలను, లోకపాలకులను, ఆకలిదప్పులను, మనిషి శరీరాన్ని, అన్నాన్ని సృష్టించిన పరమాత్మ, ఏమని సంకల్పించాడు?

**కథం న్విదం మదృతే స్యాదితి–** నేను లేకుండా ఈ భోగ్యకరణాలు ఎలా పనిచేస్తాయి? అంటే అవి జడం కదా, వాటిలో చైతన్యం లేకపోతే, అవి భోగ్యవస్తువులను ఎలా ఆనందిస్తాయి?

ఉదాహరణకు ఇంట్లో ఏదైనా వేడుక ఉంటే, పందిరి వేసి, వైర్లు పెట్టి, బల్బులు పెట్టి అంతా ఆర్భాటం చేశాక, స్విచ్ వేద్దామని చూస్తే అసలు కరెంట్ లేకపోతే ఏమిటి లాభం? ఇప్పుడు పరిస్థితి అలా ఉంది. అందుకని భగవానుడు తానే ప్రవేశిద్దామనుకున్నాడు.

మన స్వప్నవృత్తాంతం తీసుకుంటే ఈ విషయం బాగా అర్థమవుతుంది. మనం మంచంమీద పడుకుని ఒక స్వప్నప్రపంచాన్ని సృష్టిస్తాము. తర్వాత మనమే ఆ స్వప్నంలో ప్రవేశిస్తాము. ఇక్కడ స్థూలశరీరం అలాగే ఉంటుంది. వేరే స్వప్నశరీరం ధరించి స్వప్నంలో ప్రవేశిస్తాము. ఇక్కడ కూడా భగవానుడు మనలో ప్రవేశం చేస్తాడు. రెండు కారణాలకోసం అనుప్రవేశం చేస్తాడు.

1. లోకవ్యవహారార్థమ్
2. బ్రహ్మజ్ఞానార్థమ్

**1. లోకవ్యవహారార్థమ్:–** ఇందాక చూసినట్టుగా భోగ్యకరణాలు, భోగ్యవస్తువులను అనుభవించాలంటే వాటిలో ఒక చేతనవస్తువు ఉండాలి. అందువల్ల వ్యవహారం నడపటానికి, కలలోకి మనం ప్రవేశించినట్టుగా జీవాత్మగా ఇలలోకి ప్రవేశించాడు. కలలో మనం ప్రవేశించినట్టుగా మనకు ఎలా తెలియదో, అలా పరమాత్మ ఇలలో ప్రవేశించగానే అజ్ఞాని జీవాత్మ అవుతాడు. తానే పరమాత్మనని మర్చిపోతాడు.

**2. బ్రహ్మజ్ఞానార్థమ్:–** ఉన్నదంతా జడం కదా! నన్ను ఎవరు తెలుసుకుంటారు అనుకున్నాడుట. అందుకని తానే జీవాత్మగా ప్రవేశించాడు. ప్రవేశించక ముందు ఆయన ఆలోచన ఇలా ఉంది– ఈ జీవి ముందు తను శరీరం, ఇంద్రియాలు, మనస్సు అనుకుని వ్యవహారం చేస్తాడు. కాని కొన్నాళ్ళయ్యాక కొంత విశ్లేషణ చేస్తాడు. నేను కన్ను, చెవులు, మనస్సు కాను. అవి పనిచేస్తున్నట్టు నాకు తెలుస్తున్నాయంటే అవి నేను కాను. అవి నేను కాకపోతే నేనెవరు?

ఈ ప్రశ్న ఎప్పుడో ఒకప్పుడు ఉదయించకపోదు. అప్పుడు తనే పరమాత్మ అని తెలుసుకుంటాడు అని ఆశిస్తాడు పరమాత్మ. తను ఎక్కడో దూరంగా ఉంటే గ్రహించమని తను మన హృదయంలోకి ప్రవేశించాడు.

మళ్ళీ వరసగా ఒక్కొక్క ఇంద్రియం గురించి వస్తుంది. ఎనిమిది ఇంద్రియాలను చూశాము. అవి – వాక్కు, ప్రాణం, కన్ను, చెవి, రోమాలు, మనస్సు, అపానం, రేతస్సు. ఇప్పుడు మంత్రం చూద్దాము.

**స ఈక్షత–** భగవానుడు అనుకున్నాడు.

**యది వాచాఽభివ్యాహృతమ్** – ఒకవేళ వాక్కుతో మాటాడగలిగితే,
**యది ప్రాణేనాభిప్రాణితమ్** – ప్రాణంతో గాలి పీల్చగలిగితే,
**యది చక్షుషాదృష్టమ్** – కంటితో చూడగలిగితే
**యది శ్రోత్రేణ శ్రుతమ్** – చెవితో వినగలిగితే
**యది త్వచా స్పృష్టమ్** – స్పర్శతో స్పర్శించగలిగితే
**యది మనసా ధ్యాతమ్** – మనస్సుతో భావించగలిగితే
**యద్యపానేనాభ్యపానితమ్** – అపానంతో అన్నపానాదులు తీసుకోగలిగితే
**యది శిశ్నేన విసృష్టమ్** – జననేంద్రియంతో విసర్జించగలిగితే
**అథ కోఽహమితి** – నేనెవరు?

చూసే నేను చూడబడే వస్తువును కాను. ఇది ప్రాథమిక సూత్రం. ఇంతవరకూ ప్రయోగాలు వస్తువుమీద సఫలమయ్యాయి. కాని, నేనెవరు ప్రశ్నకు వైజ్ఞానపరంగా సరియైన జవాబు ప్రత్యక్ష ప్రమాణానికి కాని, తర్క ప్రమాణానికి కాని అందదు. కన్ను చూస్తోందని తెలుస్తున్నది, మనస్సు ఆలోచిస్తోందని తెలుస్తున్నదంటే నేను కన్ను కాదు, మనస్సు కాదు అని తెలుస్తున్నది.

పైగా వ్యాకరణపరంగా చూసినా ప్రాణేన, శ్రోత్రేణ, మనసాలాంటి మంత్రంలో వాడబడిన పదాలు తృతీయా విభక్తికి చెందినవి. ప్రథమా విభక్తి కర్తను సూచిస్తాయి. కాని తృతీయా విభక్తి కరణాన్ని సూచిస్తుంది. కంటితో, చెవితో, మనస్సుతో...

ఇవేవీ నేను కాకపోతే, నేనెవరు? ఈ ప్రశ్న ఎవరు అడుగుతారు? గుర్తుంచుకోండి. తనే కన్ను, చెవి, మనస్సు అనుకునే దశనుంచి, నేను వీటికి భిన్నంగా ఉన్నాను కాబట్టి నేనెవరు అనే ప్రశ్న ఒకరోజు జీవాత్మలో ఉదయిస్తుందని పరమాత్మ ఆశిస్తున్నాడు.

**స ఈక్షత – చింతయేత్ ఇతి.** పరమాత్మ ఈక్షత.నేనెవరు అని జీవాత్మ అడుగుతాడని పరమాత్మ ఆశిస్తాడు.

ఆ ఆశతో అనుప్రవేశం చేస్తాడు. చేసే ముందు మళ్లీ ఆలోచిస్తాడు. **(స ఈక్షత) కతరేణ ప్రపద్యా ఇతి** – మొదట్లో ఉన్న ఈ వాక్యాన్ని అప్పుడు వదిలేసి, ఇప్పుడు పట్టుకున్నాము. ఏ మార్గం ద్వారా ప్రవేశించను అనుకున్నాడుట.

సర్వవ్యాపియైన పరమాత్మ ప్రవేశించడమేమిటి? అంటే మనం గృహప్రవేశం చేసినట్టు, ఒక చోటినుంచి ఇంకో చోటికి వచ్చాడా? లేదు. మన జడశరీరంలో చైతన్యస్వరూపంగా ప్రకటితమయ్యాడు.

**యదా సూర్యః ప్రతిబింబరూపేణ ఆదర్శం ప్రవిశ్యతి**

సూర్యుడు అద్దంలో ప్రతిబింబరూపంలో ప్రవేశించినట్టుగా, పరమాత్మ చిదాభాసగా లభ్యమవుతున్నాడు. అంటే చిదాభాసగా వ్యక్తమౌతున్నాడు.

**చిదాభాస రూపేణ తత్ర ఉపలబ్ధిః ఏవ**

(అనుప్రవేశ భాష్యం, బృహదారణ్యకోపనిషత్తునుంచి, ఈ అధ్యాయం చివర యివ్వబడింది. దయజేసి చదువగలరు.)

## మంత్రం-12

**స ఏతమేవ సీమానం విదార్యైతయా ద్వారా ప్రాపద్యత। సైషా**
**విదృతిర్నామ ద్వాస్తదేతన్నాన్దనమ్ । తస్య త్రయ ఆవసథాస్త్రయః స్వప్నా**
**అయమావసథోఽ యమావసథోఽ యమావసథ ఇతి ॥**

**స ఏతమేవ సీమానం విదార్య –** నడినెత్తిమీద ఉన్న బ్రహ్మరంధ్రాన్ని చీల్చుకుని, **ఏతయా ద్వారా ప్రాపద్యత –** ఆ ద్వారం ద్వారా ప్రవేశించాడు.

**అంతరేణ తాలుకే య ఏష స్తన ఇవావలంబతే**
**సేంద్రయోనిః యత్రాసౌ కేశాన్తో వివర్తతే**
**వ్యపోహ్య శీర్షకపాలే – శీక్షావల్లీ, తైత్తిరీయం**

ఈ బ్రహ్మరంధ్రాన్ని ఇంద్రయోని అంది శీక్షావల్లి.

**సైషా విదృతిర్నామ ద్వాః –** ఇక్కడ విధృతి అనే నామంగల ద్వారం అంది.

**తదేతన్నాన్దనమ్ –** ఆనంద హేతువు. ఎందుకు? ఉపాసకుని జీవాత్మ బ్రహ్మరంధ్రం ద్వారా బయటకు వచ్చి బ్రహ్మలోకానికి వెళుతుంది. అక్కడ ఆనందమే ఆనందం. తర్వాత క్రమముక్తి పొందుతాడు. అందుకని బ్రహ్మరంధ్రం ఆనంద హేతువు అయింది.

**తస్య త్రయ ఆవసథాః –** ఎప్పుడైతే పరమాత్మ ప్రవేశించాడో, అప్పుడు ఆయన జీవాత్మ అయ్యాడు. అది కూడా అజ్ఞాని జీవాత్మ అయ్యాడు. ఆ అజ్ఞాని జీవాత్మకు మూడు స్థానాలు ఉన్నాయి. ఆవసథ అంటే శరీరాలు. ఆవసథ పదాన్ని ఒక్క ఐతరేయోపనిషత్తులోనే చూస్తాము.

మూడు శరీరాలు స్థూల సూక్ష్మ కారణ శరీరాలు. మూడు అవస్థలు వరుసగా జాగ్రద్, స్వప్న, సుషుప్తి అవస్థలు. వాటిలో వరుసగా విశ్వ, తైజస, ప్రాజ్ఞుల పేర్లతో చిదాభాసగా వెలుగొందుతున్నాడు. ఈ చిదాభాసలు ప్రకటమయ్యే స్థానాలు జాగ్రదావస్థలో కుడికన్ను, స్వప్నావస్థలో మనస్సు, సుషుప్తావస్థలో హృదయం. మూడు శరీరాలు చెప్పిందంటే మూడు శరీరాలే ఉన్నాయని కాదు. జీవి ఈ జన్మలో ఒక అవస్థనుంచి ఇంకో అవస్థలో ఎప్పుడూ తిరుగుతూనే ఉంటుంది.

శంకరాచార్యులు ఈ మూడు శరీరాలను ఇంకో విధంగా కూడా తీసుకోవచ్చు అంటారు. అవి – పితృశరీరం, మాతృశరీరం, స్వశరీరం. ఈ మూడు శరీరాలలో ఒకదానినుంచి ఇంకో దానికి మారుతూ అనేక జన్మలనెత్తుతాడు. అది ఎలా మూడు శరీరాల్లో మారతాడో వివరంగా రెండో అధ్యాయంలో వస్తుంది. **తస్య త్రయః ఆవసథాః** వాక్యానికి విశ్లేషణ రెండో అధ్యాయం.

**త్రయః స్వప్నాః అయమావసథోఽ యమావసథోఽ యమావసథ ఇతి** – మూడు శరీరాలను ఆవసథా అంటే మూడు అవస్థలను స్వప్నాః అంటుంది ఉపనిషత్తు. మూడు అవస్థలను స్వప్నాలుగా అభివర్ణించటంవల్లే ఈ ఉపనిషత్తు గొప్పదయింది. స్వప్నం స్వప్నం అని తెలుసు. తక్కిన రెండూ ఎలా స్వప్నమయ్యాయి? స్వప్నం మనం సృష్టించిన కల అయితే, జాగ్రద్ ప్రపంచం ఈశ్వరుడు సృష్టించిన కల.స్వప్నంనుంచి జాగ్రద్ ప్రపంచానికి లేస్తే స్వప్నం ఉండదు. అలాగే జాగ్రద్ ప్రపంచంనుంచి పారమార్థిక స్థాయికి వస్తే జాగ్రద్ ప్రపంచం కూడా ఉండదు. ఉండదు అనే పదాన్ని సరిగ్గా అర్థం చేసుకోవాలి. స్వప్నం అయితే నిజంగా కరిగిపోతుంది. కాని పారమార్థిక స్థాయికి ఎదిగినా కూడా జాగ్రద్ ప్రపంచం కరిగిపోదు. మనకళ్ళముందే ఉంటుంది. ఏమీ మార్పు ఉండదు. మనలో ఉంటుంది మార్పు. దాన్ని ఇంక పట్టించుకోము.

ఇంకో విధంగా చూసినా, స్వప్నంలో ఉన్న వస్తువులను జాగ్రదావస్థలో వాడుకోలేము. అలాగే జాగ్రదావస్థలో ఉన్న పరిస్థితి స్వప్నావస్థలో రాదు. ఇక్కడ సుష్ఠుగా భోజనం చేసి పడుకుని, అక్కడ ఆకలితో అలమటిస్తున్నట్టు రావచ్చు. అందుకని పడుకుని నిద్రపోతే జాగ్రదావస్థ లేదు; నిద్రనుంచి లేస్తే స్వప్నావస్థ లేదు. ఈ రెండూ లేనప్పుడు  వీటికి కారణమైన సుషుప్తి అవస్థ కూడా లేదు. ఆ విధంగా చూస్తే సుషుప్తి కూడా స్వప్నమే.

**అయమావసథోఽ యమావసథోఽ యమావసథ ఇతి–**

ఈ మూడు ఆవసథల్లో తిరుగుతుంది జీవాత్మ.

**ఇతి–** ఇక్కడితో అధ్యారోప ప్రకరణం అయింది.

కారణంనుంచి కార్యానికి వచ్చాము. ఇప్పుడు కార్యంనుంచి కారణానికి వెళ్ళాలి. ఏదైనా కట్టాలంటే పేకమేడనైనా సరే, చాలా సమయం కావాలి. అదే, దానిని పడగొట్టాలంటే క్షణం చాలు. అందుకే అపవాదం నాలుగు పాదాల్లో ముగుస్తుంది.

**మంత్రం-13**

**స జాతో భూతాన్యభివ్యైఖ్యత్కిమిహాన్యం వావదిషదితి ।**
**స ఏతమేవ పురుషం బ్రహ్మ తతమమపశ్యదిదమదర్శమితీ 3 ॥**

అనేక జన్మల్లో ఈ మూడు ఆవసథల్లో తిరుగుతుంటుంది జీవాత్మ. అలా తిరుగుతున్నప్పుడు, ఎప్పుడో ఆత్మజ్ఞానంమీద కోరిక పుడుతుంది.

**పరీక్ష్య లోకాన్ కర్మచితాన్ బ్రాహ్మణో**
**నిర్వేదమాయాన్నాస్త్యకృతః కృతేన**
**తద్విజ్ఞానార్థం స గురుమేవాభిగచ్ఛేత్**
**సమిత్పాణిః శ్రోత్రియం బ్రహ్మనిష్ఠమ్ ముండకమ్** 1.2.12

కర్మలు చేసీ చేసీ, అలసిపోయి, అంతఃకరణ శుద్ధి పొంది, అత్యంత కరుణామయుడైన గురువు దగ్గరకు వెళతాడు. గురువు దగ్గర వేదాంతభేరి ఉంటుంది. శిష్యునికి వేదాంతం కొత్త. అందుకని గురువు **ఉత్తిష్ఠత, జాగ్రత** అని మేలుకొలుపుతాడు. మహావాక్య శబ్దాలతో భేరిని మ్రోగిస్తాడు. అప్పటికీ శిష్యుడు మేలుకోకపోతే, భేరిని చెవుల దగ్గర మ్రోగిస్తాడు. అప్పుడు శిష్యుడు ఆత్మజ్ఞానం పొందుతాడు. ఎలా పొందుతాడో వివరంగా మూడవ అధ్యాయంలో వస్తుంది. ఇక్కడ ఆ వివరణ చెప్పకుండా ఆత్మజ్ఞానఫలం రుచి చూపిస్తున్నది ఉపనిషత్తు.

**స జాతః –** సః అంటే ఎవరు? సృష్టికి పూర్వం తానే ఉండి, జగత్తును సృష్టించి, తానే జీవిలోకి అనుప్రవేశం చేసిన పరమాత్మ. అంటే ప్రస్తుతం అజ్ఞాని జీవాత్మగా పుట్టి జ్ఞానమార్గంలోకి వచ్చిన జీవాత్మ.

**భూతాన్యభివ్యైఖ్యత్–** తనచుట్టూ ఉన్న జీవరాశులను వివేకంతో విచారణ చేశాడు. ఏమని? వీటిలో దేనికైనా స్వయం సత్తా ఉందా అని చూశాడు. అంటే కార్యం నుంచి కారణంలోకి వెళ్ళాడు. దానివల్ల కారణం లేకుండా కార్యం లేదని గ్రహించాడు.

**కిమిహాన్యం వావదిషదితి –** కారణానికి భిన్నంగా ఏం ఉంది? ఇది ప్రశ్నకాదు. కారణానికి భిన్నంగా ఏమీ లేదని నొక్కి వక్కాణించటం.

**ఆత్మవ్యతిరిక్తం కించిత్ నాస్తి**

ఆత్మకు భిన్నంగా కొంచెం కూడా ఏదీ లేదు. ఎందుకు? అన్నింటికీ ఆత్మ మూల కారణం కాబట్టి, కార్యానికి ఉనికి కారణంవల్లే వస్తుంది.

**వాచాఽ ఽ రమ్భణం వికారో నామధేయం మృత్తికేత్యేవ సత్యమ్**

ఆ బ్రహ్మను ఎలా గుర్తించాడు?

**సః –** ఈ జీవాత్మ; **ఏతమేవ పురుషమ్–** తన శరీరంలో ఉన్న జీవాత్మే. **బ్రహ్మ తతమమపశ్యత్–** సర్వవ్యాపకమైన బ్రహ్మ అని తెలుసుకున్నాడు. బ్రహ్మ సర్వవ్యాపకం అని తెలుసుకుంటే జ్ఞానం పరిపూర్ణమవదు. నేను ఆ సర్వవ్యాపకమైన బ్రహ్మనని తెలుసుకోవాలి. మళ్ళీ నేనంటే ఎవరో మర్చిపోకూడదు. నాలో ఉన్న సాక్షి చైతన్యం. తతమమ్ అంటే అతిశయేన వ్యాప్తం. అపశ్యత్ – అలా జగత్తుకు మూలకారణం బ్రహ్మ అని తెలుసుకున్నాడు. అది తనే అనీ తెలుసుకున్నాడు. అద్వైత బ్రహ్మను గుర్తిస్తే అది అపవాద ప్రక్రియ అవుతుంది. అప్పుడు జగత్తు కేవలం నామరూపాత్మకమైన జగత్తు అవుతుంది.

**బ్రహ్మ సత్యం జగన్మిథ్యా**

ఆత్మ వస్తువు అయింది. అనాత్మ అవస్తువు అయింది.

**ఏతమేవ పురుషం బ్రహ్మ తతమమపశ్యత్.** ఇది ఒక మహావాక్యం.

ఆ అద్వితీయం బ్రహ్మ నేనే.

**జీవో బ్రహ్మైవ నాపరః**

ప్రపంచం బ్రహ్మలో లయమయింది. బ్రహ్మనేనే అని అర్థమయింది. నాకు భిన్నంగా ఏదీ లేదు.

**యస్సాక్షాత్ కురుతే**
**అయమాత్మా బ్రహ్మ**
**జీవాత్మా ఏవ బ్రహ్మ**

చాలా ఆనందం పొందాడు.

**ఇదమదర్శమితీ 3 –** 3 సంఖ్య ఉంటే దాన్ని ప్లుతం అంటారు. ఇతీని మూడంకె లెక్కపెట్టే కాలవ్యవధిలో పఠించాలి. దాని అర్థం ఆనందంలో ఓలలాడాడని.

ప్లుతం అర్థం ఆహా! అని. ఈ ఆహానే, హా 3 వు అని వస్తుంది తైత్తిరీయంలో.

**ఏతత్సామగాయన్నాస్తే! హా 3 వు హా 3 వు హా 3 వు**
**అహమన్నమహమన్నమహమన్నమ్**
**అహమన్నాదో3 ఉ హమన్నాదో 3 ఉ హమన్నాదః – భృగువల్లీ**
**అహం వృక్షస్య రేరివా కీర్తిః పృష్ఠం గిరేరివ।**
**ఊర్ధ్వ పవిత్రో వాజినీవ స్వమృతమస్మి ॥ – శీక్షావల్లీ**

**అహెూ శాస్త్రమహెూ శాస్త్రమహెూ గురురహెూ గురుః।**
**అహెూ జ్ఞానమహెూ జ్ఞానమహెూ సుఖమహెూ సుఖమ్॥పంచదశి 7–297**

అహా! శాస్త్రమెంత అద్భుతం! గురువెంతటి మహాత్ముడు. ఈ జ్ఞానమెంత అద్భుతం! ఈ సుఖమెంత అనంతం!

### మంత్రం –14

**తస్మాదిదన్ద్రో నామేదన్ద్రో హ వై నామ। తమిదన్ద్రం సన్తమిన్ద్ర ఇత్యాచక్షతే పరోక్షేణ । పరోక్ష ప్రియా ఇవ హి దేవాః పరోక్షప్రియా ఇవ హి దేవాః॥**

**తస్మాదిదన్ద్రోనామః –** ఇందులో పరమాత్మకు కొత్త బిరుదు వస్తుంది. ఆ బిరుదు ఇదంద్ర. అంటే ఇదుగో అని కనిపించేటంత దగ్గరగా ఉన్నాడు.

జీవాత్మగా తెలుస్తున్నాడు. తానే ఆ బ్రహ్మ అని తెలుసుకున్నాడు.

**ఇదన్ద్రో హ వై నామ –** రెండోసారి చెప్పటంలో అర్థం పరమాత్మ ఇదంద్రుడుగా ప్రసిద్ధం అని. ఇదంద్ర అనీ అనీ అది చివరికి ఇంద్ర అయింది. ఉదాహరణకు రామమూర్తి పదాన్ని పదే పదే ఉచ్చరిస్తే రామ్మూర్తి అవుతుంది.

**తమిదన్ద్రం సన్తమిన్ద్ర ఇత్యాచక్షతే పరోక్షేణ –** ఆ పరమాత్మను పరోక్షంగా ఇంద్రుడు అంటారు. అసలు ఇంద్రుడు అంటే పరమాత్మ. తర్వాత పురాణాల్లో,

దేవతలకు రాజుని ఇంద్రుడు అని వ్యవహరించటం జరిగింది. వేదాల్లో ఇంద్రుడు అంటే ఈ స్వర్గాధిపతి కాదు, ఈశ్వరుడు, లేదా పరమాత్మ.

**యశ్ఛందసామృషభో విశ్వరూపః ఛందోభ్యో౽ధ్యమృతాత్సంబభూవ ।**
**స మేంద్రో మేధయా స్పృణోతు । – శీక్షావల్లీ**

**పరోక్షప్రియా ఇవ హి దేవాః పరోక్షప్రియా ఇవ హి దేవాః** – ఇంద్రుడు అని పరోక్షంగా ఎందుకు అన్నాం అంటే దేవతలకు పరోక్షంగా పిలిపించుకోవటం యిష్టం. అంతేకాదు, మనకన్నా పెద్దవారిని కూడా పేరుతో పిలవము.

ఇందులో కూడా పరమాత్మను ఇంద్రునిగా కీర్తించటం చూస్తాము. రెండుసార్లు చెప్పటంవల్ల ఈ అధ్యాయం ముగిసింది అని తెలుస్తుంది.

శిష్యుడు అధ్యారోప అపవాద పద్ధతి ద్వారా బ్రహ్మగురించి తెలుసుకున్నాడు. ఈపద్ధతిని నాలుగు దశల్లో చెప్పాలంటే ఇలా వస్తుంది.

అధ్యారోపం
1. కుండ కార్యం.
2. మట్టి కారణం.

అపవాదం
3. మట్టి లేకుండా కుండకు ఉనికి లేదు. అంటే కార్యం లేదు.
4. కార్యం లేకపోతే మట్టికి కారణత్వం లేదు. (కారణం లేదు అనకూడదు)

(అధ్యారోప అపవాదం ఇంకా వివరంగా బృహదారణ్యకోపనిషత్తునుంచి ఈ అధ్యాయం చివర యివ్వబడింది. దయజేసి చదువగలరు)

అపవాదం ద్వారా శిష్యుడు బ్రహ్మవిచారణ చేసి బ్రహ్మజ్ఞానం పొందాడు. విచారణ ఎలా చేశాడో ఉపనిషత్తు ఇప్పుడు చెప్పదు. ఏం తెలుసుకున్నాడు?

**స ఏతమేవ పురుషం బ్రహ్మ తతమమపశ్యత్**

ఇది ఒక మహావాక్యం. దీన్నే వివరంగా మూడవ అధ్యాయంలో చెబుతుంది. అక్కడ **ప్రజ్ఞానం బ్రహ్మ** అనే ప్రసిద్ధి పొందిన మహావాక్య విచారణ జరుగుతుంది.

# అనుప్రవేశ శ్రుతిమీద భాష్యం -1
## (బృహదారణ్యకోపనిషత్తునుంచి)

శ్రుతి చెప్పిన అంశం ఏమిటి? జగత్ సృష్టి జరిగాక, పరమాత్మే స్వయంగా జగత్తులో ప్రవేశించాడు అంటున్నది. **స ఏష ఇహ ప్రవిష్టః.**

ఈ వాక్యంమీద శంకరులవారు చాలా లోతుగా విశ్లేషించారు. దీన్ని **ప్రవేశ శ్రుతి** లేదా అనుప్రవేశ శ్రుతి అంటారు. దీన్ని తైత్తిరీయ ఉపనిషత్తులోనూ, ఛాందోగ్య ఉపనిషత్తులో కూడానూ చూస్తాము. అది వచ్చిన చోటల్లా దానిమీద భాష్యం రాశారు శంకరులవారు. బృహదారణ్యకంలో మరింత వివరంగా రాశారు. దాని సారాంశం చూద్దాము.

ముందుగా ఇక్కడొక సాంకేతిక సమస్య వస్తుంది. **స ఏష ఇహ ప్రవిష్ఠః** అంటే అతను ప్రవేశించాడు. అతను ఎవరు? అతను సర్వనామము. సర్వనామము నిర్వచనం ఏమిటి? నామవాచకం బదులుగా వాడేది. సుబ్రహ్మణ్యం లక్ష్మణశాస్త్రిగారి అబ్బాయి – అతను ఇంజనీరు.

ఈ వాక్యంలో సుబ్రహ్మణ్యంను ముందు పరిచయం చేశాక అతను అన్నాం. అప్పుడు అతను అంటే సుబ్రహ్మణ్యం అని తెలుస్తుంది.

ఇక్కడ శ్రుతి ముందు ఎవరి గురించి చెప్పిందో చూడాలి. అవ్యాకృతం, అవ్యక్తం, ప్రకృతి, మాయలాంటివి చర్చించింది.

**తద్ధేదం తర్హ్యవ్యాకృతమాసీత్**

ముందు మంత్రంలో ఈ జగత్తు అప్పుడు అవ్యాకృతంగా ఉంది అని వచ్చింది. అందువల్ల **'సః'** అంటే అవ్యాకృతం అవాలి. కాని శంకరులవారు **'సః'** అంటే పరమాత్మ అంటున్నారు. పరమాత్మ అంటే బ్రహ్మ. అవ్యాకృతాన్ని పరమాత్మ అని ఎలా అనగలరు? దానికి శంకరులవారు జవాబిస్తున్నారు.

ముందుగా అవ్యాకృతం అనేది బ్రహ్మకు భిన్నంగా లేదు. బ్రహ్మ లేదా పరమాత్మకు భిన్నంగా మాయకు ఉనికి లేదు. అందువల్ల అవ్యాకృతం అంటే బ్రహ్మ లేదా చైతన్యం కూడా వస్తుంది. అవ్యాకృతంకు మూడు సందర్భాలలో మూడు అర్థాలు ఉన్నాయి. మాయ, మాయాసహిత బ్రహ్మ లేదా ఈశ్వరుడు, బ్రహ్మ.

ఈ సందర్భంలో అవ్యాకృతం అంటే బ్రహ్మ మాత్రమే. ఎందుకు? తర్వాత వచ్చే చర్చలో, ముఖ్యంగా జీవ ఈశ్వర ఐక్యంలో బ్రహ్మ పదమే సరిపోతుంది. అందువల్ల, **'సః'** పదం అవ్యాకృతాన్ని సూచించినా, దాని అర్థం బ్రహ్మ. ఇలా ఉపనిషత్తు భిన్నసందర్భాలలో భిన్న అర్థాలు వాడితే మనను అయోమయంలో పడేయదా అంటే ప్రతిభాషలోనూ ఒక పదాన్ని అనేక అర్థాలతో వాడుతాము మనము.

శంకరులవారే దీనికొక ఉదాహరణనిస్తున్నారు. గ్రామం అనే పదానికి మూడు అర్థాలు ఉన్నాయి. గ్రామం అంటే ఒక ఊరు కావచ్చు, లేదా అందులో ఉండే ప్రజలు కావచ్చు లేదా రెండూ కావచ్చు.

1. గ్రామం శూన్యంగా ఉంది – ఊరు శూన్యంగా ఉంది.
2. గ్రామం వచ్చింది – ఊర్లో ఉండే మనుష్యులందరూ వచ్చారు.
3. ఆ గ్రామంలో ప్రవేశించరాదు – ఊరు, ఊర్లో ఉండే మనుష్యుల గురించి చెబుతున్నది.

ఒక చిన్న పదం గ్రామంకు మూడు అర్థాలు ఉంటే భగవానునికి ఉండవా? అందువల్ల 'సః' అంటే బ్రహ్మ.

**ప్రవిష్టః–** ప్రవేశం చేశాడు. దీనికి అర్థం చెప్పే ముందు శంకరులవారు ఐదు వాదనలను ప్రవేశపెట్టి వాటిని ఖండించారు.

**వాదన 1 – గృహం నిర్మించాక దేవదత్తుడు అందులో ప్రవేశించాడు.**

**జవాబు –** ఈ ఉదాహరణ పరమాత్మకు సరిపోదు. ఉదాహరణలో చూస్తే దేవదత్తుడు ఇంటిబయట ఉన్నాడు; ఇల్లు కట్టుకున్నాడు;ఇంట్లో ప్రవేశించాడు. అది ఫర్వాలేదు. ఎందుకంటే దేవదత్తుడు పరిమితమైన వ్యష్టిశరీరం ఉన్నవాడు.

ఇల్లు పరిమితమైంది. అతను ఇంటిలో లేడు. ఇంటి బయటినుంచి లోపలికి వచ్చాడు.

పరమాత్మ సర్వగతుడు, సర్వవ్యాపి. అంతటా ఉన్న పరమాత్మ ఒకచోటినుంచి ఇంకోచోటికి ఎలా వెళతాడు?

**వాదన 2 – పరమాత్మ గృహం నిర్మించాక, జీవాత్మ ప్రవేశించాడు.** కాంట్రాక్టరు కట్టాక, యజమాని ఇంట్లో ప్రవేశించినట్టుగా కాంట్రాక్టరు వేరు, యజమాని వేరు; పరమాత్మ వేరు, జీవాత్మ వేరు.

**జవాబు –** ఉపనిషత్తు స్పష్టంగా పరమాత్మ సృష్టించి,పరమాత్మ అనుప్రవేశం చేశాడు అని చెబుతున్నది. సృష్టించిన వ్యక్తి, ప్రవేశించిన వ్యక్తీ వేరు కాదు. ఒక్కరే! ఇక్కడ స్పష్టంగా లేకపోతే, తైత్తిరీయంలో ఉంది.

**తత్సృష్ట్వా తదేవానుప్రావిశత్**

ఈశ్వరుడే సృష్టించాడు. ఈశ్వరుడే ప్రవేశించాడు. ఈశ్వరుడు సృష్టించి జీవాత్మను పంపలేదు.

**వాదన 3 – ద్రవ్యగుణవత్–** ఒక గుణం ద్రవ్యంలో ప్రవేశించినట్టుగా, సృష్టి జరిగిన తర్వాత పరమాత్మ (చైతన్యం) కూడా జడప్రపంచంలో ప్రవేశించాడు. ఇది **నైయాయికుల** వాదన.

**జవాబు –** గుణం ఎప్పుడూ వస్తువుమీద ఆధారపడి ఉంటుంది. పరమాత్మ గుణంలాంటి వాడైతే, పరమాత్మ కూడా పరతంత్రుడు అవుతాడు. కాని పరమాత్మ స్వతంత్రుడు. అందుకని ఈ వాదన కుదరదు.

**వాదన 4 – ఫలే బీజవత్–** ఒక పండు పండినప్పుడు, అందులో ఒక భాగం గింజగా మారుతుంది. ఉదాహరణకు కొబ్బరి బోండాం తీసుకోండి. బాహ్యంగా అది ఒకటేలా ఉన్నా, లోపల మార్పులు జరుగుతూ ఉంటాయి. అదే విధంగా సర్వవ్యాపకమైన పరమాత్మలో నామరూపాలు వ్యక్తమవుతాయి. పరమాత్మ ఈ జగత్తులో ఉంటూనే మరో ధర్మంగా మార్పు చెంది జీవాత్మ అవుతాడు. అప్పుడు, శరీరంలో ఉన్న పరమాత్మ జీవాత్మగా మార్పు చెంది ఉండవచ్చు కదా!

**జవాబు –** ముందుగా మార్పును 'ప్రవేశం' అనలేము. పైపెచ్చు పరమాత్మకు అవయవాలు లేవు. పెరగటం, క్షీణించటంలాంటి ధర్మాలు పరమాత్మకు వర్తించవు.

**వాదన 5 – దర్పణే ప్రతిబింబవత్–** అద్దంలో ప్రతిబింబం ఏర్పడినట్టుగా, పరమాత్మ ప్రతిబింబం ఏర్పడి, ఆ ప్రతిబింబం ప్రవేశించింది అనవచ్చు కదా! సూర్యుడు ప్రతిబింబరూపంలో అద్దంలో ప్రవేశించినట్టుగా!

**జవాబు –** నా మొహం అద్దంలో చూసుకోవాలంటే, నేను కాక, అద్దం నాకు భిన్నంగా ఉండాలి. పరమాత్మ అద్వితీయం. పరమాత్మకు భిన్నంగా మరొకటి లేదు. అందువల్ల ప్రతిబింబం ఏర్పడే ఆస్కారమే లేదు.

కాని ఈ జవాబు మనలో ఒక సంశయాన్ని రేకెత్తించవచ్చు. ప్రతిబింబ చైతన్యం గురించి మనమే చెబుతాము కదా! కాని వేదాంతం ప్రకారం మనస్సు మిథ్య, అందువల్ల మనసు ప్రతిబింబింప చేసే ప్రతిబింబం కూడా మిథ్యే!

దీనితో పరమాత్మ ప్రవేశం గురించిన వాదోపవాదాలు అయ్యాయి. పరమాత్మ ప్రవేశించలేదని అంటే, శ్రుతి తప్పు చెబుతున్నట్టా?శ్రుతి ఎన్నడూ తప్పు చెప్పదు. శంకరులవారు ఈ అనుప్రవేశ శ్రుతిని అర్థవాద భాగం కింద తీసుకోవాలి అంటున్నారు. అర్థవాదం అంటే, ఈ భాగం మరో ముఖ్యమైన భాగాన్ని వివరిస్తుంది. దానికి విడిగా ప్రాముఖ్యత ఉండదు.

అది చెప్పే ఇంకో ముఖ్యమైన భాగం ఏమిటి? **జీవాత్మ,పరమాత్మల ఐక్యం**. జీవాత్మ పరమాత్మల ఐక్యాన్ని అర్థం చేసుకుంటే పరమాత్మ అనుప్రవేశం చేశాడు అంటే పరమాత్మ మనస్సు వెనుక సాక్షిలా అందుబాటులో ఉన్నాడు అని అర్థం.

అనుప్రవేశ శ్రుతిని అర్థవాదం అని ఎందుకన్నారు? సృష్టి గురించి గాని, అనుప్రవేశం గురించి గాని తెలుసుకుంటే కలిగే ఫలమేమిటో శ్రుతి ఎక్కడా చెప్పదు.సృష్టి గురించి తెలుసుకుంటే మోక్షం కలుగుతుంది అని చెప్పదు. కాని బ్రహ్మ గురించి తెలుసుకుంటే మోక్షం కలుగుతుంది అంటున్నది. అంటే ఏమిటి? ఇది ప్రత్యక్షంగా ఫలాన్నివ్వదు. అందుకని అర్థవాదం అన్నారు.

ప్రత్యక్ష ఫలాన్నివ్వని భాగాన్ని విధి వాక్యంతో కలపాలి. దీన్ని మీమాంస సూత్రం అంటారు. విధి వాక్యం ఏమిటి? పరమాత్మ జ్ఞానం. పరమాత్మ గురించి తెలుసుకోవాలంటే, సృష్టిగురించి తెలుసుకోవాలి. సృష్టి గురించి తెలుసుకోవాలంటే మనస్సు గురించి తెలుసుకోవాలి. మనస్సు గురించి తెలుసుకోవాలంటే అనుప్రవేశం గురించి తెలుసుకోవాలి.

ఇప్పుడు పరమాత్మ, సాక్షిరూపంలో మనస్సు వెనుక అందుబాటులో ఉన్నాడు అని తెలిసింది. జీవాత్మరూపంలో పరమాత్మ ఉన్నాడు. ఎప్పుడైతే జీవాత్మ పరమాత్మ అని తెలుసుకుంటామో, అప్పుడు సృష్టి అంశాన్ని మర్చిపోవాలి. అందుకని, మనం గుర్తుంచుకోవాల్సింది ఏది ముందు పుట్టింది, లేదా పంచభూతాల్లో ఎన్ని భూతాలు పుట్టాయిలాంటివి కాదు. **పరమాత్మా జీవాత్మ రూపేణ వర్తతే.**

అందువల్ల అనుప్రవేశశ్రుతి ద్వారా పరమాత్మ జీవాత్మ రూపంలో ఉన్నాడు అని తెలుసుకుంటే చాలు.

పరమాత్మ ప్రవేశించాడు అంటే పరమాత్మ అందుబాటులో ఉన్నాడు అని అర్థం. రామచంద్రుడు ఆఫీసులోకి వచ్చాడు అంటే, మాట్లాడటానికి అందుబాటులో ఉన్నాడు అని అర్థం. ఎప్పుడు వచ్చాడు మనకు అనవసరం. అందుబాటులో ఉన్నది అవసరం.

పరమాత్మ విషయంలో కూడా ఎలా వచ్చాడు అనవసరం. అందుబాటులో ఉన్నాడు అవసరం. జీవాత్మే పరమాత్మ, **అహం బ్రహ్మ అస్మి.** దీనితో అనుప్రవేశ శ్రుతిలో ఒక భాగం అయింది.

### అనుప్రవేశ శ్రుతిమీద భాష్యం – 2

భగవానుడు ప్రవేశం చేశాడు అంటే నిజంగా ప్రవేశం చేయలేదు. సాక్షి రూపంలో మనస్సులో అందుబాటులో ఉన్నాడు, అది జీవ ఈశ్వర ఐక్యంను సూచిస్తుంది అని శంకరులవారు నిరూపించారు. కాని తక్కిన దార్శనికులు దానిని అంగీకరించలేదు. వారు అనేక అభ్యంతరాలను లేవదీశారు. శంకరులవారు వాటన్నింటికీ జవాబు చెప్పారు. వాటిలో కొన్ని చూద్దాము.

**సగటు మానవుని వాదన –**

**వాదన 1 –** జీవాత్మ పరమాత్మతో ఎలా సమానం? జీవాత్మలు అనేకం. పరమాత్మ ఏకం. జీవాత్మ పరమాత్మ ఐక్యంచెప్పాలంటే అనేక పరమాత్మలు ఉన్నట్టు తీసుకోవాలి. కాని మనం పరమాత్మ ఒక్కటే అంటాము. ఇది సగటు మానవుని వాదన

**జవాబు –** జీవాత్మలు అనేకం అని ఎవరు చెప్పారు? జీవాత్మలు అనేకం అని మీరు అనుకుంటున్నారు, ఎందుకంటే మనస్సులు అనేకం కాబట్టి. మనసుకున్న నానాత్వాన్ని సాక్షికి ఆపాదిస్తున్నారు. సాక్షి ఒక్కటే. సూర్యుడు ఒక్కటే. కాని అనేక ప్రాంతాల్లో కనిపించటంవల్ల అనేకంగా అనిపిస్తాడు. సూర్యునిచేత ప్రకాశింపబడే వస్తువులు అనేకం. కాని ప్రకాశింపచేసే సూర్యుడు ఒక్కటే. సాక్షిచైతన్యంచేత ప్రకాశింపబడే మనస్సులు అనేకం. కాని ప్రకాశింపజేసే సాక్షిచైతన్యం ఒక్కటే.

**వాదన 2 –** జీవాత్మ దుఃఖభూయిష్టమైనది. రాగద్వేషాలు, సంసారం ప్రతిజీవాత్మలోనూ ఉంటాయి. ఇప్పుడు జీవాత్మ పరమాత్మ ఒక్కటే అంటే, జీవాత్మ సంసారి కాబట్టి పరమాత్మ మహాసంసారి అవాలి. వేదాంతం నేర్చుకున్నాక, సంసారి జీవుల సంఖ్యలో మరో సంఖ్యను అదనంగా చేరుస్తాము. పాపం దేవుడు కూడా సంసారబంధంనుంచి తప్పించుకోలేడు. కాని ఈశ్వరునికి దోషాలు లేవు అంటుంది. అదెలా సాధ్యం?

**జవాబు –** జీవాత్మ, పరమాత్మలు ఒక్కటే అంటే, ఆ వాక్యాన్ని సరిగ్గా అర్థం చేసుకోవాలి. జీవాత్మ సంసారి అనీ, పరమాత్మ అసంసారి అనీ మీరే అంటున్నారు. జీవాత్మ=పరమాత్మ వాక్యాన్ని రెండు రకాలుగా అర్థం చేసుకోవచ్చు.

మొదటి అర్థం మీరు తీసుకున్నదే. పరమాత్మను కూడా సంసారిని చేసేయటం. కాని ఇంకో అర్థం ఉంది. ఏమిటది? పరమాత్మ అసంసారి కాబట్టి, జీవాత్మ కూడా అసంసారే! శాస్త్రం లక్ష్యమే మనుష్యులకు మోక్షాన్ని ప్రసాదించటం. అందువల్ల జీవాత్మను దుఃఖంనుంచి తొలగించటానికి పాటు పడుతుంది.

ఎలాగైతే పరమాత్మ అసంసారియో, ఎలాగైతే పరమాత్మకు సుఖదుఃఖాలు అంటవో, అలాగే జీవునికి కూడా సుఖదుఃఖాలు అంటవు. జీవాత్మకు దుఃఖం ఉంది అనుకోవటం మన పొరపాటు, అయోమయం, భ్రాంతి. శాస్త్రం నేర్చుకుంటే ఈ భ్రాంతిని తొలగిస్తుంది. దానికి శ్రుతి ప్రమాణం కూడా చూపుతారు శంకరులవారు.

**వాదన 3 –** శ్రుతి చెప్పవచ్చు, జీవాత్మకు దుఃఖం లేదని. కాని నా అనుభవం వేరేగా ఉంది. శ్రుతి చెప్పినంతమాత్రాన అంగీకరించాలని ఏమీ లేదు. మీమాంస సూత్రం ప్రకారం శ్రుతి చెప్పినదేదైనా ప్రత్యక్షప్రమాణానికి భిన్నంగా ఉంటే, దాన్ని ఉన్నదున్నట్టుగా స్వీకరించకూడదు. దాన్ని మన ప్రత్యక్ష అనుభవాన్ని ఖండించకుండా ఉండేటట్టు అర్థం చేసుకోవాలి. అందువల్ల శ్రుతి జీవాత్మకు దుఃఖం లేదంటుంది. వేదాంతం వినటానికి బాగానే ఉంది. కాని వేదాంతం నేర్చుకునే విద్యార్థులకు కూడా దుఃఖం ఏమీ తొలగిపోలేదే. అందువల్ల జీవాత్మ, పరమాత్మ ఒక్కటే అనలేము.

**జవాబు –** దుఃఖం ఉన్నది ఎవరికి? ఆత్మకు కాదు, అనాత్మకు.

**ఎప్పటికీ అనుభవించే నేనే ఆత్మను, ఎన్నటికీ అనుభవించబడే వస్తువును కాను.**

**ఎవ్వర్ ది ఎక్స్‌పీరియన్సర్, నెవ్వర్ ది ఎక్స్‌పీరియన్స్‌డ్.**

ఇది ఆత్మ నిర్వచనం. ఆత్మ విషయం (వస్తువు) కాదు. వస్తువు కానప్పుడు అది అనుభవంలోకి రాదు. ఆత్మ విషయం (ఆబ్జెక్ట్) కాదు, విషయీ (సబ్జెక్ట్). అందువల్ల ఆత్మకు దుఃఖం అంటదు.

ఇంతవరకూ సగటు మానవునితో వాద, ప్రతివాదాలు చూశాము.

**క్షణిక విజ్ఞానవాది వాదన**

**వాదన 4 –** ఆత్మ వస్తువు కాదు. అందుకని ఆత్మకు దుఃఖం అంటదు అన్నారు బాగానే ఉంది. కాని **ఆత్మ తనను తాను అనుభవించవచ్చు** కదా! ఆత్మ తనను తాను అనుభవిస్తోందంటే దానికున్న దుఃఖాన్ని కూడా అనుభవిస్తుంది కదా. ఆ విధంగా ఆత్మ దుఃఖం ప్రత్యక్ష విషయం. ఆత్మకు దుఃఖం ఉంది కాబట్టి దాన్ని దుఃఖానికి అతీతమైన పరమాత్మతో సమానం చేయలేము.

**జవాబు – కర్తృకర్మ విరోధాత్ –** ఆత్మ తనను తాను అనుభవిస్తున్నది అనే వాక్యం సరియైనది కాదు. ఈ వాక్యంతో ఆత్మ అనుభవించే నేను, అనుభవించబడే వస్తువు– రెండూ అవుతుంది. ఒకే వస్తువు సబ్జెక్ట్‌గానూ, ఆబ్జెక్ట్ గానూ ఉండలేదు. కర్త, కర్మ ఒకరే అవలేరు. దాన్ని **కర్తృకర్మ విరోధం** అంటారు.

చూసే కన్నులు తనను తాను చూసుకోలేవు. తినే వ్యక్తి తనను తాను తినలేడు.

బోధ చేసే గురువు తనకు తాను బోధ చేసుకోలేడు. అందువల్ల నన్ను నేను అనుభవించలేను.

**వాదన 5 –** పూర్వపక్షి వాదన కొనసాగుతున్నది. సరే ఆత్మను కర్మగానూ, కర్తగానూ – రెండింటిగా చూడలేము అన్నారు బాగానే ఉంది. ఒకే ఆత్మలో ఒక భాగాన్ని కర్తగా, మరో భాగాన్ని కర్మగా తీసుకోవచ్చుకదా!

కన్ను దృష్ట్యా నేను ద్రష్టను చెయ్యి దృష్ట్యా నేను దృక్కును.

అలా నన్ను నేను చూసుకుంటున్నానా లేదా? ఆ విషయంగా ఆత్మ ఒక భాగం ఇంకోభాగాన్ని చూస్తోంది. అలా ఆత్మ ఒక భాగంలో దుఃఖం ఉండవచ్చుకదా!

**జవాబు:– నిరంశత్వాత్ – నిర్వికల్పత్వాత్–** మీ జవాబు ఒప్పుకోగలిగి ఉంటే బాగుండును కాని దురదృష్టవశాత్తూ అది సాధ్యం కాదు. ఎందుకంటే ఆత్మకు భాగాలు లేవు. ఆత్మ నిర్వికల్పం. అందువల్ల ఆత్మ ఒక భాగం దుఃఖాన్ని అనుభవిస్తుంది అనే వాదనను అంగీకరించలేము.

దీనితో క్షణిక వాదన కూడా కొట్టివేయబడింది.

**తర్కశాస్త్రం**

**వాదన 6:–** శంకరులవారి వాదన తప్పు. ఏమిటది? ఆత్మకు దుఃఖం లేదు. జీవాత్మ పరమాత్మతో సమానం తప్పు అని ఎవరంటున్నారు ఇది? తర్కశాస్త్రజ్ఞులు. తర్కం ప్రకారం ఆత్మకు దుఃఖం ఉంది. దుఃఖం అంటే రాగద్వేషాలు, సుఖదుఃఖాలు.

**జవాబు:-** తర్కశాస్త్రంలో అనేక లొసుగులు ఉంటాయి. దాన్ని ఎవరు స్వీకరిస్తారు అంటున్నారు శంకరులవారు. ఆ లొసుగులలో కొన్నింటిని ఎత్తి చూపుతున్నారు.

ఎ) ఆత్మ నిత్యం, ఆత్మలక్షణం దుఃఖం అంటున్నారు వారు. అంటే ఆత్మ గుణి, దుఃఖం గుణం; గుణం, గుణి విడదీయరానివి అంటున్నారు. దుఃఖం అనిత్యం.

**జవాబు:-** అనిత్య దుఃఖం, నిత్య ఆత్మ- రెండు భిన్నమైనవి ఎలా కలిసి ఉండగలవు? ఆత్మ నిత్యమైతే, దుఃఖం కూడా నిత్యమవ్వాలి. కాని అనిత్యం అని మీరే అంటున్నారు. కాబట్టి అనిత్య దుఃఖం నిత్య ఆత్మతో కలిసి ఉండలేదు.

బి) తర్కశాస్త్రంలో ఆత్మను తర్కం ద్వారా నిరూపిస్తారు. అనేక దశల్లో వాదించుకుంటూ వెళ్ళి, ఆత్మ దగ్గర జేరతారు. దాని సారాంశం ఆత్మ **అనుమేయం.** ఇది మొదటి వాక్యం. దానికి దుఃఖం ఉంది అంటారు. ఇది రెండో వాక్యం. దుఃఖం ప్రత్యక్షం.

**జవాబు:-** ప్రత్యక్ష గుణం (దుఃఖం) అనుమేయవస్తువు (ఆత్మ)కు ఎలా చెందుతుంది? ప్రత్యక్ష గుణం మీ ఎదురుగుండా ఉంది. తర్కం ద్వారా గ్రహించిన వస్తువు ప్రత్యక్షంగా తెలియటం లేదు. అందువల్ల కంటికి తెలియని వస్తువుకు కంటికి తెలిసే లక్షణం ఎలా ఉంటుంది? కాబట్టి ఇది సరికాదు.

సి) ఆత్మ జడమే. కాని సర్వవ్యాపకమైన ఆత్మ మనస్సుతో కలిస్తే దానికి ఎరుక వస్తుంది. ఆత్మ మనస్సుతో కలుస్తుంది. మనస్సు ఇంద్రియాలతో కలుస్తుంది. ఇంద్రియాలు వస్తువుతో కలుస్తాయి. అప్పుడు జ్ఞానం కలిగి సుఖదుఃఖాలు పోతాయి. జ్ఞానం కాని, దుఃఖం కాని పుడితే అవి దేనికన్నా సంబంధించినవై ఉండాలి. లక్షణం ఒక వస్తువుకు చెందుతుంది. ఆ వస్తువు ఆబ్జెక్ట్ కావచ్చు. ఇంద్రియాలు కావచ్చు, మనస్సు కావచ్చు. ఆత్మ కావచ్చు. తర్కశాస్త్రం ప్రకారం అలా పుట్టిన సుఖదుఃఖాలు ఆత్మకు చెందుతాయి. ఆత్మ జడం, మనస్సు కూడా జడమే. కాని రెండు జడపదార్థాలైన ఆత్మ, మనస్సు కలిస్తే వాటి కలయికతో చైతన్యం ఏర్పడుతుంది. అది సుఖదుఃఖాలను అనుభవిస్తుంది అంటారు వారు.

**జవాబు – నిరయవత్వాత్–** సంయోగం తర్వాత వచ్చే లక్షణం శాశ్వతం కాదు. ఆత్మ అసలు మనస్సుతో కలవలేదు. తర్కశాస్త్రమే ఒక సూత్రం చెబుతుంది. ఏమిటది? రూపాలు ఉన్న రెండు వస్తువులు మాత్రమే కలవగలవు. ఇది సూత్రం ఒకటి. తర్కశాస్త్రమే ఆత్మకు రూపం లేదు అంటుంది. ఇది సూత్రం రెండు. అంటే రూపం లేని ఆత్మ రూపం ఉన్న మనస్సుతో ఎలా కలుస్తుంది? మనస్సుతో కలిసి ఎలా సుఖదుఃఖాలను పుట్టిస్తుంది?

ఆ విధంగా తర్కశాస్త్ర వాదనతోనే తర్కశాస్త్రాన్ని పడగొట్టారు శంకరులవారు. దీనితో తర్కశాస్త్ర వాదోపవాదాలు ముగిశాయి.

**జైనవాదులు**

**వాదన 7 –** ఆత్మను నిర్వికారంగా, సర్వవ్యాపకంగా తీసుకుంటే కదా ఈ సమస్య. మా వాదనను తీసుకోండి. ఆత్మ సర్వవ్యాపకం కాదు. ఆత్మ అమృతం కాదు. ఇది జైనవాదులు అంటున్నారు. ఆత్మ సర్వవ్యాపకం అనేది శరీరం పరిధి మేరకే. ఆత్మ పరిమాణం, శరీర పరిమాణం అంత ఉంటుంది. దీన్ని మధ్యమ పరిమాణః అంటారు. అత్యంత చిన్న పరిమాణాన్ని అణువు అనీ, అత్యంత పెద్ద పరిమాణాన్ని విభువు అనీ అంటారు. ఈ రెండింటికీ మధ్యలో ఉన్న దాన్ని మధ్యమ పరిమాణం అంటారు. ఆత్మ మధ్యమ పరిమాణం గలది అంటారు జైనులు.

**జవాబు:– యద్ సావయవం తద్ అనిత్యం ఘటవత్.**

దేనికైతే రూపు ఉంటుందో, అది నాశనమవుతుంది. అనిత్యం. నామం రూపం ఉన్న ప్రతి దానికీ ఒక ఆది, ఒక అంతం ఉంటుందని మన అనుభవం చెప్తుంది. కుండలాగా అవయవాలు ఉన్నది అనిత్యం అంటారు శంకరులు.

ఆత్మ నిత్యం అని అద్వైత వాదులే కాదు, తక్కిన ఆస్తికవాదులైన సాంఖ్య, నైయాయికులులాంటి వారు కూడా ఒప్పుకుంటారు. అందువల్ల ఆత్మ నిత్యం అయితే అది నిరవయవం అవాలి. ఆత్మ సవయవం అయితే అనిత్యం అవాలి. అంటే నిత్యత్వం, సావయవత్వం కలిసి ఉండలేవు.

**వాదన 8 –** కొన్ని అసాధారణ పరిస్థితుల్లో కలవవచ్చు. ఉదాహరణకు వజ్రం.
**జవాబు –** ఇది తప్పు. వజ్రాన్ని కోయటం కష్టమే కాని అది ఎప్పుడో ఏర్పడింది. జైనులు వజ్రం ఏర్పడటం కాని, నాశనం అవటం కాని చూసి ఉండక పోవటంవల్ల వజ్రం నిత్యం అనుకుంటున్నారు. అది సావయవం. దానికి నామం, రూపం ఉన్నాయి. అది నాశనమవటం మనం కళ్ళతో చూడలేనంత మాత్రాన అది అనిత్యం అవదు అంటారు శంకరులవారు.

దానికి ఉదాహరణ సూర్యుడు. సూర్యుని పుట్టుకను కాని, నాశనాన్ని కాని శాస్త్రజ్ఞులు చూడలేదు కాని, వారు సూర్యుని నాశనం గురించి తర్కం ద్వారా నిరూపించగలరు.

**సూర్యః అనిత్యః సావయవత్వాద్ ఘటవత్**

ఈ సూత్రం ప్రకారం వజ్రంకూడా అనిత్యమే. అందువల్ల సావయవం అంటే ఆత్మ అనిత్యం అవుతుంది. ఈ విధంగా జైన వాదనను ఖండించారు. దీనితో ప్రవేశభాష్యం అయిపోయింది.

# అధ్యారోప అపవాద విశ్లేషణ

బ్రహ్మ లేదా ఆత్మను అర్థం చేసుకోవటానికి చాలా సూక్ష్మబుద్ధి ఉండాలి. అందుకని ఉపనిషత్తు దానికి ఒక ప్రత్యేకమైన పద్ధతిని లేదా ప్రత్యేక ప్రక్రియను లేదా ప్రత్యేక సాంప్రదాయాన్ని ఉపయోగిస్తుంది. అన్ని ఉపనిషత్తుల్లోనూ చూస్తాము దీన్ని. దీన్ని **అధ్యారోప అపవాదం ప్రక్రియ** అంటారు. ఈ పద్ధతి ద్వారా బ్రహ్మజ్ఞానాన్ని కలుగచేసే విధానాన్ని **ఉపదేశం** అంటారు.

అధ్యారోప అపవాద ప్రక్రియ గురించి అర్థం చేసుకునే ముందు వేదాంతంలో తరచు వచ్చే మూడు ముఖ్యమైన పదాలను తెలుసుకోవాలి – అసత్, సత్, మిథ్య.

**అసత్ – త్రికాలేపి న తిష్ఠతి.** దీన్ని తుచ్ఛం అని కూడా అంటారు. ఉదాహరణకు కుందేటి కొమ్ము, వంధ్యాపుత్రుడు(గొడ్రాలి కొడుకు), ఆకాశపుష్పాలు.

**సత్ –** మూడు కాలాల్లోనూ ఉండేది. **త్రికాలేపి తిష్ఠతి.**

**మిథ్యా –** ఒక కాలంలో ఉండి, ఇంకో కాలంలో లేనిది. కొన్నాళ్ళు మాత్రమే ఉండేది సత్తా, అసత్తా? ఒక కాలంలో ఉంది కాబట్టి అసత్ కాదు; మూడు కాలాల్లోనూ లేదు కాబట్టి సత్ కూడా కాదు. అది శాశ్వతంగా లేదు అనీ చెప్పలేము; అది శాశ్వతంగా ఉంది అనీ చెప్పలేము. అందుకని దీన్ని **సత్ అసద్భ్యాం అనిర్వచనీయం మిథ్యా** అంటారు. సత్ అసత్‌లకు విలక్షణంగా ఉంది. దీన్నే మిథ్యా అంటారు.

ఇప్పుడు మిథ్యావస్తువు గురించి చూద్దాము. ఉదాహరణకు ఒక కుండని తీసుకుందాము. ఈ కుండ మట్టినుంచి పుట్టింది; మట్టివల్లే దానికి ఉనికి ఉంది; మట్టిలోనే లయమవుతుంది. అశాశ్వతమైన కుండకు మట్టివల్లే ఉనికి ఉంది. దీన్నే ఇంకో విధంగా చెప్పాలంటే, కుండకు దానికంటూ విడిగా ఉనికి

లేదు. దీన్నిబట్టి, మనం ఒక సూత్రాన్ని చెప్పవచ్చు. **మిథ్యావస్తువుకు స్వతంత్రంగా ఉనికి లేదు.** అది దేనిమీదో ఆధారపడి ఉంది.

దీన్నుంచి ఇంకో అంశంలోకి వెళదాము. ఇప్పుడు మిథ్యా వస్తువుకు స్వతంత్రంగా ఉనికి లేదు. అంటే అది దేనిమీదో ఆధారపడి ఉన్నది కదా! అది దేనిమీద ఆధారపడిందో, అది కూడా మిథ్యావస్తువైతే, అది వేరే దేనిమీదో ఆధారపడాలి. అందుకని మిథ్యా వస్తువు సత్యవస్తువుమీద ఆధారపడాలి. దాన్నే **'సత్'** అనీ, **'సత్యం'** అనీ అంటాము.

ఇప్పుడు మనం మూడు విషయాలు తెలుసుకున్నాం.

1. సత్, అసత్, మిథ్య
2. మిథ్యకు స్వతంత్రంగా ఉనికి లేదు.
3. మిథ్య సత్యంమీద ఆధారపడి ఉంది.

ఇప్పుడు ఈ మూడు అంశాలను అధ్యారోప, అపవాద ప్రక్రియకు అన్వయించి చూస్తాము.

అధ్యారోపం అంటే జగత్తు ఉంది అని ఒప్పుకుంటుంది శ్రుతి. జగత్తు ఉందని ఒప్పుకోవటంవల్ల దాని సృష్టి గురించి; జగత్తులో ఉన్న అనేక వస్తువుల గురించి, పురుషార్థాల గురించి, మార్గాల గురించి, ప్రకృతి సూత్రాల గురించీ అలా అనేక విషయాల గురించి చెబుతుంది. వీటన్నింటినీ అంగీకరించే అంశాన్ని అధ్యారోపం అంటారు.

అధ్యారోపాన్ని అంగీకరించాక, శ్రుతి మనను ఆటపట్టిస్తుంది. ఏ జగత్తు అయితే ఉందని ఏ శ్రుతి అయితే చెప్పిందో, అదే శ్రుతి అదే జగత్తు లేదంటుంది. అలా జగత్తులో ఉన్న ప్రతిదాన్నీ,చివరికి జగత్తునూ, దాని ఉనికినీ కొట్టివేస్తుంది. **'నేతి –నేతి'** సిద్ధాంతం ద్వారా. నేతి అంటే న యితి – ఇది లేదు. ఇది లేదు, ఇది లేదు అంటూ అన్నింటినీ తీసేస్తుంది. అధ్యారోపం అంటే జగత్తు ఉనికిని అంగీకరించటమైతే, అపవాదం జగత్తును లేదని కొట్టివేయటం.

ఇప్పుడు మనం నేర్చుకున్న మూడు అంశాల్లోంచి మొదటి అంశాన్ని తీసుకుందాము– సత్, అసత్, మిథ్యా. జగత్తును ఎందులో వేద్దాము? జగత్తు

సత్తా, అసత్తా, మిథ్యా? జగత్తు ఉందని శ్రుతి అంటోంది కాబట్టి దాన్ని **అసత్** అనలేం, ఎందుకంటే అసత్ అనేది ఏ కాలంలోనూ ఉండదు.

పోనీ **సత్** అందామా? శ్రుతి జగత్తు ఉందని ఒప్పుకుంటూనే, సృష్టి లేదని కొట్టి వేస్తున్నది. కాబట్టి జగత్తును **సత్ అనలేం** కూడా, ఎందుకంటే సత్ అనేది మూడు కాలాల్లోనూ (ఎప్పుడూ) ఉంటుంది.జగత్తులోకి నా శరీరం, నా ఇంద్రియాలు, నా మనస్సు కూడా వస్తాయి.

ఇంక మిగిలింది ఏమిటి? మిథ్య. అధ్యారోపం ప్రకారం అసత్‌ను కాదన్నాం; అపవాదం ప్రకారం సత్‌ను కాదన్నాం. అందువల్ల జగత్తు మిథ్య అయింది; మిథ్య నిర్వచనం కూడా అదే కదా! ఒక కాలంలో ఉండి, ఇంకో కాలంలో లేనిది.

**మొదటి సూత్రం ప్రకారం జగత్తు మిథ్య.**

ఇప్పుడు రెండో సూత్రం చూద్దాము– మిథ్యకు స్వతంత్రంగా ఉనికి లేదు. స్వతంత్రంగా ఉనికి లేకపోతే, దానికి ఒక అధిష్ఠానం కావాలి. ఆ అధిష్ఠానం పేరు సత్యం.

**రెండవ సూత్రం ప్రకారం జగత్తుకు విడిగా ఉనికి లేదు.**

ఇప్పుడు మూడవ సూత్రం చూద్దాము– మిథ్య సత్యంమీద ఆధారపడి ఉంది. దీని ప్రకారం జగత్తుకు అధిష్ఠానం ఏమిటో చూడాలి. అధ్యారోపం అపవాదం ద్వారా శ్రుతి జగత్తును కొట్టి వేసింది. జగత్తు మిథ్య. దానికొక సత్యం అధిష్ఠానంగా ఉంది అంది. ఏమిటా అధిష్ఠానం? అది సత్యవస్తువు కాబట్టి దేన్నిబడితే దాన్ని అధిష్ఠానంగా తీసుకోలేము.

జగత్తును కొట్టి వేసింది కాబట్టి, జగత్తులోకి రానిది,జగత్తుకు బాహ్యంగా ఉన్నది, ఏది మిగిలిందో, ఆ మిగిలిన వస్తువు సత్యం అవుతుంది. జగత్తునంతా కొట్టి వేస్తే ఏమిటి మిగిలింది? నేను, మనశ్శరీరాలుకాని నేను, అంతటినీ చూస్తున్న నేను, కొట్టివేయబడలేని నేను మిగులుతాను. చైతన్యరూపంలో, సాక్షిరూపంలో నేను మిగులుతాను.

అందువల్ల జగత్తునంతా కొట్టివేశాక, నేను సత్యంగా ప్రకటితం అవుతాను. వేదాంతం మొత్తం **జగత్తును మిథ్యగాను,** మిగిలిన **నన్ను సత్యం గానూ** చూస్తున్నది. అంటే సత్యమైన చైతన్య ఆత్మ మాత్రమే మిగులుతుంది.

అధ్యారోప అపవాద ప్రక్రియ ద్వారా రెండు విషయాలు తేలాయి.

మిథ్యా ప్రపంచం, సత్యం నేను.

రెండవ సూత్రం ప్రకారం మిథ్యావస్తువుకు విడిగా ఉనికి లేదు. దానికి విడిగా ఉనికి లేదు కాబట్టి అది ఉన్నా లేనట్టే. మట్టి లేకుండా కుండ ఉండలేదు కాబట్టి, మట్టి లేకపోతే కుండ కూడా లేనట్టే. అందువల్ల కుండ మిథ్య, మట్టి సత్యం – సత్యమే అధిష్ఠానం.

అలాగే జగత్తు మిథ్య, నేను సత్యం.

**మూడవ సూత్రం ప్రకారం, మిథ్యా జగత్తుకు, సత్యం నేను అధిష్ఠానం.**

అందుకని నాకొక కొత్తపేరు వచ్చింది. అది **నిష్ప్రపంచ ఆత్మతత్త్వం.**

**ఫలం –** అధ్యారోప అపవాదం ద్వారా జగత్ మిథ్య. నేను బ్రహ్మగా సత్యం అని తెలుస్తుంది. దీనివల్ల లాభమేమిటి అనుకోవచ్చు. జగత్ మిథ్య, నేను సత్యం అని తెలుసుకుంటే మిథ్యాజగత్తు నన్ను భయపెట్టలేదు. కుండ మట్టిని నాశనం చేయలేదు. ఆభరణాలు బంగారాన్ని నాశనం చేయలేవు.కుండ, ఆభరణాలు మట్టికి, బంగారానికి బానిసలుగా ఉండాలి. ఆభరణానికి ఉనికి బంగారంవల్లే ఉంది అని తెలుసుకోవాలి. ఈ జ్ఞానంవల్ల సంసారం మనను బాధించదు.

దీనితో అధ్యారోప – అపవాద విశ్లేషణ ముగిసింది.

# ద్వితీయ అధ్యాయం

మొదటి అధ్యాయంలో సృష్టికి ముందు ఆత్మే ఉందని చూశాము.

**ఆత్మా వా ఇదమేక ఏవాగ్ర ఆసీత్**

ఆ ఆత్మే బ్రహ్మ లేదా పరమాత్మ అని కూడా చూశాము. ఆ బ్రహ్మ జగత్కారణం. లోకాలను, లోకపాలకులను, ఆకలిదప్పులను, పురుషశరీరాన్ని అన్నాన్ని సృష్టించాడు. ఇవన్నీ సృష్టించాడు కాని **జీవుడిని సృష్టించలేదు. శరీరంలోకి తనే అనుప్రవేశం చేశాడు.** శరీరంలోకి అనుప్రవేశం చేయగానే, పరమాత్మ అజ్ఞాని జీవుడయ్యాడు.ఆయన కూడా సంసారం అనుభవిస్తాడు. **అయం ఆవసథా** పదాలు సూచిస్తాయి ఆ మాటను. మూడు శరీరాలలో తిరుగుతుంటాడు జీవుడు. అవి స్థూలశరీరం, సూక్ష్మశరీరం, కారణశరీరం. ఇంకో అర్థం పితృశరీరం, మాతృశరీరం, స్వశరీరం. మూడు శరీరాలు చెప్పటంలోని ఉద్దేశాలు మూడు శరీరాలున్నాయని చెప్పటం కాదు, జీవుడు ఈ మూడు శరీరాల వృత్తంలో పడి కొట్టుమిట్టాడుతుంటాడు.

**పశుపక్షి మృగాది యోనిషు అనేకధా జనిత్వా**

ఎలా ఈ సంసారంలో పడి కొట్టుమిట్టాడుతుంటాడో రెండవ అధ్యాయంలో వివరంగా వస్తుంది.మొదటి అధ్యాయంలో చెప్పి వదిలేసిన విషయాన్ని రెండవ అధ్యాయంలో వివరించటంవల్ల ఈ రెండింటి మధ్య సంబంధం తెలుస్తుంది. దీన్ని **సంగతి** అంటారు.

సంసార వర్ణన వైరాగ్యాన్ని పెంపొందించటానికి వస్తే, మోక్షవర్ణన జ్ఞానంమీద శ్రద్ధ పెంపొందించటానికి వస్తుంది.

**(అపక్రామత(స్తు) గర్భిణ్యః)**

## మంత్రం-1

**పురుషే హ వా అయమాదితో గర్భో భవతి ।**
**యదేతద్రేతస్తదేతత్సర్వేభ్యోఽఙ్గేభ్యస్తేజః సమ్భూతమాత్మన్యేవాఽఽత్మానం బిభర్తి।**
**తద్యదా స్త్రియాం సిఞ్చత్యథైనజ్జనయతి తదస్య ప్రథమం జన్మ ॥**

**(అపక్రామత(న్తు) గర్భిణ్యః) –** ఇది మంత్రం కాదు. సభలో గర్భిణీ స్త్రీలు ఉంటే బయటకు వెళ్ళమని వారికి ఇచ్చిన సూచన. దీన్నిబట్టి ఆత్మజ్ఞాన విచారణ స్త్రీలు కూడా చేసేవారని తెలుస్తున్నది.

**పురుషే హ వా అయామాదితో గర్భో భవతి –** పరమాత్మ చిదాభాసగా అనుప్రవేశం చేసి జీవాత్మ అయ్యాడని చూశాము. ఆ జీవాత్మయొక్క మొదటి ఆవసథ పురుష శరీరం. పురుష అంటే ఇక్కడ పురుషుడే. ఇంకో విధంగా చెప్పాలంటే పితృశరీరం.

గర్భో భవతి అంటే ఉపనిషత్తు ప్రకారం, పురుషుడు కూడా గర్భం దాలుస్తాడు. ఇది కనిపించే గర్భం కాదు. శిశువుయొక్క బీజాన్ని దాలుస్తాడు.

మరణించిన జీవి, ఐదు దశల్లో మళ్లీ భూమిమీద మనిషిగా పుడతాడు. ఈ దశలను పంచాగ్ని విద్య అంటారు. ఇది ఒక వైదికజీవి గురించిన పుట్టుక.

**తస్మాదగ్నిః సమిధోయస్య సూర్యః**
**సోమాత్పర్జన్య ఓషదయః పృథివ్యామ్**
**పుమాన్ రేతః సిఞ్చతి యోషితాయాం**
**బహ్వీః ప్రజాః పురుషాత్సంప్రసూతాః – ముండకమ్**

ఆ ఐదు దశలు – స్వర్గం, మేఘం, పృథివీ, పురుషుడు, నారి. ఒక్కొక్క దశలో, జీవికి ఒక్కొక్క పేరు ఉంటుంది.

| **వ.సంఖ్య** | **దశలు** | **జీవి పేరు** | **మంత్రంలో పదం** |
|---|---|---|---|
| 1 | స్వర్గం | సోమ | అగ్ని |
| 2. | మేఘం | వృష్టి | పర్జన్య |
| 3. | పృథివీ | అన్నం | ఓషధయ |
| 4. | పురుషుడు | రేతస్సు | పుమాన్ |
| 5. | నారి | ప్రజా | యోషితాయాం |

ఐతరేయోపనిషత్తు పై మూడు దశలనూ వదిలేసి, పురుషుడులో ఉన్న దశను మొదటి దశ అంటున్నది. పురుషునిలో బీజరూపంలో ఉంటుంది. బీజరూపం అని ఎందుకు అంటాము? ఎందుకంటే అది మనిషిజన్మ అనే

కార్యానికి, కారణం అవుతుంది కాబట్టి. ఆ బీజం ఏ రూపంలో ఉంటుంది?
**యదేతద్రేతః** – దాన్ని రేతస్సు అంటారు. ఈ రేతస్సు ఏమిటి?
**తదేతత్సర్వేభ్యోఽఙ్గేభ్యస్తేజః సమ్భూతమ్**– ఇది పురుష శరీరంలో ఉన్న అన్ని అంగాలనుంచి శక్తిని ప్రోగేసుకున్నది. అందుకనే పుత్రుడు అచ్చుగుద్దినట్టు తండ్రి రూపాన్ని పుణికిపుచ్చుకున్నాడని అంటుంటాము. తండ్రి ఏం చేసాడు?
**ఆత్మన్యేవాఽత్మానం బిభర్తి** – తండ్రి రేతస్సు రూపంలో తనను తాను రక్షించుకుంటాడు. ఇది ఒక అద్భుతమైన వర్ణన. పుత్రుడు వేరే ఎవరో కాదు అది తానే.

**పుత్రః ఆత్మా ఏవ అస్తి**

తల్లిదండ్రుల శరీరంనుంచి (తనువునుంచి) పుట్టారుకాబట్టి అమ్మాయిని తనుజ అని, అబ్బాయిని తనయుడు అనీ అంటారు.

**అంగాత్ అంగాత్ సంభవతి**
**హృదయాత్ అధిజాయతే**
**తస్మాత్ ఆత్మా వై పుత్రనామాసి**

నువ్వు నా అంగాలనుంచి పుట్టావు. నువ్వు నా నడవడికను అందుకున్నావు అందుకని పుత్రుడిగా ఉన్న నువ్వు వేరెవరో కాదు, అది నేనే అని నామకరణంలో చెప్తాడు. తనకూ, పుత్రునికీ మధ్య భేదం తెలియటానికి అతనికి వేరే నామధేయం ఇస్తాడు.

ఆ విధంగా తండ్రి ప్రథమ ఆవసథ అవుతాడు. తర్వాత ఏమవుతుంది?
**తద్యదా స్త్రియాం సిఞ్చత్యథైనజ్జనయతి** – ఎప్పుడైతే ఆ రేతస్సును స్త్రీ యోనిలో వదులుతాడో, అప్పుడు తండ్రి పుత్రునికి జన్మ ఇచ్చినట్టు అవుతుంది.
**తదస్య ప్రథమం జన్మ** – దీనిని ప్రథమ జన్మ అంటారు. ఆవసథకూ, జన్మకూ మధ్య భేదం ఉంది. ఆవసథ అంటే స్థానం. తండ్రి శరీరంలో రేతస్సు రూపంలో ఉన్నప్పుడు దాన్ని ప్రథమ ఆవసథ అంటారు. పితృశరీరంనుంచి, మాతృశరీరంలోకి మారేటప్పుడు దాన్ని ప్రథమజన్మ అంటారు. ఇంతవరకూ తల్లి పుత్రుణ్ణి భూమిమీదకు తీసుకురావటమే జన్మ అంటారు అని మనకు

తెలుసు. తల్లి గర్భంలోకి రావటం కూడా జన్మ అంటారు. రెండు దశల్లోనూ ఒక ఆవసథనుంచి ఇంకో ఆవసథకు మారుతుంది కాబట్టి దాన్ని జన్మ అన్నారు.

పురుషుడు రేతస్సును స్త్రీ శరీరంలో వదలటం మొదటి జన్మ అన్నారు. కాని అది చెప్పినంత తేలిగ్గా జరుగదు. వనస్పతులనుంచి అన్నం తిన్న పురుషుడు నాలుగవ దశ అని చూశాము. ఆ పురుషుడు కూడా గృహస్థ అయి, కుమారుణ్ణి కనే స్థితిలో ఉండి ఉండాలి. అతను చిన్నపిల్లవాడో, బ్రహ్మచారో, వృద్ధుడో, సన్యాసో అయితే పితృస్థానంలో ఉండలేడు.

రెండవ ఆవసథ అయిన స్త్రీ శరీరం జీవికి మొదటి జన్మ అవుతుంది.

## మంత్రం 2

**తత్స్త్రియా ఆత్మభూయం గచ్ఛతి యథా స్వమఙ్గం తథా।**
**తస్మాదేనాం న హినస్తి। సాஉస్యైతమాత్మానమత్రగతం భావయతి ॥**

ఇప్పుడు రెండవ ఆవసథ అయిన స్త్రీ గర్భం గురించిన వర్ణన. మనం కొత్తఇంటిని చక్కగా సర్దుకున్నట్టుగా, స్త్రీ గర్భం రాబోయే కొత్తజీవికి స్వాగతం పలకటానికి లోపల ఉన్న అశుద్ధాన్నంతా పారద్రోలుతుంది.

**తత్స్త్రియా ఆత్మభూయం గచ్ఛతి –** ఆ రేతస్సు స్త్రీ శరీరంలో ప్రవేశించాక, అది ఆమెలో ఒక భాగంగా అవుతుంది. ఇది ఒక అద్భుతం. మామూలుగా శరీరంలో ఏదైనా బాహ్యవస్తువు చొరబడితే, శరీరంలో ఉండే రోగనిరోధక శక్తి దాన్ని బయటకు పారద్రోలుతుంది. అందుకే ఏదైనా కొత్త వస్తువును ప్రవేశపెడితే, ఉదాహరణకు వేరే మూత్రపిండాన్ని మార్పిడి చేస్తే, శరీరం దాన్ని స్వీకరించటానికి ఇష్టపడదు. అందువల్ల మూత్రపిండాన్ని మార్పిడి చేసాక, రోగనిరోధక శక్తిని మందుల ద్వారా తగ్గిస్తారు. అతనిలో రోగనిరోధక శక్తి తగ్గటంవల్ల ఆ రోగిని కొన్ని నెలలు ఎవరినీ కలవకూడదు అంటారు.

కాని అద్భుతం ఏమిటంటే , స్త్రీలో ప్రవేశించే ఈ రేతస్సుకు మాత్రం ఎటువంటి వ్యతిరిక్తత ఉండదు.

**యథా స్వమఙ్గం తథా –** ఆమె అంగంలో ఒక భాగంగా చూస్తుంది.

**తస్మాదేనాం న హినస్తి–** అందువల్ల దానిని నిరోధించటానికి ప్రయత్నించదు. స్త్రీ ఆ గర్భాన్ని ఎలా చూస్తుంది?

**సాఽ స్యైతమాత్మానమత్రగతం భావయతి–** ఆ తల్లి ఇప్పుడు భర్త తనలో వదిలిన బీజాన్ని మోస్తున్నది. ఆ బీజం ఏమిటి? సాక్షాత్తూ తన భర్త ప్రతిరూపం. అందువల్ల ఆ శిశువును అపురూపంగా చూసుకుంటుంది. సరియైన పోషకాహారం తీసుకుంటూ, అనేక జాగ్రత్తలు పాటిస్తూ, అనేక నియమాలను పాటిస్తూ ఉంటుంది. తనకు ఆరోగ్యం బాగుండకపోయినా, చటుక్కున మాత్రలు వేసుకోదు. ఎందుకంటే, గర్భస్థ శిశువుకు అవి హానిచేస్తాయేమోననే భయం.

**మంత్రం–3**

**సా భావయిత్రీ భావయితవ్యా భవతి। తం స్త్రీ గర్భం బిభర్తి। సోఽగ్ర ఏవ కుమారం జన్మనోఽగ్రేఽధిభావయతి। స యత్కుమారం జన్మనోఽగ్రేఽధిభావయత్యాత్మానమేవ తద్భావయత్యేషాం లోకానాం సన్తత్యా। ఏవం సన్తతా హిమే లోకాస్తదస్య ద్వితీయం జన్మ ॥**

**సా భావయిత్రీ–** తన గర్భంలోకి సాక్షాత్తూ తన భర్తే బీజరూపంలో ప్రవేశించి, మళ్ళీ శిశువుగా పుడుతున్నాడనే ఆనందంతో స్త్రీ ఆ గర్భాన్ని అపురూపంగా చూసుకుంటుంది.

**భావయితవ్యా భవతి –** తన రూపాన్ని ధరిస్తున్న స్త్రీని భర్తకూడా అంత అపురూపంగానూ చూసుకుంటాడు. దీన్ని **ఉపకార్య ఉపకారక భావన** అంటారు. ఒక్కముక్కలో చెప్పాలంటే ఇచ్చిపుచ్చుకోవటం. భర్త అలా అపురూపంగా చూసుకోవాలని సీమంతం, ఉన్నయనంలాంటి వేడుకలు చేస్తారు. ఈ వేడుకల్లో భర్త స్త్రీకి తలదువ్వి జడ వేస్తాడు. తర్వాత ఏ అంగవైకల్యం లేకుండా పుత్రుడు పుట్టాలని కూడా వేడుకలు చేస్తారు.

**తం స్త్రీ గర్భం బిభర్తి–** ఈ విధంగా భర్త భార్యను అపురూపంగా చూసుకుంటాడు.

**సోఽగ్ర ఏవ కుమారం జన్మనోఽగ్రేఽధిభావయతి–** ఇందులో అగ్రే రెండుసార్లు వచ్చింది. తర్వాత అధి అనే పదం వచ్చింది. ఈ మూడు పదాలు, మూడు భిన్నసమయాలను సూచిస్తాయి.

1. మొదటి అగ్రే అంటే శిశువు పుట్టటానికి ఎన్నో నెలల ముందు అంటే స్త్రీ గర్భం దాల్చగానే అపురూపంగా చూసుకుంటాడు.

2. రెండవ అగ్రే జన్మనోగ్రే అని వచ్చింది. అంటే సరిగ్గా పుట్టే ముందు చేసే సేవ. స్త్రీ పురుటి నొప్పులు పడుతున్నప్పుడు భర్త ప్రత్యేకమైన ప్రార్థన చేస్తాడు. మంత్రప్రోక్షణలు అంటారు దానిని. ఆ ప్రార్థన వాయుదేవునికి చేస్తారు. ఆ వాయువు పేరు **ప్రసూతికా వాయుః** ఈ వాయుదేవత స్త్రీ ప్రసవించేటప్పుడు శిశువును క్రిందకు తోయటానికి తోడ్పడుతుంది.

అలాగే శిశువు పుట్టగానే తల్లినుంచి శిశువును వేరు చేసేటప్పుడు బొడ్డు కోస్తారు కదా అప్పుడు కూడా భర్త పక్కన ఉండాలి. అప్పుడు జాతకర్మ అనిచేస్తారు. దాన్ని శిశువు జన్మించగానే చేస్తారు. ఇప్పుడు తర్వాత ఎప్పుడో తీరిగ్గా చేస్తున్నారు. శిశువు తల్లి గర్భంనుంచి విడివడ్డాక, స్వతంత్ర జీవనం గడపటానికి అనువుగా అనేక ప్రార్థనలు చేస్తాడు తండ్రి.

శిశువుకు మొదటిసారిగా పాలు ఇచ్చేటప్పుడు సరస్వతీదేవికి ప్రార్థన చేస్తాడు తండ్రి. ఓ సరస్వతీ! నువ్వు నా భార్య శరీరంలో ప్రవేశించి, ఆమె ఇచ్చే పాలలో నెలకొని ఉండు. ఆ పాల ద్వారా నా శిశువు పెరిగి పెద్దయి. బుద్ధి వికసించి **అహం బ్రహ్మ అస్మి** అని జ్ఞానం పొందేలాగా చేయి అని ప్రార్థిస్తాడు.

**3. అధిభావయతి:–** పుట్టి పెరిగాక కూడా అపురూపంగా చూసుకుంటాడు. అంటే తల్లి గర్భం దాల్చగానే, పురుటినొప్పులు పడేటప్పుడు, బయటకు వచ్చి పెరుగుతుండగా జాగ్రత్తగా తల్లినీ, పిల్లవానినీ చూసుకుంటాడు. ఎందుకు?

**స యత్కుమారం జన్మనోఽగ్రేఽధిభావయత్యాత్మానమేవ తద్భావయతి –** ఈ మూడు దశల్లోనూ తన కుమారుణ్ణి తానుగానే భావిస్తాడు. తండ్రి ఎవరినో చూడటం లేదు. తననే చూసుకుంటున్నాడు. అందువల్ల కుమారుణ్ణి రక్షించుకుంటున్నాడు. అందువల్ల ఆత్మ అంటే ఇక్కడ కూడా తనను తాను అని అర్థం, సచ్చిదానంద ఆత్మను కాదు.

**ఏషాం లోకానాం సన్తత్యా। ఏవం సన్తతా హీమే లోకాః –**

పుత్రుణ్ణి అపురూపంగా చూసుకోవటానికి మూడు కారణాలు ఉన్నాయి.

1. ముందే చూసినట్టుగా పుత్రుణ్ణి చూసుకోవటం అంటే తనను తాను పరిరక్షించుకోవటమే.

2. తన సంతతిని పెంపొందించుకోవటం. పుత్రుల ద్వారా కులవృద్ధి, దానితోపాటు కులధర్మ వృత్తి కూడా పరంపరగా సాగుతుంది.

**కులక్షయే ప్రణశ్యంతి కులధర్మాః సనాతనాః**

**ధర్మే నష్టే కులం కృత్స్నమ్ అధర్మోఽభిభవత్యుత గీత 1-40**

కులాన్ని వృద్ధి పొందిస్తే ధర్మం వృద్ధి పొందుతుంది. కుల క్షయమైతే ధర్మక్షయమవుతుంది. అందుకే పెళ్ళి సంబంధాలు చూసేటప్పుడు, అటు ఏడు తరాలు, ఇటు ఏడు తరాలనూ చూడాలంటారు పెద్దలు.

3. తను తన తనయుణ్ణి అపురూపంగా చూస్తే, తన వృద్ధాప్యంలో తన తనయుడు తనను అపురూపంగా చూసుకుంటాడనే నమ్మకం, ఆశ. భార్యాభర్తల మధ్య ఉండే ఉపకార్య ఉపకారక భావనే తల్లిదండ్రులకూ, పిల్లలకు మధ్య కూడా ఉంటుంది.

**తదస్య ద్వితీయం జన్మ** – దీన్నే రెండవ జన్మ అంటారు. దేన్ని? తల్లి గర్భంనుంచి భూమ్మీదకు రావటాన్ని. ఇంకోవిధంగా చెప్పాలంటే మాతృశరీరంనుంచి స్వశరీరంలోకి రావటాన్ని రెండవ జన్మ అంటారు.

మొదటి ఆవసథనుంచి రెండవ ఆవసథకు,
అంటే పితృశరీరంనుంచి మాతృశరీరానికి రావటం – మొదటిజన్మ
రెండవ ఆవసథనుంచి మూడవ ఆవసథకు,
అంటే మాతృశరీరంనుంచి స్వశరీరానికి రావటం – రెండవ జన్మ
అందువల్ల ఆవసథ వేరు, జన్మవేరు.
మూడవ శరీరంనుంచి ఇంకో పితృశరీరంకు
అంటే ఈ జన్మనుంచి ఇంకో జన్మనెత్తటం – మూడవ జన్మ

ఈ ఉపనిషత్తు ప్రతిదీ తనదైన శైలిలో చెపుతున్నది. రెండుజన్మలూ శిశువు గురించి చెప్పి, మూడవ జన్మ వచ్చేసరికి, ఆ శిశువుయొక్క తండ్రి

గురించి చెబుతున్నది. దాన్నే మనం శిశువుకు వర్తించుకోవాలి. ఆ వివరాలు తర్వాత వచ్చే మంత్రంలో వస్తాయి. అది చూద్దాము.

**మంత్రం- 4**

**సోఽస్యాయమాత్మా పుణ్యేభ్యః కర్మభ్యః ప్రతిధీయతే। అథాస్యాయమితర ఆత్మా కృతకృత్యో వయోగతః ప్రైతి। స ఇతః ప్రయన్నేవ పునర్జాయతే తదస్య తృతీయం జన్మ ॥**

మూడవ అవసథలో ఉన్న జీవాత్మ ఎవరు? రెండవ జన్మనెత్తిన శిశువు. **సోఽస్యాయమాత్మా-** తండ్రి సంరక్షణలో పెరిగిన ఈ పుత్రుడు. ఉపనిషత్తు ఈ పుత్రుణ్ణి తండ్రి ఆత్మగా అభివర్ణిస్తోంది. ఆత్మ అంటే తండ్రి రూపంగా అని అర్థం.

**పుణ్యేభ్యః కర్మభ్యః ప్రతిధీయతే-** పుత్రుడు పుట్టి, 12 సంవత్సరాల లోపు, గురుకులానికి వెళ్ళి అక్కడ 12 సంవత్సరాలు ఉండి విద్యనభ్యసించి, వెనక్కి వచ్చాక గృహస్థాశ్రమం స్వీకరించాక తండ్రి అతనికి అతను చేయాల్సిన పుణ్యకర్మలను అప్పచెబుతాడు. అతనికి బాధ్యత అప్పజెప్పితేనే, అతను తన కులధర్మాన్ని, కుటుంబధర్మాన్ని, సాంఘికధర్మాన్ని, సాంప్రదాయపరమైన ధర్మాన్ని బాధ్యతగా పాటిస్తాడు. కులపరంపరను నిలబెడతాడు. అతనికి బాధ్యత అప్పజెప్పాక, తండ్రి ఏం చేస్తాడు?

**అథాస్యాయమితర ఆత్మా కృతకృత్యో (భవతి) –** పుత్రుణ్ణి ఆత్మగా అంటే తండ్రిగా వర్ణించింది కాబట్టి, ఉపనిషత్తు తండ్రి గురించి చెప్పేటప్పుడు ఇతర ఆత్మ అంటున్నది. అతను తన బాధ్యతలను పుత్రునికి అప్పచెప్పి తను వానప్రస్థాశ్రమానికి వెళ్ళిపోతాడు.

**వయోగతః ప్రైతి-** అక్కడ వృద్ధుడై, తన ప్రారబ్ధకర్మ ముగియగానే మరణిస్తాడు. మరణం అంటే శాశ్వతంగా మరణించడు. ఈ శరీరాన్ని వదిలి ఇంకో పితృశరీరాన్ని చేరుకుంటాడు. మధ్యలో ఉన్న దశలను పంచాగ్ని విద్య రూపంలో ఇంతకుముందు చూశాము. ఇక్కడ మరణించాక, తన పుత్రుడు

దహనసంస్కారం చేస్తే, అగ్నిదేవత అతనికి ఇంకో స్థూలశరీరం ఇస్తుంది. అది పేరుకే స్థూలశరీరం కాని, చాలా సూక్ష్మంగా ఉంటుంది. దానితో పితృలోకానికి లేక స్వర్గలోకానికి వెళ్ళి అన్నం ద్వారా ఇంకో పురుషశరీరంలోకి ప్రవేశిస్తాడు. దాన్ని రేతస్సు అంటారని చూశాము.

**స ఇతః ప్రయన్నేవ పునర్జాయతే–** తండ్రి ఇంకో జన్మనెత్తుతాడు. అంటే పునర్జన్మ నెత్తుతాడు.

**తదస్య తృతీయం జన్మ–** దీన్ని మూడవ జన్మ అంటారు.

ఈ శరీరం వదలి, ఇంకో శరీరంతో మళ్ళీ పునర్జన్మ ఎత్తటాన్ని మూడవ జన్మ అంటున్నది ఉపనిషత్తు. అది కూడా తండ్రిపరంగా చెపుతున్నది. దీన్ని పుత్రునికి మనం అన్వయించుకోవాలి. రెండు జన్మలనెత్తిన పుత్రుడు, తను తనకు తండ్రి అప్పచెప్పిన పుణ్యకర్మలను నిర్వర్తించి, తన పుత్రునికి ఆ కర్మలను అప్పజెప్పి, తాను కూడా వానప్రస్థాశ్రమానికి వెళ్ళి, వృద్ధుడై మరణించి, తదనంతరం ఇంకో జన్మను పొందుతాడు. అది మూడవ జన్మ. అది మానవ జన్మే అవాలని లేదు. పశుపక్ష్యాదులుగా కూడా పుట్టవచ్చు.

ఇక్కడితో సంసారచక్రం ముగిసింది. అలా మూడు జన్మలు చెప్పిందంటే, ఈ మూడు జన్మలతో ముగింపుకు వస్తుందని కాదు అర్థం. జీవి పునరపి జననం, పునరపి మరణం పొందుతూనే ఉంటాడు. ఎంతకాలం? అతను కర్మల్లో పడి కొట్టుమిట్టాడుతున్నంతకాలం. అజ్ఞానం వదిలి జ్ఞాన మార్గానికి వచ్చేవరకూ ఈ వృత్తంలో కొనసాగక తప్పదు. అలాంటి మార్గం ఉందా?

ఉందని అంటున్నది ఉపనిషత్తు. మొదటి అధ్యాయంలో పరమాత్మ కోరిక చూశాము. శరీరం నేను, ఇంద్రియాలు నేను అని వాటితో మొదట్లో మమేకం చెందినా, ఎప్పుడో అప్పుడు ఈ జీవునిలో ముముక్షుత్వం పుట్టదా, నేను ఎవరు అనే తపన ఎప్పుడో అప్పుడు రాకపోతుందా అని పరమాత్మ ఆశించాడు. ఆ ఆశ వృథా పోలేదు, జీవి తెలుసుకున్నాడు, ఆనందంతో కేరింతలు కొట్టాడు అని కూడా చూశాము.

అలాంటి తపన మనందరిలో రావాలి. మానవ జన్మ ఎత్తామంటేనే ఎంతో పుణ్యం చేసుకున్నామని అర్థం. మానవ జన్మనెత్తినందుకు కర్మచేసి చిత్తశుద్ధి, ఉపాసన చేసి చిత్త ఏకాగ్రత పొంది, వీటి ద్వారా జ్ఞానయోగ్యతాప్రాప్తి పొందాలి. అంటే సాధన చతుష్టయ సంపన్నుడవ్వాలి.

కాని విచారకరమైన విషయమేమిటంటే, మోక్షం పొందాలన్న కోరికే చాలా మందికి ఉండదు. కోరిక ఉన్నా అవకాశం కలిసిరాదు కొందరికి. అవకాశం ఎదురుగా ఉన్నా, దాన్ని అందుకునే కోరిక ఉండదు మరికొందరికి. అలా అవకాశం, కోరిక రెండూ సమృద్ధిగా ఉన్న వ్యక్తి గురువు ద్వారా వేదాంత శ్రవణ మనన నిదిధ్యాసనలు చేసి మోక్షాన్ని పొందుతాడు. మోక్షం పొందటమంటే జనన మరణ చక్రంనుంచి విడివడటం. ఒక్కోసారి అరుదైన సంఘటనలు జరుగుతాయి. ఐతరేయోపనిషత్తు అలాంటి ఒక అరుదైన వ్యక్తి గురించి చెబుతున్నది.

ఒక వ్యక్తి వేదాంతానికి వస్తాడు, గురువు దగ్గర బాగా శ్రవణం చేసి జ్ఞానం పొందుతాడు. జ్ఞానం వరకూ ఏమీ సందేహం లేదు. **అహం బ్రహ్మ అస్మి** బాగా అర్థమవుతుంది. స్థూల సూక్ష్మ కారణ శరీర వ్యతిరిక్తం ఆత్మ అంటే ఏమిటో తనే చెప్పగలడు. **తత్త్వమసి** అంటే ఏమిటో తెలుసు. కాని ఏదో ఆటంకం ఆ జ్ఞానాన్ని వంటబట్టించుకోకుండా ఆపుతుంది.

ఇద్దరు గురుశిష్యుల మధ్య ఈ సంభాషణను ఊహించుకోండి.

| | | |
|---|---|---|
| గురువు | – | బ్రహ్మ లక్షణం ఏమిటి? |
| శిష్యుడు | – | బ్రహ్మ సర్వవ్యాపకం, అసంగం, నిత్యం, శుద్ధం. |
| గురువు | – | నువ్వెవరు? |
| శిష్యుడు | – | **అహం బ్రహ్మ అస్మి** |
| గురువు | – | ఆ నేను ఎవరు? |

శిష్యుడు – ఆ నేను శరీరం కాదు, మనస్సు కాదు, ఆలోచనలు ఉన్న, ఆలోచనలు లేని మనస్సును సాక్షీభూతంగా చూసే సాక్షిచైతన్యాన్ని.

గురువు – జ్ఞాని అంటే ఎవరు?

శిష్యుడు – తను శరీరం కాదు, మనస్సు కాదు,సాక్షి చైతన్యాన్ని అని తెలుసుకున్నవాడు. అతనికి ఇక్కడే ఇప్పుడే మోక్షం వస్తుంది.

గురువు – సాక్షిచైతన్యం అంటే ఏమిటి?

శిష్యుడు – నేను = సాక్షిచైతన్యం = బ్రహ్మ. తత్త్వమసి

గురువు – నీకు మోక్షం వస్తుందా?

శిష్యుడు – ఏమో స్వామీ ఖచ్చితంగా చెప్పలేను. మీకు వస్తుంది కాని, నేను ఇంకా కొన్ని ఉపనిషత్తులు వినాలి. బ్రహ్మసూత్రాలు వినాలి. అప్పుడు రావచ్చు. పైగా నాలో రాగద్వేషాలు పోలేదు. వాసనలు పోలేదు. నేనెలా శుద్ధచైతన్యం అవుతాను?

దీని అర్థం ఏమిటి? ఈ శిష్యుడు ఆత్మజ్ఞానాన్ని పూర్తిగా లౌకిక జ్ఞానం నేర్చుకున్నట్టు నేర్చుకున్నాడు. ఆ జ్ఞాననిష్ఠలో లేడు.

నేను = సాక్షి చైతన్యం = బ్రహ్మ అంటున్నాడు. అది జ్ఞానం అంటున్నాడు. అది తెలుసుకున్నవాడు ఇప్పుడే ఇక్కడే మోక్షం పొందుతాడు అంటున్నాడు. మళ్ళీ తన విషయం వచ్చేసరికి ఏమో తెలియదు అంటున్నాడు. ఒక అల అన్ని అలల్లోనూ నీరే ఉంది అని తెలుసుకుంటే చాలదు. ఎందుకంటే నీ సంగతి ఏమిటి అంటే ఏమో తెలియదు. అన్నింటిలోనూ నీరు ఉందిట అంటుంది. అందుకని అల అన్నింటిలోనూ నీరు ఉంది. తనలోనూ నీరే ఉంది, నిజానికి నీటిగా తనే సముద్రానికి అధిష్ఠాన దేవతనని తెలుసుకోవాలి.

వేదాంతం అధ్యయనం చేస్తున్నవారు ఆత్మ నిష్ఠలో ఉన్నారా లేదా అని పరీక్షించటానికి చిన్న ప్రయోగం చేయవచ్చు. వేదాంతం క్లాసులో జీవన్ముక్తులు

అనే కాగితాన్ని కొన్ని కుర్చీలకు అంటించి చూడాలి. అది చూసి అందులో వెళ్ళి కూర్చున్నవారు నిజంగా జీవన్ముక్తులు అయినట్టు. అలా కాకుండా ఆ కాగితాన్ని చూసి భయపడి వేరే కుర్చీలో కూర్చున్నవారు జ్ఞానాన్ని నిష్ఠగా మలుచుకోనివారు. ఇలాంటి వారికి జ్ఞానంలో ఏ మాత్రం సందేహం ఉండదు. కనీసం ఏమైనా సందేహాలుంటే వాటిని తీర్చవచ్చు. సిద్ధాంతపరంగా అంతా బాగా వంటపట్టించుకుంటారు. కాని ఏదో ప్రతిబంధకం. దీన్ని **అదృశ్యప్రతిబంధకం** అంటారు. ఇటువంటి వారు జ్ఞానంతో మరణిస్తారు. అది ఎటువంటి జ్ఞానం? **సప్రతిబంధక జ్ఞానం.** సప్రతిబంధకం అంటే ఆటంకాలు. ఈ ఆటంకాలు ఉన్నంతవరకూ అతన్ని జ్ఞానం దీవించలేదు.

ఉదాహరణకు ఒక బల్బు దేదీప్యమానంగా వెలుగుతున్నది. అటువంటి బల్బుమీద ఒక నల్లగుడ్డ కప్పారనుకోండి. ఏమవుతుంది? బల్బు వెలిగి కూడా ఏమీ లాభం లేదు. బల్బు వెలుగుతున్నది. కనెక్షన్ ఉంది. స్విచ్ వేసే ఉంది. కరెంట్ ఉంది కాని ఏం ప్రయోజనం? ఆ నల్లగుడ్డ కాంతిని కప్పేసి, అది ఉన్న గదిని చీకటిగది చేస్తున్నది.

అదే విధంగా జ్ఞానం ఉంది కాని నల్లగుడ్డలాంటి ఆటంకం అడ్డుపడుతోంది. అలాంటి పరిస్థితిలో అతను ఇంకో జన్మ ఎత్తక తప్పదు. వేరేమార్గం లేదు. ఎందుకు? అక్కడ బల్బు వెలుగుతున్నా ఎలా చీకటిగా ఉందో, అలాగే జ్ఞానం ఉన్నా, జీర్ణించుకోని జ్ఞానం లేనట్టే. అందుకే, నేను పది ఉపనిషత్తులను చదివాను అంటే, అందులో ఎన్ని ఉపనిషత్తులను జీర్ణించుకున్నావు అని అడుగుతారు.

అటువంటి వారు మళ్ళీ పుట్టక తప్పదు. మరుజన్మలో గురువు ప్రమేయం లేకుండానే, ఆటంకం తొలగిన మరుక్షణమే జ్ఞాననిష్ఠ పొందుతారు. వీరు సుదీర్ఘమైన శ్రవణ, మనన, నిదిధ్యాసనలు చేయనవసరం లేదు. గురుశాస్త్ర ఉపదేశం అవసరం లేదు. ఎక్కడో ఏదో యాదృచ్ఛికంగా వింటేనో, చదివితేనో, తెలుసుకుంటేనో చాలు. హఠాత్తుగా వారికి విషయం చక్కగా అవగతమౌతుంది. వెంటనే జీవన్ముక్తులు అవుతారు.

ఇక్కడ అటువంటి ఒక అరుదైన వ్యక్తిగురించి చెబుతున్నది ఉపనిషత్తు. అతను ఋషి వామదేవుడు. ఆ ఋషి తల్లి గర్భంలో ఉండగానే జ్ఞానాన్ని పొంది, నేను అనేక జన్మల శరీరశృంఖనాలను ఛేదించుకుని బయటపడ్డానని ప్రకటిస్తున్నాడు. ఇప్పుడు మంత్రం చూద్దాము.

**మంత్రం-5**

**తదుక్తమృషిణా। గర్భే ను సన్నన్వేషామవేదమహం దేవానాం జనిమాని విశ్వా । శతం మా పుర ఆయసీరరక్షన్నధః శ్యేనో జవసా నిరదీయమితి। గర్భ ఏవైతచ్ఛయానో వామదేవ ఏవమువాచ ॥**

**తదుక్తమృషిణా-** వామదేవ ఋషి చెప్పాడు.ఎప్పుడు? తను జననమరణాల వృత్తిని ఛేధించుకున్నాక చెప్పాడు. ఎక్కడ చెప్పాడు?

**గర్భే ను సన్నన్వేషామవేదమహం దేవానాం జనిమాని విశ్వా -** వామదేవుడు తల్లి గర్భంలో ఉండగానే తన జ్ఞానాన్ని ప్రకటించాడు. ఏమిటాజ్ఞానం? అనేక జన్మలు పొందుతున్నది, ఒక స్థూలశరీరంనుంచి మరో స్థూలశరీరానికి ప్రయాణం చేస్తున్నది, సూక్ష్మశరీరమే. దేవానాం అంటే దేవతలు కారు. ఇంద్రియాలు. ఇంద్రియాలను **విశ్వేదేవా** అంటారు.

**మధ్యే వామనమాసీనం విశ్వేదేవా ఉపాసతే కఠ 2-2-3**

దేహంలో ఉన్న ఆత్మకు ఇంద్రియాలు నైవేద్యం పెడుతున్నాయి. ఇంద్రియాలు సూక్ష్మశరీరాన్ని సూచిస్తాయి. ఎందుకంటే ఇంద్రియాలు సూక్ష్మశరీరానికి చెందినవి. ఈ సూక్ష్మశరీరానికే అనేక జన్మలు ఉన్నాయి.

**సూక్ష్మ, స్థూలశరీరాల సంయోగం - జన్మ**

**సూక్ష్మ, స్థూలశరీరాల వియోగం - మరణం**

సూక్ష్మశరీరం ఒక స్థూలశరీరంలో ప్రవేశిస్తే అది జన్మ. అదే సూక్ష్మశరీరం ఆ స్థూలశరీరంనుంచి బయటపడితే అది మరణం. జనన మరణాలు రెండూ శరీరానికి చెందినవే. నేనెవరు? నేను స్థూల, సూక్ష్మశరీర వ్యతిరిక్త ఆత్మను.

**న జాయతే మ్రియతే వా కదాచిత్**

**నాయం భూత్వా భవితా వా న భూయః**

**అజో నిత్యః శాశ్వతోఽయం పురాణో**

**న హన్యతే హన్యమానే శరీరే - గీత 2-20**

ఈ ఆత్మకు చావు, పుట్టుకలు లేవు. శరీరం చంపబడినా, ఇది చావదు. ఇది నిత్యం.

**శతం మా పుర ఆయసీః-** ఈ జ్ఞానం నేను పొందేవరకు వందలాది శరీరాలు వచ్చాయి, వెళ్ళాయి. నన్ను ఒక పరిమిత జీవిని చేశాయి. అవి ఒక ఇనుప పంజరంలా నన్ను బంధించాయి. పక్షిని బంధించినట్టుగా, నన్ను జీవాత్మ అనేపక్షిని, పూర్వజన్మల్లో నన్ను బంధించి వేశాయి. అందుకే ఈ శరీరం ఎప్పుడూ పంజరంలా ఉండేది.

**అరక్షన్నధః శ్యేనో జవసా నిరదీయమితి -** ఇలా జ్ఞానం పొందేవరకు రక్షణ లేని బందీగా ఉన్నాను. ఎలాగైతే ఒక డేగ ఇనుప పంజరాన్ని బలవంతంగా ఛేధించుకుని బయటపడుతుందో, అలా నేను బలవంతంగా బయటపడ్డాను. నా బలం ఏమిటి? జ్ఞానబలం. పంజరం ఏమిటి? దేహ అభిమానం. నేను దేహం కాదు. నేను మనస్సు కాదు అని తెలుకున్నాను. నేను ఆ పరబ్రహ్మను. ఇదంతా ఎక్కడ తెలుసుకున్నాడు?

**గర్భ ఏవైతచ్ఛయానో వామదేవ ఏవమువాచ -** గర్భంలో పడుకుని ఉండగానే తెలుసుకున్నాను అని వామదేవుడు చెబుతున్నాడు.

**అహం వృక్షస్య రేరివా। కీర్తిః పృష్ఠం గిరేరివ।**

**ఊర్ధ్వ పవిత్రో వాజినీవ స్వమృతమస్మి।**

**ద్రవిణగ్ం సవర్చసమ్ । సుమేధా అమృతోక్షితః,**

**ఇతి త్రిశంకోర్వేదానువచనమ్ - తైత్తిరీయోపనిషత్**

ఆత్మ స్వరూపమనే ధనంతో సర్వజ్ఞుడనై అమృతంతో అభిషిక్తుడనై ఉన్నానని త్రిశంకుడనే ఋషి బ్రహ్మాత్మైకత్వ జ్ఞానం వచ్చిన తర్వాత తన

కృతకృత్యతను చాటిచెప్పాడు. త్రిశంకుడంటే రామాయణంలో వచ్చే త్రిశంకుడు కాదు. ఈ ఉపనిషత్తులోని త్రిశంకుడు ఒక ఋషి.

## మంత్రం - 6

**స ఏవం విద్వానస్మాచ్ఛరీరభేదాదూర్ధ్వ ఉత్క్రమ్యాముష్మిన్స్వర్గే లోకే సర్వాన్కామానాప్త్వాఽమృతః సమభవత్సమభవత్ ॥**

(యధా స్థానం గర్భిణ్యః)

ఈ మంత్రంలో జ్ఞానఫలం వస్తుంది. అది ఒక్కముక్కలో చెప్పాలంటే, జ్ఞానం పొందగానే ఇక్కడే, ఇప్పుడే జీవన్ముక్తి, మరణించాక విదేహముక్తి కలుగుతాయి.

**స ఏవం విద్వాన్ -** ఇంతవరకూ ఈ ఉపనిషత్తులో సః అంటే పరమాత్మ గురించి వచ్చింది. ఇప్పుడు సః అంటే వామదేవుడు. ఇంకా చెప్పాలంటే జ్ఞానం పొందిన వామదేవుడు. ఆయన పొందిన ఫలం ఆయనకే కాదు. ఏ విద్వాన్‌కైనా కలుగుతుంది. విద్వాన్ అంటే విద్వాంసుడు. ఈ పదాన్ని లౌకిక జ్ఞానానికి కూడా వాడతాము. ఆయన గొప్ప సంగీత విద్వాంసుడు అంటాము. వ్యంగ్యంగా కూడా వాడతాము. అతను గొప్పవిద్వాంసుడు లెండి అనటంలో నిజంగా కాదు అనే అర్థం అందులో ఉంది. అందువల్ల చెబుతున్నది.

**ఏవం - పూర్వ మంత్రోక్త ప్రకారేణ విద్వాన్**

పూర్వ మంత్రంలో దేహవ్యతిరిక్త ఆత్మ గురించి తెలుసుకున్నాడు వామదేవుడు.

**సర్వాన్కామానాప్త్వా-** (ముందుగా ఈ వాక్యాన్నిచూద్దాము) అతని కోరికలన్నీ తీరుతాయి. కామం అంటే కోరికలే కాదు, వస్తువులు కూడా.

**తదేషాఽభ్యుక్తా। సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ।**
**యో వేద నిహితం గుహాయాం పరమే వ్యోమన్**
**సోఽశ్నుతే సర్వాన్ కామాన్సహ ॥ - బ్రహ్మానందవల్లీ**

ఎవరు బ్రహ్మగురించి తెలుసుకుంటారో, అతని కోరికలన్నీ ఒక్కసారిగా తీరుతాయి. రెండు విధాలుగా దీన్ని వివరించవచ్చు.

1. తృప్తి కలుగుతుంది. కోరికలు తీరుతాయి అంటే నిజంగా ఆ వస్తువులన్నీ పొందుతాడని కాదు అర్థం. ఒక వస్తువు పొందితే, ఏ ఆనందం కలుగుతుందో, జ్ఞానికి ఆ వస్తువును పొందకుండానే అంత ఆనందం కలుగుతుంది. ఎందుకంటే ఆనందం వస్తువులో లేదు, తనలోనే ఉందని తెలుసుకుంటాడు.

2. సంపూర్ణత్వం పొందుతాడు– ఎప్పుడైతే అద్వైత జ్ఞానం పొందుతాడో, తానే అన్నింటికీ అధిష్ఠానం అని తెలుసుకుంటాడో అప్పుడు అతను సంపూర్ణత్వం పొందుతాడు. కోరికలన్నీ సమసిపోతాయి.

**క్షేత్రజ్ఞం చాపి మాం విద్ధి సర్వక్షేత్రేషు భారత – గీత 13–2**

ఓ అర్జునా! అన్ని క్షేత్రాలలోనున్న క్షేత్రజ్ఞుడను అంటే జీవాత్మను నేనే అని తెలుసుకో. అలా తెలుసుకున్న వ్యక్తి తానే సృష్టిస్థితి లయకారణం అని తెలుసుకుంటాడు.

**మయ్యేవ సకలం జాతమ్।**
**మయి సర్వం ప్రతిష్ఠితమ్॥ – కైవల్యమ్**

ఈ తృప్తి, ఈ సంపూర్ణత్వం పొందటంవల్ల అతని కోరికలు తీరుతాయి అంటున్నది ఉపనిషత్తు. ఈ ఫలం ఎప్పుడు పొందుతాడు? మరణించాకా? కాదు. ఇక్కడే, ఇప్పుడే ఆనందాన్ని పొందుతాడు. దాన్నే జీవన్ముక్తి అంటారు. ప్రారబ్ధకర్మ ఉన్నంతవరకు అలా ఆనందంగా జీవిస్తాడు.

**అస్మాచ్ఛరీర భేదాత్ –** ఈ శరీరం పడిపోగానే

**ఊర్ధ్వ ఉత్క్రమ్యాముష్మిన్స్వర్గే లోకే అమృతః సమభవత్ –**

అక్షరాలా తీసుకుంటే, మరణించాక స్వర్గలోకానికి వెళ్ళి అమృతత్వాన్ని పొందుతాడు. కాని జ్ఞానికి ప్రయాణం లేదు, స్వర్గలోకంలో అమరత్వం లేదు.

**క్షీణే పుణ్యే మర్త్యలోకం విశంతి – గీత**

పుణ్యం నశించగానే మళ్ళీ భూలోకానికి తిరిగి వస్తాడు.

అందువల్ల ఈ వాక్యానికి గౌణ అర్థం తీసుకోవాలి. స్వర్గలోకం అంటే నిర్గుణ బ్రహ్మ. నిర్గుణ బ్రహ్మతో ఐక్యం అవుతాడు. దానికి ప్రయాణం కూడా లేదు. కుండ పగిలిపోతే ఘటాకాశం మఠాకాశం ఒక్కటయినట్టుగా, జ్ఞాని మరణిస్తే, అతని సూక్ష్మ, కారణ శరీరాలు సూక్ష్మప్రపంచంలో లయమవుతాయి. మరి స్వర్గలోకం ఎందుకంది? స్వర్గం ఆనంద హేతువు. బ్రహ్మ ఆనంద స్వరూపుడు. అందుకని స్వర్గంతో పోల్చింది.

**అమృతః సమభవత్సమభవత్ –** అమృతం పొందుతాడు అన్న పదంవల్ల కూడా స్వర్గలోకం కాదని తెలుస్తోంది. అక్కడ ఉన్న అమరత్వం సాపేక్షిక అమరత్వం, ఆత్యంతిక అమరత్వం కాదు. ఊర్ధ్వలోకాలకు వెళతాడు అంటే ఊర్ధ్వస్థాయికి వెళతాడు. బ్రహ్మజ్ఞానం పొందటంవల్ల బ్రహ్మ ఐక్యం పొందుతాడు. అమృతం సమభవత్ రెండుసార్లు చెప్పటం ఎందుకంటే, ఫలాన్ని నొక్కిచెప్పటానికి, ఇక్కడితో ఈ అధ్యాయం ముగిసిందని చెప్పటానికి.

**(యథాస్థానం గర్భిణ్యః)–** ఈ అధ్యాయం మొదట్లో గర్భిణీ స్త్రీలను బయటకు వెళ్ళమంది.

చెప్పాల్సిన విషయం చెప్పేశాక, మర్చిపోకుండా గర్భిణీ స్త్రీలను మళ్ళీ వెనక్కు పిలిచింది ఉపనిషత్తు. కాని నిజజీవితంలో మనం ఇలాంటి చిన్న విషయాలను మర్చిపోతుంటాము. ఎవరైనా చుట్టాలు వచ్చినప్పుడో, ఏదైనా చర్చించుకుంటున్నప్పుడో, పిల్లల్ని వేరే గదిలోకి వెళ్ళి కూర్చోమని పంపిస్తాము. కాని ఆ పని అయిపోయాక ఇంక బయటకి రండని పిలవటం మర్చిపోతాము. దానితో పిల్లలు మన ఆజ్ఞలను పెద్దగా పట్టించుకోరు.

గర్భిణీ స్త్రీలను ఎందుకు బయటకు వెళ్ళమంది? మూడు జన్మల గురించి చెప్పేటప్పుడు, మూడవ జన్మ పునర్జన్మ అని చెప్పింది. అది వివరించటానికి తండ్రి మరణం గురించి చెప్పింది. పుట్టి పెరిగిన పుత్రుడు కూడా అదే విధంగా మరణించి, మళ్ళీ పుడతాడని అర్థం చేసుకోవాలని చూశాము. భర్త మరణిస్తాడు, పుత్రుడు మరణిస్తాడు అంటే ఏ తల్లీ భరించలేదు. అందులో ఆశతో గర్భంలో శిశువును రక్షించే తల్లి అసలు భరించలేదు. అందువల్ల వారిని ఈ అధ్యాయం వినవద్దన్నారు.

**జన్మ గురించిన వర్ణన వైరాగ్యం పెంచటానికి. జ్ఞానం గురించిన వర్ణన మోక్షంమీద ఇష్టం కలుగచేయటానికి.** ఈ అధ్యాయం సారాంశం ఈ మూడు ఆవసథలు, వాటినుంచి కలిగే మూడు జన్మలమీద వైరాగ్యం పెంచుకుని, వామదేవునిలా ఉన్నతస్థాయికి ఎదిగి జీవన్ముక్తి, విదేహ ముక్తి పొందమని.

# తృతీయ అధ్యాయం

మొదటి రెండు అధ్యాయాలను ఉపనిషత్తు ఆత్మజ్ఞానంతో ముగించింది.

**స జాతో భూతాన్యభివ్యైఖ్యత్ కిమిహాన్యం వావదిషదితి । స ఏతమేవ పురుషం బ్రహ్మ తతమమపశ్యత్ । ఇదమదర్శమితీ 3     అధ్యాయం -1**

ఒక జిజ్ఞాసువు సృష్టి గురించీ, తన గురించీ విచారణ చేసి, అహం బ్రహ్మ అస్మి అని తెలుసుకున్నాడు.

**అరక్షన్నధః శ్యేనో జవసా నిరదీయమితి   -     అధ్యాయం - 2**

ఋషి వామదేవుడు జనన మరణ వృత్తాలు శరీరాలకే, ఆత్మ అయిన తనకు లేవని తెలుసుకుని శరీరపు ఇనుపగోడలను చేధించుకుని బయటపడ్డానని చెప్పాడు. అంటే ఆయన కూడా అహం బ్రహ్మ అస్మి అని తెలుసుకున్నాడు.

కాని రెండింటిలోనూ ఎలా తెలుసుకున్నాడో చెప్పలేదు. ఎలా ఆత్మ విచారణ చేయాలో మూడవ అధ్యాయంలోనే వస్తుంది. అందువల్ల ఇది చాలా ముఖ్యమైన అధ్యాయం.

కాకపోతే ఈ అధ్యాయంలో కొన్ని విషయాలను ఉపనిషత్తు స్వయంగా చెప్పలేదు. మనం అనుగుణంగా చేర్చుకోవాలి;

**మంత్రం - 1**

**కోఽ_యమాత్మేతి వయముపాస్మహే। కతరః స ఆత్మా, యేన వా పశ్యతి యేన వా శృణోతి, యేన వా గన్ధానాజిఘ్రతి, యేన వా వాచం వ్యాకరోతి, యేన వా స్వాదు చాస్వాదు చ విజానాతి ॥**

ఆధ్యాత్మికతమీద జిజ్ఞాస ఉన్న కొందరు ముముక్షువులు ఒక గురువు దగ్గర చేరి ఆత్మ విచారణ మొదలుపెడతారు. ఈ భాగాన్ని మనం కలుపుకోవాలి. ఈ క్రింది ప్రశ్నను అడిగారు. ఏమిటది?

**కోఽయమాత్మేతి వయముపాస్మహే–** ఆత్మ అంటే ఇక్కడ సచ్చిదానంద ఆత్మ కాదు. ఆత్మ అంటే "నేను". మనం ఏ విషయం మాట్లాడాలన్నా కూడా నేను, నేను అంటూ మొదలుపెడతాము.

ఉపాస్మహే అంటే ఉపాసన చేయటం కాదు. పదే పదే చెప్పటం. నేను, నేను అని పదే పదే వల్లె వేసే నేను ఎవరు?

**కోఽయమ్ – కః అయమ్?**

ఇది మొదటి ప్రశ్న. నేను ఎవరు?

**ఆత్మనస్తు కామాయ సర్వం ప్రియం భవతి**

ఎంతసేపూ నా గురించే ఆలోచిస్తాను. మనలో పంచకోశాలు ఉన్నాయి. మనకు కలిగే అనుభవాలు ఏదో ఒక కోశానికి చెందుతాయి.

| | | |
|---|---|---|
| శరీరరుగ్మతలు | – | అన్నమయకోశం |
| ఆకలి దప్పులు | – | ప్రాణమయ కోశం |
| రాగద్వేషాలు | – | మనోమయ కోశం |
| నిశ్చయం | – | విజ్ఞానమయ కోశం |
| నిద్ర | – | ఆనందమయ కోశం |

ఇలా ఏదో ఒక అనుభవం అవుతూనే ఉంటుంది. నా గురించి కాకుండా ఎదుటివారి గురించి ఆలోచించినా కూడా వారు నాకు సంబంధించిన వారే అయి ఉంటారు. అంటే అహంకారం, మమకారం కట్టిపడేస్తున్నాయి నన్ను. ఆ "నేను" ఎవరు?

**కతరః స ఆత్మా –**ఈ రెండింటిలో ఏది ఆత్మ? సంస్కృతంలో ఏక వచనం, ద్వివచనం, బహువచనం అని మూడు ఉంటాయి. కతరః అంటే ద్వివచనం. కతమః అంటే బహువచనం. ప్రశ్న ఈ రెండింటిలో ఏది ఆత్మ?

ఇక్కడ కూడా కొన్ని విషయాలు వివరంగా చెప్పబడలేదు. వాటిని మనం కలుపుకోవాలి. రెండింటిలో ఒకటి మొదటి అధ్యాయంలో చెప్పబడింది. ఏమిటది?

పరమాత్మ బ్రహ్మరంధ్రం ద్వారా అనుప్రవేశం చేశాడు.

**స ఏతమేవ సీమానం విదార్యైతయా ద్వారా**
**ప్రాపద్యత సైషా విదృతిర్నామ ద్వాః అధ్యాయం 1**

రెండోది ఎవరు? ఇక్కడ ఉపనిషత్తు చెప్పలేదు కాని, వేదమే ఇంకోచోట ఇంకో అనుప్రవేశం గురించి చెప్పింది. ఏమిటది?

హిరణ్యగర్భ సూక్ష్మశరీరరూపంలో స్థూలశరీరంలోకి అరికాలి ద్వారా ప్రవేశించాడుట. హిరణ్యగర్భ అంటే సమష్టి సూక్ష్మశరీర ఉపహిత చైతన్యం. ఒక్కముక్కలో చెప్పాలంటే ప్రాణశక్తి. పూర్వకాలపు పెద్ద ఇళ్ళకి సింహద్వారం, వెనుకద్వారం ఉంటాయి. యజమాని సింహద్వారం గుండా ప్రవేశిస్తే, పనివారు వెనుకద్వారం ద్వారా ప్రవేశిస్తారు.

ఇప్పుడు మన శరీరంలోకి ఇద్దరు ప్రవేశించారు. సింహద్వారమైన బ్రహ్మరంధ్రం ద్వారా పరమాత్మ ప్రవేశించాడు. అరికాలినుంచి ప్రాణశక్తి అయిన హిరణ్యగర్భ ప్రవేశించాడు. మరణం సమయంలో, సూక్ష్మశరీరంతో పాటు ప్రయాణం చేస్తుంది జీవాత్మ. కర్మకాండ ప్రయాణం చేసే జీవాత్మ గురించి మాట్లాడితే, జ్ఞానకాండ సర్వవ్యాపకమైన పరమాత్మ గురించి మాట్లాడుతుంది. మనం శ్రాద్ధకర్మలు చేసేది ప్రయాణించే జీవాత్మకు.

ఈ విధంగా రెండు జీవాత్మలు ఉన్నాయి. చిద్రూప ఆత్మగా పరమాత్మ ఉన్నాడు. చిదాభాస రూప ఆత్మగా హిరణ్యగర్భ ఉన్నాడు.

ఏది అసలు ఆత్మ? బింబచైతన్యరూప ఆత్మా, ప్రతిబింబ చైతన్యరూప ఆత్మా? ఇది రెండవ ప్రశ్న.

దాని తర్వాత వారు విచారణను మొదలుపెట్టారు. మనం తరచు వాడే అంగాలను ఒకటొకటిగా తీసుకున్నారు.

ఇది ఆత్మా? **కతరః సః ఆత్మా?** ఇవేవీ కాదని తేలుస్తారు. ఒకటొకటిగా చూద్దాము.

**యేన వా (రూపం) పశ్యతి** – రూపాలను చూసే కన్ను ఆత్మా? అది ఆత్మా మనం కలుపుకోవాలి.

**యేన వా (శబ్దం) శృణోతి** – శబ్దాన్ని వినే చెవి ఆత్మా?

**యేన వా గన్ధానాజిఘ్రతి** – వాసన చూసే ముక్కు ఆత్మా?

**యేన వా వాచం వ్యాకరోతి** – మాట్లాడే వాక్కు ఆత్మా?

**యేన వా స్వాదు చా స్వాదు చ విజానాతి** – రుచులను తెలుసుకునే నోరు ఆత్మా?

మామూలుగా ఈ కన్ను, చెవుల గురించి చెప్పేటప్పుడు ఏమంటాము? నేను చూస్తున్నాను, నేను వింటున్నాను అంటాము. నా కన్ను చూస్తోంది, నా చెవి వింటోంది అనము. అంటే వాటితో మమేకం అవుతున్నాము.

సూక్ష్మశరీరంలో 19 అంగాలు ఉంటాయని మనకు తెలుసు. అవి పంచ జ్ఞానేంద్రియాలు. పంచకర్మేంద్రియాలు, పంచప్రాణాలు, నాలుగు అంతఃకరణాలు. ఇప్పుడు చూసినవన్నీ ఇంద్రియాలను సూచిస్తున్నాయి. అన్నీ ఇవ్వలేదు కాని ఉపలక్షణం కింద వాటిని కూడా కలుపుకోవాలి.

ఈ ఇంద్రియాలు ఆత్మా? కాదు. ఎందుకు? **తేషాం కరణత్వాత్. యది చక్షుషా దృష్టం యది శ్రోత్రేణ శ్రుతం ... కోఽహమితి** – నేను కన్ను, చెవులు, మనస్సు మొదలైనవి కాను. అవి పని చేస్తున్నట్టు నాకు తెలుస్తున్నాయంటే అవి నేను కాను. అవి నేను కాక పోతే నేనెవరను అని మనిషి ఎప్పుడో ఒకప్పుడు ప్రశ్నించు కోకపోతాడా అనుకుంటాడు పరమాత్మ. సరిగ్గా అలాగే చర్చ జరుగుతున్నది యిక్కడ.

ఇంద్రియాలు ప్రమాణం. ప్రమాణం ప్రమా అవలేదు. వాడబడే పరికరం వాడే నేను కాలేదు. అలా సూక్ష్మశరీరంలోని ఇంద్రియాలు నేను కాదని తెలిసింది.

**యదేతత్ హృదయం మనశ్చైతత్ । – మంత్రం 2** (ఇప్పుడు ఇంతవరకు మాత్రమే చూద్దాం)

**యదేతత్ హృదయమ్** – హృదయం అంటే ఇక్కడ బుద్ధి,

**ఏతత్ హృదయమ్ అపి ఆత్మా కిమ్**?

**బుద్ధి ఆత్మా**? కాదు అని మనం కలుపుకోవాలి.

**మనశ్చైతత్** – (ఆత్మాకిం?) మనస్సు ఆత్మా? **మన అపి న ఆత్మా**

మనస్సు, బుద్ధి రెండింటినీ కొట్టివేశాము. నాలుగు అంతఃకరణాలతో తక్కిన రెండూ అయిన  అహంకారం, చిత్తం కూడా కలుపుకోవాలి. అవికూడా ఆత్మకాదు. ఇంద్రియాలు, మనస్సు అయిపోతే ఇంక సూక్ష్మశరీరంలో మిగిలింది ఏమిటి? పంచప్రాణాలు. అవి కూడా ఆత్మకాదు. ఒక్కముక్కలో చెప్పాలంటే సూక్ష్మశరీరంలో ఉన్న ఏ అంగమూ కూడా ఆత్మ కాదు. ఎందుకు?

1. **కరణరూపత్వాత్** – ప్రమాణం కాబట్టి
2. **వికారరూపత్వాత్** – మార్పు చెందుతాయి కాబట్టి
3. **జడరూపత్వాత్** – చైతన్యం లేదు కాబట్టి
4. **సంఘాత రూపత్వాత్** – అంగాల అమరిక కాబట్టి

మనం పై రెండు కారణాలు తీసుకుంటాము. సూక్ష్మశరీరంలోని అంగాలు ప్రమాణాలు కాబట్టి, మార్పు చెందుతాయి కాబట్టి, అవేవీ ఆత్మకాదు. అంటే సూక్ష్మశరీరంగా, ప్రాణశక్తిగా, చిదాభాసగా శరీరంలో అరికాలినుంచి ప్రవేశించిన హిరణ్యగర్భ ఆత్మ కాదు. హిరణ్యగర్భ ఆత్మ కాకపోతే, ఆత్మ ఎవరు? పారిశేషిక న్యాయం వాడాలి. పారిశేషిక న్యాయం అంటే నాలుగు వస్తువుల్లో ఏది అసలు వస్తువో తెలుసుకునే ప్రయత్నంలో మూడు కొట్టివేస్తే మిగిలింది అసలు వస్తువు కిందకి వస్తుంది. ఇప్పుడు మిగిలింది శుద్ధచైతన్యం, పరమాత్మ.

**శుద్ధచైతన్యమేవ ఆత్మా ఇతి నిశ్చితవంతః।**

ఈ శుద్ధచైతన్యాన్ని ఎలా తెలుసుకోవాలి? నేను కానిది ఏమిటో ఎలా తెలుసుకుంటాను? నేను ఒక వస్తువుగా చూడగలిగింది ఏదీ నేను కాదు. వాటన్నింటినీ నేతి నేతి అని కొట్టివేశాము. నేతి అంటే న ఇతి. ఇంద్రియాలు నేను కాదు. శరీరం నేను కాదు. మనస్సు, బుద్ధి కూడా నేను కాదు. మనసు కూడా ఒక కరణమే. మనస్సును జాగ్రదావస్థలోనూ, స్వప్నావస్థలోనూ వాడతాను. సుషుప్తిలో వాడను. బుద్ధి పరిస్థితి కూడా అంతే. నాకు ఈ విషయం తెలుసు. ఈ విషయం తెలియదు, ఇది సరిగ్గా అర్థం కాలేదు, అని నాకు తెలుస్తున్నది. అందువల్ల అది కూడా కరణమే.

అలా అన్నీ నేతి, నేతి అని కొట్టివేస్తూ వస్తే మిగిలేది ఏమిటి? శూన్యంకాదు. శూన్యంగా ఉంది అని తెలుసుకుంటున్నది ఒకటి ఉంది. ఆలోచనలు ఉన్న, ఆలోచనలు లేని మనస్సును ఒకటి సాక్షీభూతంగా చూస్తున్నది. దాన్ని **సాక్షిచైతన్యం** అంటారు. ఇక్కడ **ప్రజ్ఞానం** అంటున్నది ఉపనిషత్తు. ఇది జడమా, చేతనతత్త్వమా? జడం కాదు, చేతనతత్త్వం.

ఇప్పుడు ఈ **సాక్షిచైతన్యం** లేదా **ప్రజ్ఞానాన్ని** తెలుసుకోవటమెలా?

**ప్రతిబోధ విదితం మతమ్ - కేన**

ప్రతి అనుభవంలోనూ తెలుస్తుంది. ఒక వృత్తితో (ఆలోచనతో) కలిస్తే చైతన్యం అనుభవం అవుతుంది.

చైతన్యం ఒక్కటే. వృత్తులు అనేకం. అందువల్ల అనుభవాలు కూడా అనేకం. దుఃఖవృత్తి ఉంటే దుఃఖాన్ని అనుభవిస్తాను, సుఖవృత్తి ఉంటే సుఖాన్ని అనుభవిస్తాను. అందువల్ల అనుభవాలు, మారుతున్న ఆలోచనల వెనుక ఉండి ఎప్పుడూ అందుబాటులో ఉండే, ఎన్నడూ మారని, రాకపోకలు లేని చైతన్యమే ప్రజ్ఞానం. అది నా అసలు స్వరూపం.

ప్రతి అనుభవం = చైతన్యం + భిన్ననామరూపాలు.

ప్రతి ఆలోచన కూడా చైతన్యం ధరించే దుస్తులు. అనేక దుస్తులు ధరించే మీరు ఒక్కరే కదా! అలాగే అనేక వృత్తులను ధరించే చైతన్యం కూడా ఒక్కటే.

ఈ చేతనతత్త్వమే, అనేక ఆలోచనలతో కలిస్తే భిన్న అనుభవాలు అవుతుంది. ఒక ఆలోచనతో కలిస్తే, చైతన్యమే అనుభవం అవుతుంది.

ఉదాహరణకు, ఇప్పుడు నేనొక చేతనతత్త్వాన్ని. నేను ఒకగోడవైపు తిరిగాననుకోండి. అప్పుడు ఇంద్రియాలు గోడను చూస్తాయి. నా మనస్సులో గోడ వృత్తి ఏర్పడుతుంది. ఆలోచన రాకముందు చైతన్యం ఉందా లేదా? చైతన్యం ముందే ఉంది. గోడ వృత్తి రాగానే, గోడ అనుభవం వస్తుంది.

చైతన్యం + గోడ ఆలోచన = గోడ అనుభవం

చైతన్యం + కుండ ఆలోచన = కుండ అనుభవం

చైతన్యం + వృక్ష ఆలోచన = వృక్ష అనుభవం.

అందువల్ల చైతన్యం+ వృత్తి = అనుభవం.

ఇప్పుడు వృత్తిని కుడివైపుకి తీసుకెళ్తే ఏమవుతుంది?

చైతన్యం = అనుభవం – వృత్తి.

**అనుభవంలోంచి వృత్తిని తీసేస్తే మిగిలేది చైతన్యం ఒక్కటే.**

మారే అనుభవాలు – మారే వృత్తులు = మారని చైతన్యం.

మారే అనుభవాలలోంచి మారే వృత్తులను తీసేస్తే మిగిలేది ఏమిటి? మారే చైతన్యం అనకూడదు. మారని చైతన్యం.

జ్ఞానపరంగా చెప్పాలంటే మారే జ్ఞానంలోంచి మారే వృత్తులను తీసేస్తే మిగిలేది ఏమిటి? మారే ఎరుక అనకూడదు. మారని ఎరుక.చైతన్యమే ఎరుక. చైతన్యమే ఆత్మ.

ఒక ఆలోచనలో ఉంటే, ఆ జ్ఞానమే వస్తుంది. ఇంకో జ్ఞానం రాదు. ఇంకో జ్ఞానం రావాలంటే వృత్తి మారాలి. అందువల్ల వృత్తులు మారుతాయి. జ్ఞానం మారుతుంది. కాని ఎరుక మారదు.

మారని ఎరుకను ప్రజ్ఞానం అంది ఉపనిషత్తు.

సవిశేష ఎరుకని జ్ఞానం అంటారు. సవిశేష అంటే ఒక వస్తువును గురించిన జ్ఞానం. నిర్విశేష ఎరుకను ప్రజ్ఞానం అంటారు. సవిశేష జ్ఞానం మారుతుంది. నిర్విశేష జ్ఞానం మారదు. నిర్విశేష జ్ఞానం సవిశేష జ్ఞానంలో ఇమిడి ఉంటుంది –

మారని నీరు మారే అలలలో ఉన్నట్టుగా

మారని బంగారం మారే ఆభరణాలలో ఉన్నట్టుగా

మారని జ్ఞానం మారే జ్ఞానంలో ఉంటుంది.

నిర్విశేష జ్ఞానాన్ని అనుభవించటం ఎలా? దాన్ని అనుభవించలేము. అది ప్రత్యక్ష అనుభవానికి అందదు. అనుభవం కలగాలంటేనే అనుభవించే కర్త వేరు, అనుభవించబడే వస్తువు వేరూ అవాలి. అందువల్ల సవిశేష జ్ఞానం ద్వారానే నిర్విశేష జ్ఞానాన్ని అనుభవించాలి.

ఉదాహరణకు కాంతిని తీసుకోండి. శుద్ధమైన కాంతిని ప్రత్యక్షంగా అనుభవించలేము. కాంతి చేతిమీద పడటం వల్ల అక్కడ కాంతి ఉందని తెలుస్తుంది. ఈ దశలవారీగా కాంతిని గ్రహించాలి.

1. ముందు చేతిని చూడాలి.
2. చేతిమీద కాంతి పడుతున్నదని తెలుసుకోవాలి.
3. చెయ్యి ఉన్నా లేకపోయినా, కాంతి అక్కడ ఉందని తెలుసుకోవాలి.
4. ఇప్పుడు చేతిని చూసినా, ఇక్కడేముంది అంటే కాంతి ఉందని చెప్పగలగాలి.

ప్రతి ఆలోచన ద్వారా ఆలోచనారహిత ఎరుకను గుర్తించాలి. ఆలోచనలు లేని ఎరుకను, ఆలోచనలద్వారా తెలుసుకోవచ్చు. ఏ ఆలోచన? ఏదైనా తీసుకోవచ్చు. పైన చెయ్యి ఉదాహరణ చూశాము. చెయ్యి బదులు పుస్తకం తీసుకోవచ్చు. మరేదైనా తీసుకోవచ్చు. అటువంటి ఆలోచనలను, ఒక పట్టిక కింద ఇస్తున్నది ఉపనిషత్తు రెండవ మంత్రంలో.

### మంత్రం-2

**యదేతత్ హృదయం మనశ్చైతత్। సంజ్ఞానమాజ్ఞానం విజ్ఞానం ప్రజ్ఞానం మేధా దృష్టిర్ధృతిర్మతిర్మనీషా జూతిః స్మృతిః సఙ్కల్పః క్రతురసుః కామో వశ ఇతి। సర్వాణ్యేవైతాని ప్రజ్ఞానస్య నామధేయాని భవన్తి ॥**

ఇవన్నీ అంతఃకరణ వృత్తులు. వీటిని ప్రజ్ఞానంయొక్క నామధేయాలు అనవచ్చు. ఎందుకు? అవి ప్రజ్ఞానాన్ని తెలియజేస్తాయికాబట్టి.

**సంజ్ఞానం** – నేను అనే కనీస ఎరుక. ఇది అన్ని జీవరాశుల్లో ఉంటుంది. **ఆజ్ఞానం** – యోగులకు ఉండే త్రికాలజ్ఞానం; **విజ్ఞానం** – లౌకిక జ్ఞానం; **ప్రజ్ఞానం** – ప్రతిభాజ్ఞానం లేదా సమయస్ఫూర్తి.; (ఇక్కడ ప్రజ్ఞానం ఇంతకుముందు చూసిన ప్రజ్ఞానం కాదు) **మేధ** – మేధస్సు; **దృష్టి** – అవగాహన; **ధృతి** – దీక్ష, **మతిః** – మననం; **మనీషా**– స్వతంత్రంగా ఆలోచించటం; **జూతిః** – దుఃఖం, **స్మృతి**– స్మరణం; **సఙ్కల్పః** – ప్రణాళిక; **క్రతుః** – నిశ్చయం;

(ఇక్కడ యజ్ఞం కాదు), **అసుః** – ప్రాణశక్తి; **కామః** –కోరిక; **వశః** – స్త్రీ పరమైన కోరిక.

ఇవన్నీ కొన్ని వృత్తులను సూచిస్తున్నాయి. గొడుగుమీద ఆలోచనను తీసుకోండి. దాని గురించిన ఆలోచనను వదిలేయండి. మిగిలేది శుద్ధ ఎరుక లేదా శుద్ధజ్ఞానం.

**సర్వాణ్యేవైతాని ప్రజ్ఞానస్య నామధేయాని భవన్తి** – వీటన్నింటినీ ప్రజ్ఞానంయొక్క నామధేయాలు అంటారు.

దీనితో **త్వం పదార్థ** విచారం ముగిసింది. త్వం పదార్థం శుద్ధజ్ఞానం. అది బ్రహ్మ. ప్రజ్ఞానం శరీరానికే పరిమితమవలేదు. అలలో నీరు చూస్తే నీరు అలకే పరిమితమవలేదు; నీరు మొత్తం సముద్రానికే అధిష్ఠానం.

**మంత్రం – 3**

**ఏష బ్రహ్మైష ఇన్ద్ర ఏష ప్రజాపతిరేతే సర్వే దేవా ఇమాని చ పఞ్చ మహాభూతాని పృథివీ వాయురాకాశ ఆపో జ్యోతీంషీత్యేతానీమాని చ క్షుద్రమిశ్రాణీవ బీజానీతరాణి చేతరాణి చాణ్డజాని చ జారుజాని చ స్వేదజాని చోద్భిజ్జాని చాశ్వా గావః పురుషా హస్తినో యత్కిఞ్చేదంప్రాణి జఙ్గమం చ పతత్రి చ యచ్చ స్థావరమ్ । సర్వం తత్ప్రజ్ఞానేత్రం। ప్రజ్ఞానే ప్రతిష్ఠితం ప్రజ్ఞానేత్రో లోకః ప్రజ్ఞా ప్రతిష్ఠా ప్రజ్ఞానం బ్రహ్మ ॥**

చివరి పదం ముందు చూద్దాము.

**ప్రజ్ఞానం బ్రహ్మ** – ప్రతి వృత్తి వెనుకనున్న ఈ చైతన్యం బ్రహ్మ. బ్రహ్మ ఎవరు? ఈ ఉపనిషత్తు మొదట్లోనే పరిచయం చేసిన ఆత్మ. **ఆత్మ = బ్రహ్మ** అని అప్పుడే చూశాము.

**ఆత్మా వా ఇదమేక ఏవాగ్ర ఆసీత్**

సృష్టికి ముందు బ్రహ్మ మాత్రమే ఉంది. ఆ బ్రహ్మే జగత్ కారణం.

**స ఈక్షత లోకాన్ను సృజా ఇతి** – లోకాలను సృష్టిస్తాను అని అనుకుంది.

కార్యంకు భిన్నంగా కారణం లేదు. కార్యం అంతటా కారణం ఉంది. అంటే బ్రహ్మే అంతటా ఉంది.

**బ్రహ్మైవ సర్వం సర్వకారణత్వాత్**

| | | |
|---|---|---|
| **ప్రజ్ఞానం** | **=** | **బ్రహ్మ** |
| **బ్రహ్మ** | **=** | **సర్వం** |
| **అందువల్ల ప్రజ్ఞానం** | **=** | **సర్వం** |

**తస్మాత్ ప్రజ్ఞానమేవ సర్వమ్॥**

ఈ జ్ఞానం సర్వం. నేను అనే ఈ ప్రజ్ఞానం జ్ఞానం రూపంలో అంతటా ఉన్నాను. ఆ పట్టిక ఇప్పుడు వస్తోంది.

**ఏష బ్రహ్మ –** ఇక్కడ బ్రహ్మ అంటే నిర్గుణ బ్రహ్మ కాదు. బ్రహ్మ అని దీర్ఘం తీయాలి.

బ్రహ్మ అంటే ఈ ఆత్మే చతుర్ముఖ బ్రహ్మ. **ఏష ఇన్ద్ర –** ఈ ఆత్మే ఇంద్రుడు; **ఏష ప్రజాపతి –** ఈ ఆత్మే విరాట్ అంటే సమష్టి స్థూలప్రపంచం; **ఏతే సర్వే దేవాః–** ఈ ఆత్మే దేవతలందరూ; **ఇమాని చ పఞ్చమహాభూతాని –** ఈ ఆత్మే పంచమహా భూతాలన్నీ; **పృథివీ వాయురాకాశ ఆపోజ్యోతీంషీత్యేతాని –** పృథివీ, వాయువు, ఆకాశం, నీరు, అగ్ని (అవి పుట్టిన వరుస క్రమంలో రాలేదు). **ఇమాని చ–** జీవరాసులన్నీ, **క్షుద్రమిశ్రాణీవ –** అత్యంత సూక్ష్మమైన ప్రాణి కూడా. **బీజాని–** అవన్నీ బీజాలు, దేనికి? వాటి రాబోయే సంతతికి బీజాలు. ఇక్కడ బీజం అంటే విత్తనం కాదు, కారణం. రాబోయే కార్యానికి కారణం.

**ఇతరాణి చేతరాణి చ –** అనేక జీవాలు. ఇతరాణి రెండుసార్లు చెప్పటం ఎందుకంటే అనేక భిన్నమైన జీవాలను సూచించటానికి.

**అణ్డజాని చ జారుజాని చ స్వేదజాని చోద్భిజ్జాని చ –** నాలుగు రకాలుగా పుట్టిన జీవరాసులు. అండాన్నించి పుట్టిన జంతువులు, గర్భంనుంచి వచ్చిన మనుష్యులు, స్వేదంనుంచి వచ్చిన క్రిమికీటకాదులు, భూమిని చీల్చుకుని వచ్చిన వృక్షాలు.

**అశ్వా గావః పురుషా హస్తినో యత్కిఞ్చేదం ప్రాణి –** మళ్ళీ జీవరాశులను ఇంకోవిధంగా వర్ణిస్తున్నది. గుర్రం,ఆవు, మనిషి, ఏనుగు– ఏ ప్రాణిని తీసుకున్నా కూడా!

**జఙ్గమం చ పతత్రి చ యచ్చ స్థావరమ్** – మళ్ళీ ఈ జీవరాశులను మూడు రకాలుగా విభజించింది. జంగమం అంటే కదిలే ప్రాణులు. మనుష్యులు, పశువులు; పతత్రి అంటే ఎగిరే పక్షులు;స్థావరం అంటే కదలని వృక్షాలు.

ఈ అధ్యాయంలో ఆత్మ విచారణ జరుగుతున్నది. ఆత్మ విచారణ ఎందుకు, నా గురించి నాకు తెలుసు కదా అనుకోకూడదు. మనకు తెలిసింది, సరియైన జ్ఞానం కాదు. మనకు తెలిసినదాన్ని సరియైన జ్ఞానంతో మార్చుకోవాలి. అందువల్ల ఆత్మజ్ఞానం అంటే కొత్తగా నేర్చుకునే జ్ఞానం కాదు, మనకు తెలిసిన పాత, తప్పుడు జ్ఞానాన్ని సరిదిద్దుకోవటం.

ఎవరైనా నువ్వెవరు అని మనను ప్రశ్నిస్తే, ఏమో నాకు తెలియదు అంటామా? అనము. ఎన్నో వివరాలు చెబుతాము. ఇప్పుడు దీన్నిబట్టి ఆలోచిస్తే, నా గురించి నాకు తెలిసినదేమిటి? నాకు **భేదబుద్ధి** ఉంది. నాలో సజాతీయ, విజాతీయ, స్వగతభేదభావనలు ఉన్నాయి.

**స్వగతభేదం–** నేను చైతన్యం ఉన్న ఒక జీవిని. నాలో చేతులు, కాళ్ళు, చెవులు, కళ్ళువంటి అనేక భాగాలు ఉన్నాయి.

**సజాతీయ భేదం:–** నేను చైతన్యం ఉన్న ఒక జీవిని. తక్కిన మనుష్యులకన్నా భిన్నంగా ఉన్నాను.

**విజాతీయ భేదం–** నేను చైతన్యం ఉన్న ఒక జీవిని. నేను జడపదార్థాలకన్నా భిన్నంగా ఉన్నాను.

ఇలా భేదాలు చెప్పుకుంటూ పోతే మనం ఉన్న ప్రపంచం అంతా భేదాలతో నిండి ఉంది. ఎప్పుడైతే మనలో భేదభావన రేగుతుందో, అప్పుడే ఇతరులకన్నా మనను మనం ఎక్కువగా ఊహించుకోవటమో, లేదా ఇతరుల ముందు మనను మనం చిన్నబుచ్చుకోవటమో చేస్తాము. అలా చేయటంవల్ల సంసారంలో కొట్టుమిట్టాడుతున్నాము.

ఇప్పుడు ఈ భేదభావాన్ని నాశనం చేయాలి. ఎలా? మూడు దశల్లో చేయాలి. స్వగతభేద నాశనం, సజాతీయ భేదనాశనం, విజాతీయ భేదనాశనం చేయాలి. అది ఎలా చేయాలో ఒకటొకటిగా చూద్దాము.

**స్వగతభేద నాశనం:–** స్వగతభేదం చూస్తే ఏమంటాము; తల బాగానే ఉంది కాని, కాలు నెప్పిగా ఉంది అంటాము. జాగ్రదావస్థలో చూస్తాము. అదే సుషుప్తిలో ఏ భేదాలు ఉండవు. అన్నీ ఒకదానితో ఒకటి లయమయిపోతాయి. సుషుప్తిలో ఎలా లయమయ్యాయో, అలా మనం ప్రయత్నపూర్వకంగా లయమవ్వాలి. నేను ప్రజ్ఞానం అని తెలుసుకోవాలి. వచ్చిపోయే అనేక వృత్తిజ్ఞానాల వెనుక ఉన్నది శుద్ధజ్ఞానం. అది నేనే. అనేక వృత్తులను సంజ్ఞానం, ఆజ్ఞానం, విజ్ఞానం, ప్రజ్ఞానం మొదలైనవాటిగా చూశాము. ఆలోచనలు మారుతాయి. అనుభవాలు మారుతాయి. కాని వాటిని సాక్షీభూతంగా చూసే నేను ప్రజ్ఞానాన్ని. నేను మారను. నాలో స్వగతభేదం లేదు.

**నేను, చూడబడే శరీరాన్ని కాను.**
**నేను, చూసే ఇంద్రియాలను కాను.**
**నేను, ఇవి పొందే అనుభవాలను కాను.**
**నేను, ఆలోచించే మనస్సును కాను.**
**నేను, మనసు పొందే విషయజ్ఞానాన్ని కాను.**
**నేను శుద్ధసత్‌ను, శుద్ధ చిత్‌ను.**

ఇక్కడితో ఆత్మ విచారణ ముగియలేదు. రెండవ దశ ఉంది.

**సజాతీయ భేదనాశనం:–** ఎన్ని శరీరాలు ఉంటే అన్ని చైతన్యాలు ఉన్నాయి అనే అపోహ ఉంది. కాని అన్నింటిలోనూ ఉండేది ఒకటే చైతన్యం – నాలోనూ, నీలోనూ, పిపీలికంలోనూ, ఈశ్వరునిలోనూ అంతటా ఒకటే.

ఏష బ్రహ్మ, ఇంద్ర, ప్రజాపతితో మొదలుపెట్టి యత్కించేదం ప్రాణి అని చెప్పుకొచ్చింది ఉపనిషత్తు.

**ఏవం సర్వ శరీరేషు ప్రజ్ఞానమ్.**

అందువల్ల సజాతీయ భేదం లేదు. ఆకాశం ఎలా ఒక్కటే ఉందో, అలా చైతన్యం ఒక్కటే ఉంది. అది అన్నింటిలోనూ ఉంది.– ఇప్పుడు మూడవ దశలోకి వెళుతున్నాము.

**విజాతీయ భేద నాశనం:-** విజాతీయ భేదం చూస్తే నేను చైతన్యం, బల్ల జడం అంటాము. కాని ఆత్మ విచారణ చేస్తే, నేను అన్ని శరీరాల్లోనూ ఉన్న చైతన్యాన్ని అంటాము. నా శరీరమే జడం. జడమైన నా శరీరంలో నేను చైతన్యాన్ని. జడమైన బల్ల నేనే. జడమైన పంచభూతాలు కూడా నేనే. నేను సాక్షి చైతన్యాన్ని మాత్రమే కాదు, జడమైన జగత్తు కూడా నేనే అని తెలుసుకుంటాము.

ఎంత అద్భుత భావనో చూడండి. ముందు దశలో ఆత్మ, అనాత్మ వివేకం చేసినప్పుడు ఆత్మ వేరు, అనాత్మ వేరు అంటాము. కాని ఇప్పుడు, చివరి దశకు వచ్చేసరికి జడప్రపంచం కూడా నాకు భిన్నంగా లేదు అంటాము. ఈ చైతన్యం ఏదో కాదు. అది నేనే.

**మదాత్మా సర్వ భూతాత్మా - గురు స్తోత్రం**

అన్ని జీవాత్మల్లోనూ ఒక పరమాత్మే ఉన్నాడు. అది నేనే.

**సందేహం -** ఇక్కడొక చిన్న సందేహం కలుగవచ్చు.

1. నేను చైతన్యాన్ని - ఒప్పుకుంటాను.
2. తక్కిన జీవరాసులూ, చైతన్యమైన నేనూ ఒక్కటే- ఒప్పుకుంటాను.
3. జడ ప్రపంచం, చైతన్యమైన నేను ఒక్కటి- ఇదెలా ఒప్పుకుంటాను?

**చేతన జడయోః ఐక్యం కథం స్యాత్?**

**ఐక్య సామాన్యాధికరణం** ఎలా కుదురుతుంది?

**జవాబు -** తాడు, పాము ఉదాహరణ ద్వారా చూద్దాము. అక్కడ పాము ఉంది అంటాము. కాని నిజానికి అది తాడు. అలాంటప్పుడు తాడు, పాముల ఐక్యం ఎలా కుదురుతుంది? ఎలా కుదురుతుందంటే అక్కడ నిజంగా పాము లేదు, మీరు పాము అనుకుంటున్నది నిజానికి తాడు. అలాగే జడప్రపంచం, ప్రజ్ఞానం అయిన నేను ఒకటే అనేది ఎలా కుదురుతుందంటే అక్కడ నిజంగా జడప్రపంచం లేదు. నేను జడప్రపంచం అనుకుంటున్నది నిజానికి చేతనమే.

**బ్రహ్మను తప్పుగా అర్థం చేసుకుంటే అది జగత్తు**
**జగత్తును సరిగ్గా అర్థం చేసుకుంటే అది బ్రహ్మ**
**అలాగే చైతన్యాన్ని పొరపాటుగా అర్థం చేసుకుంటే అది జడం**
**జడాన్ని సరిగ్గా అర్థం చేసుకుంటే అది చైతన్యం**

ఎలా చెప్పగలరు ఈ విషయం? ఉపనిషత్తే చెబుతున్నది. మంత్రం చివరి భాగంలోకి వెళదాము.

**సర్వం తత్ ప్రజ్ఞానేత్రమ్ –** నేత్రం అంటే అది సత్తా ప్రదాత. నేత్రం పదం నీయతేనుంచి వచ్చింది.

**సత్తాం ప్రాప్యతే అనేన ఇతి నేత్రం**

దానివల్ల అన్నిటి ఉనికీ తెలుస్తుంది.

సర్వం తత్ ప్రజ్ఞానేత్రం అంటే ఉన్నదంతా ప్రజ్ఞానేత్రం. మొత్తం జగత్తుకు ఉనికిని యిస్తున్నది ప్రజ్ఞానం. అంటే ప్రజ్ఞానం లేకుండా జగత్తుకు విడిగా ఉనికి లేదు. **బ్రహ్మ చైతన్యం సత్యం జగన్మిథ్యా.**

మిథ్య అంటే అది ఉన్నట్టుగా ఉంటుంది. కాని నిజంగా ఉండదు. అక్కడ పాము ఉన్నట్టుగా కనిపిస్తుంది. కాని విచారణ చేస్తే అక్కడ పాము నిజంగా ఉండదు.

**ప్రజ్ఞానే ప్రతిష్ఠితమ్ –** జడమైన జగత్తుకు ప్రజ్ఞానం సత్తాప్రదాత. ఎలా? చాలా చిన్న సూత్రం. ప్రజ్ఞానం కారణం, జగత్తు కార్యం. కారణం కార్యానికి సత్తాని ఇస్తుంది. బంగారం ఆభరణాలకు, మట్టి కుండకు సత్తాని ఇచ్చినట్టుగా ప్రజ్ఞానం జగత్తుకు సత్తాను ఇస్తుంది.

**కారణం నిర్వచనం –** సృష్టి,స్థితి,లయ హేతువు. దేనివల్ల సృష్టి, స్థితి లయలు జరుగుతాయో దానిని కారణం అంటారు.

**యతో వా ఇమాని భూతాని జాయన్తే**

**యేన జాతాని జీవన్తి యత్ప్రయత్యభిసంవిశన్తి**

దేన్నుంచి ఈ జీవాలు పుడతాయి, ఏది వీటికి స్థితికారణం, ఎందులో లయమవుతాయో, అది సృష్టి కారణం.

**ప్రజ్ఞానే ప్రతిష్ఠితమ్ –** సృష్టికారణం.

**ప్రజ్ఞానేత్రో లోకః –** స్థితికారణం.వ్యవహారయోగ్యతను ఇస్తుంది నేత్రం. అందుకని ప్రజ్ఞానేత్రం వ్యవహారానికి చెందినది.

**ప్రజ్ఞా ప్రతిష్ఠా –** లయకారణం.

ఆ విధంగా ప్రజ్ఞానం సృష్టి స్థితి లయ కారణం. చేతన అచేతన ప్రపంచానికి ఉనికినిస్తుంది.

**కారణ వ్యతిరిక్తకార్యం నాస్తి**

అందువల్ల ప్రజ్ఞానం సజాతీయ, విజాతీయ స్వగత భేదరహితం. అటువంటి చైతన్యాలు ఎన్ని? ఒకటే. నేను ప్రజ్ఞానం. ప్రజ్ఞానం ఆకారం ఎంత; అనంతం. అందువల్ల ప్రజ్ఞానం బ్రహ్మ.

ప్రజ్ఞానం అంటే నేను. నేను చైతన్యాన్ని. నేను సజాతీయ, విజాతీయ, స్వగత భేదరహితం బ్రహ్మను. **అహం బ్రహ్మ అస్మి**

ఒకవేళ నేను భేదం చూస్తే, అది పొరపాటు. భేదరహితమైన నేను భేదసహితంగా కనబడితే అది పొరపాటు. స్వప్నంలో స్వప్నపురుషుడు, స్వప్న జగత్తు భిన్నంగా ఉంటారు. అది నేను నా అజ్ఞానంవల్ల సృష్టించిన స్వప్నం.

నిజానికి నేను ఎవరు? నేను బ్రహ్మను. బ్రహ్ ధాతువునుంచి వచ్చింది. అంటే చాలా పెద్దది, పెద్దదానికన్నా పెద్దది.

**స భూమిం విశ్వతో వృత్వా అత్యతిష్ఠద్దశాంగులమ్ – పురుషసూక్తం**

బ్రహ్మ ఈ భూమండలాన్ని, అంతే కాకుండా బ్రహ్మాండ, అండాండ, పిండాండములనంతా వ్యాపించి ఉంది. వ్యాపించి వీటికంటే పది అంగుళాలు ఎక్కువగా ఉన్నది.

ఈ బ్రహ్మ ఎవరో కాదు.మొదట సూచించిన ఆత్మే

**ఆత్మా వా ఇదమేక ఏవాగ్ర ఆసీత్ న అన్యత్ కిఞ్చన మిషత్**

అక్కడ కూడా ఆత్మ సజాతీయ, విజాతీయ, స్వగత భేదరహితం అని చూశాము. అంటే ఉపనిషత్తు ఎలా మొదలుపెట్టిందో అలా ముగించింది. దీన్ని ఉపక్రమ ఉపసంహారం అంటారు.

**దీని సారాంశం – సజాతీయ, విజాతీయ, స్వగతభేద రహిత బ్రహ్మను నేను. నేను జీవాత్మను అనుకోవటం పొరపాటు. నేను అద్వితీయ బ్రహ్మను అని**

**తెలుసుకుంటే రాగద్వేషాలు కాని, భయం కాని, దుఃఖం కాని, పరిమితి కాని ఉండే అవకాశమే లేదు. సంసారం నన్ను భయపెట్టదు.**

ఇక్కడితో మహావాక్యం అయిపోయింది. ఇప్పుడు ఫలశ్రుతి.

**మంత్రం-4**

**స ఏతేన ప్రజ్ఞేనాత్మనాஉస్మాల్లోకాదుత్క్రమ్యాముష్మిన్ స్వర్గే లోకే సర్వాన్కామానాప్త్వాஉమృతః సమభవత్సమభవత్॥**

**స ఏతేన ప్రజ్ఞేనాత్మనా –** ప్రజ్ఞాన రూపమైన ఆత్మను నేను అని స్వీకరించటంవల్ల **అస్మాల్లోకాదుత్క్రమ్య –** దేహేంద్రియ మనోబుద్ధులు నేను అనుకునే అహంకారస్థాయినుంచి, బంధుమిత్ర, పుత్ర, కళత్రాలు నా వారు అనుకునే మమకారస్థాయినుంచి పైకి ఎదుగుతారు. లోకాలంటే లోకాలు కాదు. అహంకార మమకారాలు.

**అస్మాత్ లోకాత్ ప్రేత్య – కేన**

అహంకార మమకారాలు వదులుకుంటాము. దీనిని జీవన్ముక్తి అంటారు.

**అముష్మిన్ స్వర్గే లోకే –** స్వర్గలోకానికి వెళతాడని అసలు అర్థం. ఎవరైనా ప్రారబ్ధకర్మ ముగిశాక మరణిస్తారు. జ్ఞానికి మరణం తర్వాత పునర్జన్మ ఉండదు. కాని జ్ఞానికి మరణం తర్వాత ప్రయాణం ఉండదు. అందువల్ల అముష్మిన్ అంటే బ్రహ్మ. స్వర్గేలోకే అంటే స్వర్గం కాదు మోక్షం పొందుతాడు. జ్ఞాని జీవించి ఉండగా జీవన్ముక్తి పొంది, మరణించాక విదేహముక్తి పొందుతాడు. **సర్వాన్కామానాప్త్వా –** కోరికలన్నీ తీరుతాయి. కోరికలన్నీ తీరుతాయి అంటే నిజంగా తీరుతాయని కాదు,కోరికలు తీరినంత ఆనందం కలుగుతుంది. అంతేకాకుండా తను పూర్ణుడని ఎప్పుడైతే అర్థం చేసుకుంటాడో అప్పుడే అసలు కోరికలనేవే ఉండవు.

**సోஉశ్నుతే సర్వాన్ కామాన్స హ – బ్రహ్మానందవల్లీ**

**అమృతః సమభవత్సమభవత్** – పునర్జన్మ ఉండదు.

అమరత్వాన్ని పొందుతాడు. రెండు సార్లు చెప్పటంవల్ల ఈ ఫలాన్ని నొక్కి చెప్పటమే కాక, ఇంతటితో ఈ అధ్యాయం, ఈ ఐతరేయ ఉపనిషత్తు ముగిసిందని అర్థం.

**ఒక్కముక్కలో చెప్పాలంటే, అహం స్వజాతీయ విజాతీయ స్వగత భేద రహిత బ్రహ్మ అని తెలుసుకోవటంవల్ల ఇక్కడే ఇప్పుడే జీవన్ముక్తి, మరణించాక విదేహముక్తి కలుగుతాయి.**

## శాంతిపాఠం

**ఓం వాఙ్మే మనసి ప్రతిష్ఠితా, మనో మే వాచి ప్రతిష్ఠితమ్ ।**
**ఆవిరావీర్మ ఏధి। వేదస్య మ ఆణీస్థః ।**
**శ్రుతం మే మా ప్రహాసీరనేనాధీతేనాహోరాత్రాన్సందధామి॥**
**ఋతం వదిష్యామి । సత్యం వదిష్యామి। తన్మామవతు।**
**తద్వక్తారమవతు। అవతు మామవతు వక్తారమవతు వక్తారమ్॥**
**ఓం శాన్తిః శాన్తిః శాన్తిః**

ఉపనిషత్తు నేర్చుకునేముందు పఠించటంవల్ల ఆటంకాలు లేకుండా చేయమని కోరటం అవుతుంది. ఇప్పుడు ముగింపులో మళ్ళీ శాంతిపాఠం పఠించటం ఉద్దేశం కృతజ్ఞతలు తెలుపుకోవటం. ఆటంకాలు లేకుండా ఉపనిషత్తు అధ్యయనం చేయగలిగినందుకు, బ్రహ్మజ్ఞానం కలిగినందుకు కృతజ్ఞతలు చెప్పుకుంటున్నాము.

# ఐతరేయోపనిషత్ - సారాంశం

**ఉపోద్ఘాతం -**

ఐతరేయోపనిషత్ కూడా శంకరాచార్యులవారు భాష్యం రాసిన పది ఉపనిషత్తులలో ఒకటి. ఈ పదిలో ఋగ్వేదానికి చెందిన ఏకైక ఉపనిషత్తు ఇది.

ఐతరేయోపనిషత్‌కు ఈ పేరెలా వచ్చింది? ఇది ఐతరేయ అనే ఋషినుంచి వచ్చింది కాబట్టి ఐతరేయోపనిషత్ అనే పేరు వచ్చింది. ఈ ఋషికి మహీదాసః అని ఇంకొక పేరు ఉంది. అందువల్ల ఐతరేయ మహీదాస ఋషి అంటారు కొందరు.

ఐతరా పుత్రః ఐతరేయః

ఐతరా అనే పేరు గల స్త్రీకి పుత్రుడు కాబట్టి ఆయనకు ఐతరేయ అనే పేరు వచ్చింది. ఈ మహీదాస తన తండ్రి తనను అంతగా ప్రేమించటం లేదని క్రుంగిపోతుండేవాడు. తండ్రి నిజంగా పట్టించుకునేవాడు కాదో, ఈ పుత్రుని ఊహాగానమో మనకు నిజానిజాలు తెలియవు. ఏది ఏమైతేనేం, అతను బాధపడుతుండేవాడు. తల్లి దగ్గరకు వెళ్ళి తన బాధను పంచుకున్నాడు. తల్లి అతని బాధ తీర్చటంకోసం, వారి కులదేవతకు ప్రార్థన చేసింది. వారి కులదేవత భూదేవి. అతని పేరు మహీదాస అని అందువల్లనే వచ్చింది. మహీ అంటే పృథివీ, దాస అంటే భక్తుడు. అంటే భూదేవియొక్క భక్తుడు.

తల్లి ఐతర, తన పుత్రుడు ఐతరేయునితో కలిసి భూదేవికి పూజ చేస్తే, భూదేవి వారి ముందు ప్రత్యక్షమయ్యి, ఐతరేయునికి జ్ఞానాన్ని ప్రసాదించింది. ఈ జ్ఞానంవల్ల ఐతరేయుడు ఋషి అయ్యాడు, ఐతరేయ బ్రాహ్మణమ్ అందుకున్నాడు. అది ఋగ్వేదంలో పెద్ద భాగం. ఈ ఐతరేయ బ్రాహ్మణమ్‌లో 40 అధ్యాయాలు ఉన్నాయి. దీని చివర్లో ఐతరేయ ఆరణ్యకమ్ వస్తుంది. అందులో ఒక భాగమే ఐతరేయ ఉపనిషత్.

ఈ ఐతరేయోపనిషత్‌లో మూడు అధ్యాయాలు ఉన్నాయి. మొదటి అధ్యాయంలో మూడు ఖండాలు ఉన్నాయి కాని తక్కిన రెండింట్లోనూ ఒక్కొక్క ఖండమే ఉంది. వెరసి 3 అధ్యాయాలూ, 5 ఖండాలూ ఉన్నాయి. ఇది కొంచెం చిన్న ఉపనిషత్తు. ఇందులో 33 మంత్రాలు ఉన్నాయి.

**శాంతిపాఠం –**

దీని శాంతిపాఠం తక్కిన తొమ్మిది ఉపనిషత్తులకన్నా భిన్నమైనది. ఎందుకంటే ఐతరేయోపనిషత్ మాత్రమే ఋగ్వేదానికి చెందినది.

ఇది చాలా అద్భుతమైన ప్రార్థన. ఈ శాంతిపాఠంలో శిష్యుడు నాలుగు అంశాలను కోరుతున్నాడు. అవి జ్ఞానయోగ్యతాప్రాప్తి, జ్ఞానప్రాప్తి, జ్ఞాననిష్ఠాప్రాప్తి, ప్రతిబంధ నివృత్తి. జ్ఞానం పొందే అర్హత ఉండాలి; అర్హత ఉండగానే సరిపోదు, జ్ఞానం పొందాలి; జ్ఞానం పొందితే చాలదు, అది నన్ను మార్చేదిగా ఉండాలి; కనబడని ప్రతిబంధకాలనుంచి నేను విముక్తి పొందితేనే, ఈ మూడూ సాధ్యం. కనబడే ప్రతిబంధకాలను ఎలాగోలా తప్పించుకోవచ్చు, కాని అదృష్ట ప్రతిబంధకాన్ని ఈశ్వరానుగ్రహంవల్లనే తప్పించుకోగలను. ఈ నేపథ్యంతో ఈ శాంతిపాఠాన్ని చూద్దాము.

1. **జ్ఞానయోగ్యతాప్రాప్తి – వాఙ్మే మనసి ప్రతిష్ఠితా మనో మే వాచి ప్రతిష్ఠితమ్ –** నా వాక్కు, నా మనస్సు ఒకదానితో ఒకటి అనుసంధానం చెంది ఉండుగాక. నేను ఏం మాట్లాడినా మనస్ఫూర్తిగా మాట్లాడాలి. మనస్సు వాక్కులో లయమవాలి. దీని అర్థం, అన్ని అంగాలూ ఏకత్రాటిమీద నడవాలి. పంచజ్ఞానేంద్రియాలు, పంచకర్మేంద్రియాలు, నాలుగు అంతఃకరణాలు ఒక్క త్రాటిమీద నడవాలి.

2. **జ్ఞానప్రాప్తి – ఆవిరావీర్మ ఏధి –** పరమాత్మను ఆవిః అని సంబోధిస్తున్నాడు శిష్యుడు. ఆవిః అంటే ప్రకాశస్వరూపం. స్వయంప్రకాశరూప పరమాత్మ అని అర్థం. ఆవీర్మ ఏధి– నువ్వు నా ముందు ప్రత్యక్షమవు అంటే ఇక్కడ అర్థం నిన్ను నేను అర్థం చేసుకునేలా చేయి. ప్రస్తుతం నేను అజ్ఞానంతో కప్పబడి ఉన్నాను. నువ్వు అజ్ఞానమనే పొరను తొలగించటంలో నాకు తోడ్పడు.

తెర తీయగ రాదా అని త్యాగరాజ కీర్తన ఉంది. అదే అర్థం ఇక్కడ. ఇది జ్ఞానప్రాప్తిని సూచిస్తుంది.

3. **జ్ఞాననిష్ఠాప్రాప్తి – వేదస్య మ ఆణీస్థః** – శిష్యుడు రెండు ముఖ్యమైన అంగాలను సంబోధిస్తున్నాడు. అవి వాక్కు, మనస్సు. నాకు ఆత్మజ్ఞానాన్ని తీసుకురండి. ఎందుకు ఈ రెండూ తీసుకురావాలి? జ్ఞానం పొందేది గురుశిష్య సంవాదం ద్వారా. ఈ సంవాదానికి అవసరమైన అంగాలు – జ్ఞానాన్ని పొందే మనస్సు, గురువును ప్రశ్నలు వేసే వాక్కు. శిష్యుడు వేసే ప్రశ్నలు సూటిగా, స్పష్టంగా ఉండాలి; మనస్సు జ్ఞానాన్ని అర్థం చేసుకునేలా ఉండాలి. నిజానికి జీవితంలో అనేక సమస్యలు ఈ రెండు శక్తులూ సరిగ్గా పనిచేయక పోవటంవల్లనే వస్తున్నాయి. ఇప్పుడు ఈ శక్తులను పెంపొందించుకోవటానికి కోర్సులను ప్రవేశపెడుతున్నారు కాని సరిగ్గా ఎలా వినాలో నేర్పించే ఆ కోర్సుల్లో సరిగ్గా వినరు. అది పక్కన పెడితే, వాక్కు, మనస్సులను జ్ఞానం తీసుకురమ్మని కోరుతున్నాడు.

**శ్రుతం మే మా ప్రహాసీః** – ఇక్కడ మనస్సుతో అంటున్నాడు, ఓ మనస్సా, నువ్వు శ్రవణంలో విన్నది మర్చిపోకుండా, తాజాగా నిలచివుండేలా చేయి. ఈ ప్రార్థన జ్ఞాననిష్ఠాప్రాప్తికి చేస్తున్నాడు. ఈ జ్ఞానం క్లాసుకు మాత్రమే పరిమితి కాకుండా, జీవితంలో ఎదురయ్యే ఒడిదుడుకులను ఎదుర్కొనేందుకు తోడ్పడాలి.

**అనేనాధీతేనాహెూరాత్రాన్సందధామి** – నా జీవితాన్ని ఈ అద్భుతమైన బోధలో రమించేలా గడపాలని ఉంది. నేను నిదిధ్యాసనం చేయగలగాలి. దానికి తోడ్పడు ఓ మనసా అంటున్నాడు. ఈ భాగం జ్ఞాననిష్ఠాప్రాప్తిని సూచిస్తుంది.

**ఋతం వదిష్యామి, సత్యం వదిష్యామి** – శిష్యుడు, పరమాత్మను ఋతం, సత్యంగా కీర్తిస్తున్నాడు. తైత్తిరీయంలో ఋతం అంటే శాస్త్రీయజ్ఞానం అనీ, సత్యం అంటే ఋజువర్తన అనీ చూశాము. ఇక్కడ ఇంకొక ఆచార్యుడు ఇంకొక అర్థాన్ని ఇస్తున్నాడు. ఋతం అంటే పారమార్థిక సత్యం అనీ, సత్యం అంటే వ్యావహారిక సత్యం అనీ వివరించాడు. ఓ దేవా, నువ్వు అపరబ్రహ్మవు, పరబ్రహ్మవు కూడా.

4. **ప్రతిబంధ నివృత్తి** – నాకు జ్ఞానం వచ్చేదాకా, నీకొక పనిని అప్పజెపుతున్నాను. నాకు జ్ఞానం వచ్చేదాకా నన్నూ, నా గురువునూ కాపాడాలి.

**తన్మామవతు తద్వక్తారమవతు** – నన్ను కాపాడు, నా గురువును కాపాడు.

**అవతుమామవతువక్తారమవతు వక్తారమ్** – మళ్ళీ నన్నూ, నా గురువునూ రక్షించమని కోరటం ద్వారా, దీని ప్రాముఖ్యతను తెలియజేస్తున్నాడు. ఈ ప్రార్థన ప్రతిబంధ నివృత్తిని సూచిస్తున్నది.

**ఓం శాంతిః శాంతిః శాంతిః** – అధ్యాత్మిక, అధిభౌతిక, అధిదైవిక ప్రతిబంధకాలను తొలగించు అని కోరుతున్నాడు.

## అధ్యాయం 1 – అధ్యారోప, అపవాద ప్రకరణం

ఇందులో 23 మంత్రాలు, మూడు ఖండాల్లో ఉన్నాయి. మొదటి అధ్యాయంయొక్క తాత్పర్యం ఆత్మజ్ఞానం – అధ్యారోప అపవాదం ద్వారా.

### అధ్యారోప, అపవాద ప్రక్రియ

**అధ్యారోపం** – అంటే సృష్టి. ఉపనిషత్తు ముందు పరమాత్మనుంచి సృష్టి గురించి చెబుతుంది.

**ఆత్మావా ఇదమేక ఏవాగ్ర ఆసీత్। నాన్యత్కిఞ్చన మిషత్।** 1.1.1

దీని అర్థం పరమాత్మ కారణం, జగత్తు కార్యం.

ఈ సృష్టి గురించి చెప్పటంవల్ల ఏం తెలుసుకుంటాము? ఉదాహరణకు బంగారం కారణం, గాజు కార్యం అని నేర్చుకుంటే, దాని ద్వారా మనం గ్రహించే సత్యం ఏమిటి?

1. గాజు అనే కార్యం ఒక పదార్థం కానేకాదు, ఉన్నది ఒకటే పదార్థం. అది బంగారం మాత్రమే. బంగారం మాత్రమే గాజు పుట్టకముందూ, గాజులోనూ, గాజు కరిగిపోయాకా ఉంటుంది. మరయితే గాజు పదం ఏమిటి? గాజు అనే పదం పదార్థాన్ని సూచించదు, అది నామం, రూపం మాత్రమే. దాని రూపాన్నిబట్టి

నామం మారుతుంది. అందువల్ల నామం, రూపానికి మాత్రమే చెందుతుంది కాని పదార్థానికి కాదు. గాజు అనే కార్యం ఒక రూపానికి నామం.

దీనివల్ల మనం గ్రహించాల్సిన సిద్ధాంతం ఇది. ఈ జగత్తులో ఉన్న అన్ని కార్యాలు, భిన్నరూపాలకు ఇవ్వబడిన నామాలు మాత్రమే.

యతు కార్యం, తతు నామరూపాత్మకమ్

ఏది కార్యమైనా కూడా, అది ఒక రూపానికి ఒక నామం మాత్రమే. రూపం అంటే ఏమిటి? రూపం ఒక పదార్థం కాదు, అది ఒక పదార్థానికి ఒక గుణం మాత్రమే. దీన్ని ఇంకొంచెం పొడిగిస్తే –

ఏ కార్యమైనా ఒక రూపం మాత్రమే
ఏ రూపమైనా ఒక గుణం మాత్రమే

అందువల్ల ఏ కార్యమైనా ఒక గుణం మాత్రమే.

ఎ = బి, బి = సి; అందువల్ల ఎ = సి సూత్రం ఉపయోగించాలి ఇక్కడ. అందువల్ల ఎన్ని కార్యాలు ఉంటే, అన్ని గుణాలు ఉన్నాయి. ఈ గుణాలు పదార్థానికి గుణాలు. ఆభరణాలన్నీ ఒక్క పదార్థానికే గుణాలు, ఆ పదార్థం బంగారం. బంగారం కారణం. అందువల్ల,

కార్యాలన్నీ కారణంయొక్క గుణాలు మాత్రమే
కుండలన్నీ మట్టియొక్క గుణాలు మాత్రమే
ఆభరణాలన్నీ బంగారంయొక్క గుణాలు మాత్రమే

జగత్తు కార్యం, బ్రహ్మ కారణం అయినప్పుడు సూత్రం ఏమిటి?

జగత్తు బ్రహ్మయొక్క గుణాలు మాత్రమే.

ఉన్నదొక్కటే పదార్థం, జగత్తు అంతా దానికి విశేషణం. దీన్ని విశిష్టాద్వైతం అంటారు. విశిష్టాద్వైతం ముఖ్యమైన దశ కాని అంతిమదశ కాదు.

జగత్తు పరమాత్మయొక్క విశేషణం అంటే ఒక సమస్య ఏర్పడుతుంది. అంతకు ముందు, భగవంతుడు ఈ లోపభూయిష్టమైన జగత్తును ఎందుకు సృష్టించాడు అని అడుగుతుండేవారు. నీటి సమస్య ఉంది, దోమలు స్వైరవిహారం చేస్తాయి.

కాని ఇప్పుడు జగత్తు బ్రహ్మయొక్క విశేషణం అంటే, ప్రశ్న మారుతుంది. భగవంతుడు ఈ దోషభూయిష్టమైన గుణాలను ఎందుకు భరించాలి?

అందువల్ల తర్వాత దశకు వెళ్ళాలి, అది అపవాదం.

**అపవాదం** – అపవాదం అంటే త్రోసిపుచ్చటం. నిజానికి పరమాత్మకు ఈ జగత్తు అనే విశేషణం లేదు అంటుంది. భగవంతుడు విశిష్ఠ కాదు, భగవంతుడు నిర్విశేష అద్వైతం. పరమాత్మకు మంచి గుణాలూ లేవు, చెడు గుణాలూ లేవు. భగవంతుడు ధర్మాధర్మ, పుణ్యపాప విలక్షణం.

ఇలా నిషేధించటంలోని ప్రత్యేకత ఏమిటి? ఇలా జగత్తులోని గుణాలను నిషేధించటంలోని అర్థం ఇది – జగత్తు అనుభవించటానికి అందుబాటులో ఉంది కాని, జగత్తు సత్యం కాదు. కనుక అనుభవంలోకి వచ్చే ఈ జగత్తు ఉన్నా లేనట్టే. ఈ జగత్తును నిజంగా స్వీకరించనవసరం లేదు. అది తక్కువస్థాయికి చెందినది. ఈ విశేషణాత్మక జగత్తును నిషేధించటం ద్వారా అది మిథ్య అవుతుంది.

దీనికి ఉదాహరణ స్వప్నప్రపంచం. స్వప్నం అనుభవంలోకి వస్తుంది కాని, ఆ అనుభవాన్ని ఇక్కడ వాడుకోలేము.

మళ్ళీ అధ్యారోప అపవాదాన్ని టూకీగా చూస్తే –

దశ 1 – జగత్తు భగవానునియొక్క గుణం

దశ 2 – జగత్తు భగవంతునియొక్క మిథ్యాగుణం అవుతుంది.

అప్పుడు నిర్విశేష భగవంతుడు మాత్రమే మిగులుతాడు.

ఈ పద్ధతిని ఈ ఉపనిషత్తులోని మొదటి అధ్యాయంలో చూస్తాము. ఇక్కడ అధ్యారోపాన్ని చాలా వివరంగా చెప్పుకొొచ్చి, అపవాదాన్ని చాలా త్వరగా ముగించింది. నిజం కూడా అంతే. దేన్నైనా కట్టటం చాలా కష్టం, పడగొొట్టటం చాలా తేలిక.

**ఖండం 1** – ఇది అధ్యారోప భాగము. ఇందులో లోకసృష్టి, దేవతాసృష్టి చూస్తాము. నిజానికి పద్నాలుగు లోకాలు ఉన్నాయి కాని ఈ ఉపనిషత్తు వాటిని నాలుగు లోకాలుగా విభజించింది.

**అమ్భోమరీచీర్మరమాపః** అంది. అంభః, మరీచీః, మరమ్, ఆపః ఈ లోకాల పేర్లు.

| | | |
|---|---|---|
| అంభః | – స్వర్గలోకానికి పైన ఉన్న లోకాలు | 5 |
| మరీచీః | – భువర్లోకం | 1 |
| మరః | – భూలోకం | 1 |
| ఆపః | – అధోలోకాలు | 7 |

తర్వాత సృష్టి మూడేసి అంశాల చొప్పున జరిగింది. అవి గోళకాలు, ఇంద్రియాలు, అధిష్ఠాన దేవతలు. ఆ విధంగా మొదటి ఖండంలో లోకాల సృష్టి, లోకపాలకుల సృష్టి జరిగింది.

**ఖండం 2** – ఈ ఖండంలో ఆకలిదప్పులు, ఈ లోకపాలకులకు స్థూలశరీరాల సృష్టి జరిగింది. లోకపాలకులు ఆవు, గుర్రం శరీరాలు వద్దని మనుష్యశరీరం ఎన్నుకున్నారు. తర్వాత పరమాత్మ వారిని శాసించిన రీతిలో శరీరంలోని ఆయా భాగాలలో చేరుకున్నారు. ఉదాహరణకు అగ్నిదేవత వాక్కుతో కలిసి నోటిలో ప్రవేశించాడు. ఆ వివరాలను ఈ క్రింది పట్టికలో చూడవచ్చు.

| **అధిష్ఠాన దేవత** | **ఇంద్రియం** | **గోళకం** |
|---|---|---|
| అగ్ని | వాక్కు | ముఖం |
| వాయువు | ప్రాణం | నాసిక |
| ఆదిత్యుడు | చక్షువు | అక్షిణీ |
| దిశలు | శ్రోత్రం | చెవులు |
| ఓషధివనస్పతులు | రోమాలు | త్వక్ |
| చంద్రుడు | మనస్సు | హృదయం |
| మృత్యువు | అపానం | నాభి |
| శిశ్నం | రేతస్సు | నీరు |

ఆకలిదప్పులను అందరు దేవతలతో కలవమన్నాడు.

**ఖండం 3 –** అన్నసృష్టి జరిగింది. శరీరం, ఆకలిదప్పులు వచ్చాక, అన్నసృష్టి జరగాలి. అన్నం తనను అందరూ తింటారని పరుగు తీసింది. అన్నం వెంట అన్నీ పరిగెత్తాయి కాని అపానం మాత్రమే అన్నాన్ని పట్టుకోగలిగింది. అన్నాన్ని పట్టుకోవటంవల్ల అపానవాయువుకు అన్న ఆయుః (అన్నాయుః) అనే బిరుదు వచ్చింది. మనకు ఆయుష్షును పెంచే అన్నాన్ని అపానం ఇవ్వటంవల్ల అపానవాయువు మనకు దీర్ఘాయుష్షును ఇస్తుంది. అన్నం అంటే తినే అన్నమే కాదు, శబ్దస్పర్శరూపరసగంధాలతో కూడిన బాహ్యప్రపంచం.

ఈ ఖండంలో 12, 13, 14 మంత్రాలు చాలా ముఖ్యమైన మంత్రాలు. ముఖ్యమైన బోధ వీటిలో వస్తుంది.

ఈ ప్రపంచాన్ని, శరీరాన్ని సృష్టించాక పరమాత్మే స్వయంగా జీవాత్మగా శరీరంలోకి ప్రవేశించాడు.

**స ఏతమేవ సీమానం విదార్యైతయా ద్వారా ప్రాపద్యత ।** 1.3.12

నడినెత్తిమీద ఉన్న బ్రహ్మరంధ్రాన్ని చీల్చుకుని, ఆ ద్వారం ద్వారా ప్రవేశించాడు. దీన్ని అనుప్రవేశశ్రుతి అంటారు. అంటే శరీరంలో ఉన్న జీవాత్మ వేరే ఎవరో కాదు. సాక్షాత్తూ పరమాత్మే. నా స్వప్నప్రపంచంలో అంతేకదా! నేనే స్వప్నప్రపంచాన్ని సృష్టించి, దాన్ని అనుభవించటానికి నేనే స్వాప్నికునిగా అందులోకి ప్రవేశిస్తాను. జాగ్రద్ పురుషుడు ఎలాగైతే స్వప్నపురుషుడు అవుతాడో, అలాగే పరమాత్మే జాగ్రద్ పురుషునిగా వచ్చాడు. అదే అనుప్రవేశం. అనుప్రవేశం చేసినప్పుడు **కోఽహమితి** అనుకున్నాడుట పరమాత్మ. ఎప్పటికన్నా ఈ జీవి నేను శరీరం కాను, ఇంద్రియాలు కాను, మనసు కాను, అయితే నేనెవరు అని జీవాత్మ అడగకపోతాడా అనుకున్నాడుట పరమాత్మ.

తరువాత జీవాత్మ, పరమాత్మ ఐక్యం గురించి చెప్పింది ఉపనిషత్తు. అనుప్రవేశ శ్రుతి వస్తే ఇది సహజంగానే వస్తుంది.

**స ఏతమేవ పురుషం బ్రహ్మ తతమమపశ్యదిదమదర్శమితీ 3 ॥** 1.3.13

ఈ జీవాత్మకు తనే పరమాత్మను అని తెలియదు. అందువల్ల సంసారంలో పడిపోయాడు. కాని తరువాత ఏదో పుణ్యంవల్ల ఆత్మజ్ఞానం పొందాడు. తన శరీరంలో ఉన్న జీవాత్మే సర్వవ్యాపకమైన బ్రహ్మ అని తెలుసుకున్నాడు. ఆ విధంగా ఐక్యం వచ్చింది.

**కిమిహాన్యం వావదిషదితి** – నేనే బ్రహ్మను అని తెలుసుకున్నాక, ఈ జ్ఞాని బ్రహ్మకు భిన్నంగా ఏదైనా ఉందా అని విచారణ చేశాడు. బ్రహ్మకు భిన్నంగా కొంచెం కూడా ఏదీ లేదని తెలుసుకున్నాడు. ఎలా తెలుసుకున్నాడు? కారణానికి భిన్నంగా కార్యం లేదని అర్థం చేసుకున్నాడు. జగత్తు కేవలం నామరూపాత్మకమైన జగత్తు అవుతుంది. అంతకుముందూ, ఇప్పుడూ, తర్వాత కూడా ఉన్నదంతా బ్రహ్మే. విశేషణ, విశేష్యరూప ప్రపంచం లేదు.

ఇది **అపవాద ప్రక్రియ** అవుతుంది. జగత్తు లేదు అని అంటే, జగత్‌యొక్క అనుభవాన్ని ఖండించటం లేదు, కాని దాన్ని సత్యంగా తీసుకోకూడదు. జాగ్రదావస్థలో జాగ్రత్ ప్రపంచాన్ని చూస్తాము; స్వప్నావస్థలో స్వప్నప్రపంచాన్ని చూస్తాము; ఇలా అనుభవంలోకి వచ్చే ఈ లోకాల మాటేమిటి? నమ్మలేని నిజాన్ని ఉపనిషత్తు చెబుతుంది.

**త్రయః స్వప్నా** – సుషుప్తి, స్వప్నావస్థ, జాగ్రదావస్థ – మూడూ స్వప్నాలే. మరి ఏది సత్యం? వాటిని చూసే నేను సత్యం, తక్కినవన్నీ స్వప్నం.

అపవాదంలో జగత్‌ను మిథ్యగా కొట్టివేస్తాము. ఇప్పుడు ఉపనిషత్ బోధ ఏమిటి? బ్రహ్మ సత్యం, జగన్మిథ్యా, నేను బ్రహ్మను కాబట్టి నేను సత్యం, జగత్తు మిథ్య.

## అధ్యాయం 2 – సంసార ప్రకరణం

ఇందులో ఒకటే ఖండం ఉంది. ఇందులో ఆరు మంత్రాలు ఉన్నాయి. ఇది అజ్ఞాన జీవాత్మ ప్రయాణాన్ని వివరిస్తుంది. నేను పరమాత్మను అని తెలుసుకోని జీవాత్మ పరిస్థితి ఏమిటి? మొదట్లో జీవితం బాగానే ఉన్నా, రానురాను దుఃఖభూయిష్టమవుతుంది. పునరపి జననం, పునరపి మరణం వృత్తంలో పడి

తిరుగుతుంటాడు. తక్కిన అంశాలలాగానే, దీన్ని కూడా ఈ ఉపనిషత్తు తనదైన శైలిలో చెబుతుంది.

ఇక్కడ జీవాత్మ నిరంతర ప్రయాణాన్ని మూడు దశలుగా వివరిస్తున్నది ఉపనిషత్తు.

**త్రయః అవసథాః** – అవసథకూ, జన్మకూ మధ్య భేదం ఉంది. అవసథ అంటే స్థానం. అలా ఒక శిశువు మూడు అవసథల్లో ఉండి, మూడు జన్మలు పొందుతుంది అంటున్నది ఉపనిషత్తు.

**అవసథ 1** – ఒక వైదికజీవి గురించిన పుట్టుక పంచాగ్ని విద్యలో వస్తుంది. అందులో ఐదు దశలు వస్తాయి. అవి స్వర్గం, మేఘం, పృథివీ, పురుషుడు, నారి. ఐతరేయోపనిషత్‌లో పై మూడు దశలూ వదిలేసి పురుషునిలో ఉన్న దశను అవసథ 1 అంటున్నది. పురుష రేతస్సులో ఉంటుంది జీవి. అతను తన రేతస్సును స్త్రీయోనిలో వదులుతాడు. అది మొదటి జన్మ అవుతుంది అంటే తండ్రి పుత్రునికి జన్మ ఇచ్చినట్టు అవుతుంది.

**అవసథ 2** – మొదటి జన్మ, రెండవ అవసథ అవుతుంది. అంటే స్త్రీ గర్భం అవసథ 2 అవుతుంది. తల్లి శిశువును ఈ భూమ్మీదకు తీసుకువస్తుంది. అది రెండవ జన్మ అవుతుంది.

**అవసథ 3** – తల్లి గర్భంనుంచి భూమ్మీదకు వచ్చిన శిశువు జీవితం అవసథ 3. అంటే తన శరీరంలోనే జీవిస్తుంది. ఈ శరీరం వదలి ఇంకో శరీరంలో మళ్ళీ పునర్జన్మ ఎత్తుతాడు. అది మూడవ జన్మ అవుతుంది. కాని దాన్ని తండ్రిపరంగా చెబుతున్నది ఉపనిషత్తు. దాన్ని మనం పుత్రునికి అన్వయించుకోవాలి.

ఈ మూడు జన్మలతో ముగింపుకు వస్తుందని కాదు అర్థం. జీవి పునరపి జననం, పునరపి మరణం పొందుతూనే ఉంటాడు. ఉపనిషత్తు ఈ సంసారవృత్తాన్ని వర్ణించిన కారణం, ఈ వృత్తంమీద వైరాగ్యం పుట్టించి, దీన్నించి బయటపడేయాలని. వైరాగ్యం పుడితే, ఈ వృత్తంనుంచి బయటపడే మార్గం వెతుక్కుంటాము.

నిజంగా ఇలా వృత్తంనుంచి బయటపడగలమా అనే సందేహం వద్దు అని చెప్పటానికి ఉపనిషత్తు ఒక ఋషి ఉదాహరణను ఇస్తున్నది. వామదేవ ఋషి తను తల్లిగర్భంలో ఉండగానే తన జ్ఞానాన్ని ప్రకటించాడు.

**గర్భ ఏవైతచ్ఛయానో వామదేవ ఏవమువాచ** 2.5

నేను అనేక జన్మల శరీరశృంఖలాలను ఛేదించుకుని బయటపడ్డానని తల్లి గర్భంలో ఉండగానే ప్రకటించాడు.

ఈ అధ్యాయంలో ఒక ప్రత్యేకతను చూస్తాము.

**అపక్రామత(న్తు) గర్భిణ్యః** – ఈ అధ్యాయం మొదట్లో ఈ మాటలు వస్తాయి. ఇది మంత్రం కాదు. సభలో ఎవరైనా గర్భిణీ స్త్రీలు ఉంటే బయటకు వెళ్ళమని వారికి ఇచ్చిన సూచన. శిశువు జన్మ గురించి మాట్లాడుతుంది కాబట్టి అలా చెప్పింది. దీన్నిబట్టి ఆత్మజ్ఞాన విచారణ స్త్రీలు కూడా చేసేవారని తెలుస్తున్నది.

**అధ్యాయం 3 – మహావాక్య ప్రకరణం**

ఇందులో కూడా ఒకటే ఖండం ఉంది. నాలుగే మంత్రాలు ఉన్నాయి. ఇది మొదటి అధ్యాయంయొక్క సారాంశం. అందువల్ల ఇందులో కూడా జీవాత్మ, పరమాత్మ ఐక్యాన్ని చూస్తాము.

**కోఽ యమాత్మేతి? కతరః స ఆత్మా** – నేను ఎవరు? ఈ రెండింటిలో ఏది ఆత్మ? బ్రహ్మరంధ్రం ద్వారా పరమాత్మ ప్రవేశించాడు. అరికాలినుంచి హిరణ్యగర్భ ప్రవేశించాడు. ఏది అసలు ఆత్మ? చిద్రూప పరమాత్మనా, చిదారూప హిరణ్యగర్భనా?

కోఽ హమితి – నేను శరీరం కాను, నేను ఇంద్రియాలను కాను, నేను మనస్సు కాను. అవి నేను కాకపోతే నేనెవరిని అని మనిషి ఎప్పుడో ఒకప్పుడు ప్రశ్నించుకోకపోతాడా అని పరమాత్మ అనుకుంటాడని రెండవ అధ్యాయంలో చూశాము. సరిగ్గా అలాగే చర్చ జరుగుతుంది మూడవ అధ్యాయంలో. సూక్ష్మశరీరంలో ఉన్న ఏ అంగమూ కూడా ఆత్మ కాదు. ఎందుకు? అవి ప్రమాణాలు కాబట్టి, మార్పు చెందుతాయి కాబట్టి. శరీరం, ఇంద్రియాలు, మనస్సు, ఇవేవీ

నేను కాకపోతే, నేను ఎవరు? వీటిని సాక్షిగా చూస్తున్నది ఒకటి ఉంది. అదే సాక్షిచైతన్యం. ఇక్కడ ప్రజ్ఞానం అన్నది ఉపనిషత్తు. చైతన్యాన్ని ఎలా తెలుసుకోవాలి?

చైతన్యం + వృత్తి = అనుభవం

చైతన్యం = అనుభవం – వృత్తి

అనుభవంలోంచి వృత్తిని తీసేస్తే మిగిలేది చైతన్యం మాత్రమే.

మారే అనుభవాలు – మారే వృత్తులు = మారని చైతన్యం.

మారే చైతన్యం అనకూడదు. ఇక్కడితో త్వం పదార్థ విచారణ ముగిసింది.

**ప్రజ్ఞానం బ్రహ్మ** – ప్రతి వృత్తి వెనకనున్నది ఈ చైతన్యం. అదే బ్రహ్మ. ఆత్మ = బ్రహ్మ అని ముందే చూశాము. ఆత్మావా ఇదమేక ఏవాగ్ర ఆసీత్. ఈ బ్రహ్మ ఎక్కడ ఉందో ఒక పెద్ద పట్టికనే ఇచ్చింది ఉపనిషత్. సీమటపాకాయ టపాటపా మ్రోగినట్టు, గడగడా ఒక పెద్ద పట్టిక వస్తుంది. ఈ బ్రహ్మే చతుర్ముఖ బ్రహ్మ, ఇంద్రుడు, ప్రజాపతి, దేవతలు, పంచభూతాలు, జీవరాశులు, మనుష్యులు, జంతువులు, వృక్షాలు, క్రిమికీటకాలు, పక్షులు అన్నింటిలోనూ ఉంది. ఇది తత్ పదార్థ విచారణ.

**సర్వం తత్ప్రజ్ఞానేత్రమ్** – ఉన్నదంతా ప్రజ్ఞానేత్రం. మొత్తం జగత్తుకు ఉనికిని ఇస్తున్నది ప్రజ్ఞానం. అంటే ప్రజ్ఞానం లేకుండా జగత్తుకు విడిగా ఉనికి లేదు. బ్రహ్మ చైతన్యం సత్యం జగన్మిథ్యా.

**ప్రజ్ఞానే ప్రతిష్ఠితమ్** – జడమైన జగత్తుకు ప్రజ్ఞానం సత్తా ప్రదాత. కారణం కార్యం అంతటా ఉంటుంది.

ఇటువంటి ప్రజ్ఞానాలు ఎన్ని? ఒకటే. నేను ప్రజ్ఞానం, నేను చైతన్యాన్ని, నేను సజాతీయ, విజాతీయ, స్వగత భేదరహితం బ్రహ్మను. **అహం బ్రహ్మ అస్మి.** అసి పదార్థం అర్థం కూడా వచ్చింది.

**ఫలశ్రుతి** – నేను ప్రజ్ఞానం బ్రహ్మను అని జ్ఞానం పొందితే రాగద్వేషాలు, భయం, దుఃఖం ఉండే అవకాశమే లేదు. అటువంటి జ్ఞాని జీవించి ఉండగా జీవన్ముక్తి పొందుతాడు. మరణించాక విదేహముక్తి పొందుతాడు.

ఇందులో ముఖ్యమైన మంత్రాలు -

1.1.1 - అధ్యారోపం

1.3.12, 13 - అనుప్రవేశం, ఐక్యం, అపవాదం

2.5 - వామదేవ ఋషి

3.3 - మహావాక్యం

**శాంతిపాఠం**

**ఓం వాఙ్మే మనసి ప్రతిష్ఠితా, మనో మే వాచి ప్రతిష్ఠితమ్ ।**
**ఆవిరావీర్మ ఏధి। వేదస్య మ ఆణీస్థః ।**
**శ్రుతం మే మా ప్రహాసీరనేనాధీతేనాహోరాత్రాన్సందధామి॥**
**ఋతం వదిష్యామి । సత్యం వదిష్యామి। తన్మామవతు।**
**తద్వక్తారమవతు। అవతు మామవతువక్తారమవతు వక్తారమ్॥**
**ఓం శాన్తిః శాన్తిః శాన్తిః**

Some Important Links of
**ARSHA VIDYA TARANGINI TRUST**

Our books are also available as free downloadable soft copies at
http://www.telugubhakti.com/telugupages/Adwaitam/Adwaitam.htm

Our Gita Classes in Telugu, Audio Files are available for download -
http://www.telugubhakti.com/telugupages/Adwaitam/BG/BGaudios.htm

**ARSHA VIDYA TARANGINI** conducts Vedanta Online Classes
in M S Teams every Tuesday to Saturday
Time 6.00 p.m to 7.30 p.m
Information of our online classes is available -
http://www.telugubhakti.com/AVTT/onlineclasses.htm

Arsha Vidya Tarangini Online Classes' videos are available -
https://www.youtube.com/channel/UCvN1vYmtiImR1-r9AIVI6QQ/playlists

Name of our YouTube Channel is **ARSHA VIDYA TARANGINI**
you can simply search for **ARSHA VIDYA TARANGINI** in google or YouTube